నమ్మలేని నిజాలు

కాల్బంతి ఆట
మైదానాలు కరువు
విశ్వైక క్రీడ

పిరికి కలం
పీడనకు చేయూత
స్వేచ్ఛకు చీడ

మారిన పాకం
వడ్డన మరో రూపం
పరాన్న జీవి.

పక్షి వాచకం
కాకి కోకిల రాగం
హంస సమీక్ష.

రంగుల హోళి
కామదగ్ధ కథనం
ఆనంద బంధం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ఉత్తీర్ణత శాతం, ఈ
యేడు పెరిగిందోయ్ !
కాకపోతె మగ పిల్లల
సంఖ్య తరిగిందోయ్ !.
మగ పిల్లలకేమైందో
తెలివి ఆరబెట్ట !
టెన్త్ క్లాస్ ఫలితాల్లో
ఆడవాళ్లె దిట్ట !

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 2-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:208 పేజీలు:6 వెల: రూ.1/-

# ప్రధాని పదవికే కళంకితం తెచ్చేలా మోడీ ప్రకటనలు.. మంత్రి పొన్నం ప్రభాకర్

## -రెండు విడతల పోలింగ్‌తో అసహనం
## -రిజర్వేషన్ల తొలగింపునకు కుట్ర
## -సిరిసిల్ల చేనేతకు బండి ఏమి చేశారు
## -మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్ల, మే 1 : గత వారం రోజులుగా ప్రధాన మంత్రి ప్రకటనలు చూస్తే ప్రధాని పదవికే కళంకితం తెచ్చే విధంగా దిగజారి మాట్లాడుతున్నారని, మొదటి, రెండవ దశ పోలింగ్ ఎన్నికల తరువాత ప్రధాన మంత్రి మోడీ వైఖరి లో పూర్తిగా అసహనం వచ్చిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఉత్తర, దక్షిణ భారత దేశంలో జరిగిన పోలింగ్ లో బీజేపీ గ్రాఫ్ పడిపోవ దానికి నరేంద్ర మోడీ ప్రకటనలే కారణమన్నారు. 30 సంవత్సరాల తరువాత బీజేపీ కి స్పష్టమైన మెజారిటీ వచ్చిందని, అంత మెజారిటీ వచ్చినా అబ్ కి బార్ చార్ సౌ అంటున్నారని, దేశంలో ఉన్న మేదావులు , ప్రజాస్వామిక వాదులు ఆలోచించాలన్నారు.

దేశంలోని సంపద అంతా అదానీ, అంబానీ లకు అప్పగిస్తున్నారని, మోడీ నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని, ప్రధాన మంత్రి 400 సీట్లు గెలుచుకుంటే బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి ఎస్సి, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తొలగించవచ్చుని చూస్తున్నారన్నారు. మూడవ వంతు అంటే 543 ఎంపీల్లో 400 మెజారిటీ ఉంటే రాజ్యాంగాన్ని మార్చవచ్చుని చూస్తున్నారని, భవిష్యత్ లో నియంతలాగ ఉండాలని చూస్తున్నారన్నారు. దేశ సంపద అంతా అదానీ, అంబానీలకు గుజరాత్ కుటుంబాలకు లకు అప్పగించాలని చూస్తున్నారని, దేశంలో దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు ఉండకుండా చూడాలనీ చేస్తున్నారన్నారు. అందుకే ఆ ఆలోచనతో అబ్ కి బార్ చార్ సౌ అంటున్నారని పేర్కొన్నారు. నిజానికి క్షేత్ర స్థాయిలో బీజేపీకి ఎవరు ఓటు వేయడం లేదని, గతంలో 4 లక్షల మెజారిటీతో గెలిచిన సీట్లు కూడా ఇప్పుడు 50 వేలు, లక్ష తో ఓడిపోతున్నాయని ఇంటెలిజెన్స్ సర్వేలు చెబుతున్నాయని వెల్లడించారు.

దేశంలో కాంగ్రెస్ వస్తె ఆస్తులు ముస్లింలకు ఇస్తారని అంటున్నాడని, మంగళ సూత్రాలు గుంజుకుంటారని అంటున్నాడని, ప్రధాన మంత్రి స్థాయి వ్యక్తి అర్బన్ నక్సలిజం వస్తుందని, హనుమాన్ చాలీసా చదవనివ్వమని అంటున్నాడని దుయ్యబట్టారు. దేశంలో బడుగు బలహీన వర్గాలు ఎవరు బీజేపీ వైపు లేరని, నిన్న రాష్ట్రానికి వచ్చిన మోడీ జహీరాబాద్ లో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని అంటున్నారని, ప్రధాన మంత్రి స్థాయికి ఎంత దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోని 11లక్షల కోట్ల సంపద ఎల్ఐసి, ఎయిర్పోర్ట్, పోర్టులు, బిఎస్ఎన్ఎల్ తో సహా అదానీ, అంబానీ లకి అప్పగించింది వాస్తవం కాదా ప్రశ్నించారు. బీజేపీ ఒక్క సీటు గెలిచిన భవిష్యత్ కాలంలో ఎస్సి, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. ఆనాడు మండల కమిషన్ తెస్తే అద్వానీ కమండల్ పేరుతో యాత్ర చేసి దేశం మొత్తం అల్లకల్లోలం చేసింది వాస్తవం కాదా అని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈదేశంలో రిజర్వేషన్ రహిత భారతదేశం తెస్తామన్నది వాస్తవం కాదా అన్నారు. రాహుల్ గాంధీ దేశంలో ఉత్నా అబాది ఇత్నా ఇచాదరి అంటే కుల గణన చేస్తామంటే దానికి వ్యతిరేకంగా కేంద్ర బీజేపీ నాయకత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బండి సంజయ్ కూడా దళితుల రిజర్వేషన్లు అవమానకరంగా మాట్లాడింది వాస్తవం కాదా అన్నారు. బీజేపీ ఫ్యూడలిస్ట్ ల పార్టీ, వ్యాపారస్తుల పార్టీ అని, దేశం మొత్తం మీద 30-40 లక్షల ఖాళీలున్న ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, రిజర్వేషన్ల ద్వారా వస్తారని యూపీపీఎస్సీ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్ లకు సంబంధించి రిజర్వేషన్లు ఇవ్వడం లేదని పార్లమెంట్ సాక్షిగా జవాబు చెప్పారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి మన హక్కులు కాపాడుకోవడానికి రిజర్వేషన్లు కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని కోరుతూ రిజర్వేషన్ల తొలగింపు కు కుట్ర జరుగుతోందన్నారు.

### ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం..

2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ అందిస్తున్నామని అందిస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని,10 లక్షల ఆరోగ్య శ్రీ ఇచ్చామని, రేషన్ కార్డులు ఇస్తామని, 4000 పెన్షన్ ఇస్తాం.. పెన్షన్ లేని వారికి కొత్తగా వచ్చే వారికి కూడా పెన్షన్ లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. కేంద్రం నుండి నిధులు రావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని గెలిపించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గెలిస్తేనే ఇవన్నీ పథకాలు అమలు చేయడానికి ఉంటుందనీ, కార్యక్రమాలు కొనసాగాలన్న.. మరింత అభివృద్ధి జరగాలన్న కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండనీ అభ్యర్థించారు. బీజేపీ , బీఆర్ఎస్ లకు ఓటు వేసి వృదా చేసుకోవద్దని, దేశంలో నియంతృత్వనికి వ్యతిరేకంగా, త్యాగాల ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించిన కుటుంబం నుండి మానవతావాది రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామన్నారు. దేశాన్ని ముందుకు తీసుకుపోదామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు

### ఎన్నికల కోడ్ ముగియగానే నేతన్నలకు?

ఎన్నికల కోడ్ అయిపోగానే సిరిసిల్ల చేనేత కార్మికుల కు గత 10 సంవత్సరాలుగా ఇచ్చిన ప్రణాళిక కన్న మంచిగా ప్రణాళిక అమలు చేస్తామని, ప్రతి కార్మికుడు ఆర్థికంగా ఎదిగేలా చేస్తామని, మహిళా సంఘాలకు బలోపేతం చేస్తూ వారికి వడ్డీలేని రుణాలు ఇస్తూ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా చేతి వృత్తులకు ప్రోత్సహిస్తున్నామనీ హామీ ఇచ్చారు. పరిశ్రమ కాపాడుకోవడమే కాదు మంచి.. భవిష్యత్ లో సిరిసిల్ల రికగ్నైజ్ బ్రాండ్ క్రియేట్ చేస్తామని మంత్రి తెలిపారు. 3వ తేది ముఖ్యమంత్రి వస్తున్నారు. ఈ ప్రాంత సమస్యల పై వారికి అవగాహన ఉంది. సిరిసిల్ల సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి చేనేత పై జీఎస్టీ విధించిందని, సిరిసిల్ల క్లస్టర్ ను వరంగల్ కి తరలించారనీ, సిరిసిల్ల చేనేత కి బండి సంజయ్ ఏం చేశారో నూతన చౌరస్తాలో చర్చకు రావాలనీ పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ఆనాడు టెస్కో ద్వారా మహిళలకు స్వయం సమృద్ధి అవకాశాలు కల్పించామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని.. సిరిసిల్ల లో మరింత మెజారిటీ రావాలన్నారు. సిరిసిల్ల పట్టణంలో మంచి స్పందన వచ్చిందన్నారు. వారంతా కాంగ్రెస్ అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ లో మరింత ఉత్సాహంగా పనులు కొనసాగిస్తామని వెల్లడించారు. పార్లమెంట్ సిట్టింగ్ సభ్యులు నియోజకవర్గానికి ఏం పని చేశారో చెప్పాలన్నారు.

# అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే1 (నేటినిజం ప్రతినిధి): అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణానికి అలుపెరగకుండా శ్రమిస్తున్న కార్మికులందరికీ 'మే డే' సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తోందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం వారి అభ్యున్నతికి తప్పకుండా దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.

# 3, 4 తేదీల్లో ఇంటింటికి ఓటింగ్..

## -85ఏళ్లు పై బడిన వారికి అవకాశం
## -హైదరాబాద్ లో మొత్తం 22లక్షల మంది ఓటర్లు
## -1944 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

హైదరాబాద్, మే1 (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ లో 85 ఏళ్లు పైబడిన ఓటర్లకు ఇంటింటికి ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు.. మే 3, 4 తేదీల్లో ఎన్నికల సిబ్బంది వారి వారి గృహాలకు వెళ్లి ఓట్లను స్వీకరిస్తారని చెప్పారు.. హైదరాబాద్ లోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నియోజకవర్గంలో 22 లక్షల 17 వేల 94 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. వీరిలో 11,25,310 మంది పురుషులు, 10,91,587 మంది మహిళలు, 107 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు.


హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో 57 నామినేషన్లు దాఖలయ్యాయని, పరిశీలనలో నిబంధనలు ఉల్లంఘించినందుకు 19మంది అభ్యర్థులు తిరస్కరించారని వివరించారు. ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం బ్యాలెట్ పేపర్ల ముద్రణ కొనసాగుతున్నదని చెప్పారు.. హైదరాబాద్‌లో 1944 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు 203మంది సెక్టోరల్ అధికారులను నియమించామన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు.

# సదాశివపేట పట్టణంలో ఎంపీ అభ్యర్థి నీలం మధు ప్రచారం..

మెదక్, మే1 మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో జన ప్రభంజనం కొనసాగింది. సదాశివపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం చేపట్టిన రోడ్ షోకు జనం భారీగా తరలివచ్చారు. మద్దికుంట చౌరస్తా నుంచి సదాశివపేట పట్టణానికి చేరుకున్న రోడ్ షో అంబేద్కర్ సెంటర్ నుంచి గాంధీ చౌరస్తా వరకు కొనసాగింది. సంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, సీనియర్ నేత పులిమామిడి రాజుతో కలిసి ఎంపీ అభ్యర్థి చేస్తూ రోడ్ షోలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ చౌరస్తా కార్నర్ మీటింగ్ లో ఎంపీ అభ్యర్థి నీలం మధు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలలో ఆలోచించి ఓటెయ్యాలని మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు విజ్ఞప్తి చేశారు. ఇది వరకే అనేక హామీలు ఇచ్చిన బిజెపి, బీఆర్ఎస్‌పార్టీలు ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమన్యాయం చూపుతూ వస్తోందన్నారు. ముఖ్యంగా పేదలకు ఇండ్లు, భూములు ఇచ్చి అన్ని రకాలుగా ఆదుకుందని గుర్తు చేశారు. సదాశివ మున్సిపాలిటీ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.




పుస్తకావిష్కరణలో అతిథులు.

తొమ్మిది దశాబ్దాల నిరంతర సాహితీ ప్రస్థానానికి నిదర్శనం సాహితీమేఖల అని తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ మామిడి హరికృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం రవీంద్రభారతిలో జరిగిన సాహితీ మేఖల సభ్యులు సుందర దేశికులు రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1934 నుండి ఇప్పటి వరకు నిరంతరాయంఆ నిరాటంకంగా ఒక ఆశయంతో ఏర్పడిన సాహితీ మేఖల సంస్థ శతాధిక రచనలను వెలువరించి తన ఉనికిని చాటుకుందని సాహిత్యాన్ని సంస్కృతిని భాషను సుసంపన్నం చేసిందన్నారు. దేశికుల సోదరులు రచించిన పద్య సాహిత్యం అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ విద్యాసాగర్ ప్రముఖ సాహితీవేత్తలు మసన చెన్నప్ప, శ్రీ రంగాచార్య అంబటిపూడి సుబ్రహ్మణ్యశాస్త్రి ఇడి కుడి సచ్చిదానంద సాహితీ మేఖల కార్యదర్శి పున్న అంజయ్య, వ్యవహర్త మంచుకొండ చినభిక్షమ్య సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# వాకింగ్ ట్రాక్‌లు, ఇండోర్ ప్లేగ్రౌండ్స్ కోసం కృషి చేస్తా.. ఎంపీ అభ్యర్థి నీలం మధు

## -నీలం మధు మార్నింగ్ వాక్..
## -బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్ లో వాకింగ్..
## -వాకర్లు, సీనియర్ సిటిజన్లు, యువతతో ముచ్చట
## -పరిశ్రమలతో ఉపాధి కల్పించిన కాంగ్రెస్



మెదక్, ఏప్రిల్ 17:మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు బుధవారం బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్ లో వాకింగ్ చేశారు. పటాన్ చెరు నియోజకవర్గం బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్ కు ఉదయం విచ్చేసిన నీలం మధు వాకర్లు, ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్, సీనియర్ సిటిజన్లు, యువతను కలిశారు. వారితో కలిసి వాకింగ్ చేశారు. క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం వారితో ముచ్చటించారు. ముఖ్యంగా బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్ తోపాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను నీలం మధుకు వివరించారు. ప్రతి ఒక్కరికి మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు.

పరిశ్రమలతో..ఉపాధి కల్పించిన కాంగ్రెస్ : నీలం మధు

మెదక్ గడ్డ నుంచి ఎంపీగా పోటీచేసి ప్రధాని అయినటువంటి స్వర్గీయ ఇందిరా గాంధీ పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పించిందని నీలం మధు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో బీహెచ్‌ఈఎల్ ను నెలకొల్పడం ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయని తెలిపారు. అలాగే బీడీఎల్, ఈక్రిసాట్ వంటి గవర్నమెంట్ సెక్టార్లన్నీ మెదక్ జిల్లాలో నెలకొల్పడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, రాహుల్ గాంధీ నేతృత్వంలో పాంచ్ గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. యువత ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంపీగా గెలిచాక ఎంపీ, సిఎస్ఆర్ ఫండ్స్ తో వాకింగ్ ట్రాక్ ల అభివృద్ధి, ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్లూరు నరసింహారెడ్డి, కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,113 డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, మైనార్టీ నాయకులు అన్వర్ పటేల్, అరుణ్ గౌడ్, శేఖర్, మెట్టు కృష్ణ, తూర్పు శ్రీను, బిహెచ్‌ఈఎల్ ఐఎన్టీయూసీ కార్మికులు నాయకులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా మహాకవి శ్రీశ్రీ జయంతి




ఏప్రిల్ 30 మంగళవారం రోజు మహాకవి శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కామారెడ్డి కవులు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గజల్ కవి సూరారం శంకర్ అల్లి మోహన్ రాజ్ ఎనిశెట్టి గంగా ప్రసాద్ కాసర్ల రామచంద్రం బి నాగభూషణం వకుళాభరణం సుధాకర్

హైదరాబాద్, మే1 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో తేదీ 30 ఏప్రిల్ మంగళవారం రోజు శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి లో శ్రీ శ్రీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రీ శ్రీ రచనలు కవిత్వం గురించి వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ కార్మిక కర్షకులకు అండగా శ్రీ శ్రీ రచనలు నిలిచి సమాజానికి కొత్త శక్తిని ఇచ్చి యువతను ముందుకు నడిపించాయని అనేక ఉద్యమాలకు శ్రీశ్రీ రచనలు తోడ్పడ్డాయని శ్రీశ్రీ లాంటి ప్రజా కవులు నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ మాట్లాడుతూ శ్రీ శ్రీ రచనలల్లో మహాప్రస్థానం ఎంతో ముఖ్యమైనదని నేటి యువ కవులకు శ్రీశ్రీ లాంటి కవులు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఎనిశెట్టి గంగా ప్రసాద్ అల్లి మోహన్ రాజ్ కాసర్ల రామచంద్రం వకుళాభరణం సుధాకర్, బి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు .

# బీఆర్ఎస్‌తో రేవంత్ రాజీ- ఎంపి లక్ష్మణ్

హైదరాబాద్, మే1: సీఎం రేవంత్ రెడ్డి రాజీపడడంతోనే కాళేశ్వరం ఫైల్ లను తొక్కి పెట్టారని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ? అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇంత వరకూ కాళేశ్వరం డ్యామేజ్ చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు..

బీఆర్ఎస్ తో కుమ్మక్కు రాజకీయాలు చేయడం వల్లే ఆ ఫైల్ ను రేవంత్ బయటకు తీయడం లేదని ఆరోపించారు.కాగా, ఆర్ఎస్ఎస్ చీఫ్ రిజర్వేషన్ లు కొనసాగాలని స్పష్టంగా చెప్పారన్నారని గుర్తు చేస్తూ, రేవంత్ రెడ్డి మీరు తల ఎక్కడ పెట్టుకుంటారు ? అని ప్రశ్నించారు. అబద్దాలనే ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రజలు నమ్మక పోవడంతో ఫేక్ వీడియోలు చేశారన్నారు. తెలంగాణ పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో ఏప్రిల్ 29న 3వ వార్షిక బాలల ఉచిత వేసవి శిబిరంలో పాల్గొన్న వై. రాఘవులు, కృష్ణారెడ్డిలను సత్కరిస్తున్న సేవా సమితి అధ్యక్షులు ఆచార్య కడారి సత్యమూర్తి తదితరులు.

# కార్మికులకు అండగా బిఆర్ఎస్ పార్టీ

## -కార్మికుల హక్కుల కోసం బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది
## -బిఆర్ఎస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పక్షాన వారి హక్కుల కోసం పోరాటం చేసింది..
## -ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎంపీ, బి ఆర్ ఎస్ పార్లమెంట్ బి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



కరీంనగర్, మే1 (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమంలో కార్మికుల పాత్ర మరువలేనిదని కరీంనగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు.. బుధవారం కార్మిక దినోత్సవం సందర్భంగా నగరంలో మున్సిపల్ కార్యాలయం ముందు , బస్టాండ్ ఎదురుగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద, వ్యవసాయ మార్కెట్ కవద్ద. బిఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి బి వినోద్ కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జెండాను ఆవిష్కరించారు.. కార్మికులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ కార్మిక దినోత్సవం అని..బిఆర్ఎస్ పార్టీ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని.. వారి హక్కుల కోసం ఎల్లవేళలా పోరాటం చేసి వారికి అండగా ఉంటుందని అన్నారు...

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ సమయంలో కార్మికులు బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచారని అన్నారు.మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనేతమ హక్కుల కాపాడుకోవచ్చని అన్నారు.. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్ , ఎడ్ల అశోక్ గంట శ్రీనివాస్ బి ఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి,, ఆకుల మల్లేశం,, ముత్యాల కృష్ణ యాదవ్ , హమాలీ సంఘం నాయకుడు రమేష్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు

## చురక

విభజన హామీల అమలు
విశ్వ గురువు దాటేస్తరు
అది చేస్తం ఇది చేస్తం
అంటూ మల్ల వాటేస్తరు
తెలుగు రాష్ట్రాలకింత
తీవ్రమైన అన్యాయం
మరుస్తారా ఎన్నికల్లో
మసులుతున్న గాయం



-వేల్పుల నారాయణ
9440433475

## నేటి కందం- నేటికీ అందం

ఘనమగు హుగ్లీ తీర
మ్మునగల చంద్రానగరును ముదమొప్పంగన్
మన పాలన క్రిందకు-తె
చ్చిన చణులకు జోతలిడగ చేతులు మోడ్తున్

(2-5-1950 చంద్రానగర్ ను ఫ్రెంచి వారినుండీ భారత్ స్వాధీనం చేసుకున్నరోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

ఆహ్వానం

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ హైదరాబాద్
తెలంగాణ శాఖ మరియు
అశోక్‌నగర్ కల్చలర్ & వెల్ఫేర్ అసోసియేషన్
"శ్రీ క్రోధి ఉగాది కవితా కదంబం"
గ్రంథావిష్కరణోత్సవం

తేది : 5-5-2024, ఆదివారం సా॥ 6.00 గం॥లకు
వేదిక : అశోక్ నగర్ సంస్కృతి కేంద్రం, అశోక్‌నగర్, హైదరాబాద్-500020.

సభా కార్యక్రమం

ముఖ్య అతిథి : ఆచార్య టి. గౌరీశంకర్
పూర్వ రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి
అధ్యక్షులు - ఎబిబిఎస్ఎస్
గ్రంథావిష్కరణ : శ్రీ బైసా దేవదాస్
సంపాదకులు, నేటినిజం
గౌరవ అతిథులు : శ్రీ పడమటి బాల్ రెడ్డి, గ్రంథ ప్రచురణ కర్త
శ్రీ బి. రామ్మూర్తి, అధ్యక్షులు - ఎసిడబ్ల్యుఎ
స్వాగతం : శ్రీమతి గొళ్లమూడి పద్మావతి
అధ్యక్షులు, మహిళా విభాగం ఎబిబిఎస్ఎస్
కార్యక్రమ నిర్వహణ: శ్రీ తంగిరాల చక్రవర్తి, సెక్రటరీ, ఎబిబిఎస్ఎస్

కవి సమ్మేళనం

అందరూ ఆహ్వానితులే

శ్రీ బి. సూర్య ప్రకాశ్
సెక్రటరీ-ఎసిడబ్ల్యుఎ

శ్రీ తంగిరాల చక్రవర్తి
సెక్రటరీ-ఎబిబిఎస్ఎస్


# నేటినిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | గురువారం 2-5-2024


**బంజారా నానీ**



సంతలో కలిస్తే
అంతులేని శోకం
మానవ వేదనకు
అభివ్యక్తి రాగం.



-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

**ఘంటారావం**

అనుకున్నది అనుకున్నట్టుగా
అవుతుందనుకోకు
అనుకోనిది జరగటమే
జీవితమని మరువకు.

అతి
హాని కలిగిస్తుంది
మితం
హాయినిస్తుంది.

పసికందుల
క్రయవిక్రయాలు
పిల్లల పాలిట
పెనుశాపాలు

సుగుణాన్ని
గుణించు
దుర్గుణాన్ని
భాగించు.

భయం
ఒంటరితనానికి వేదిక
వైరాగ్యం
ఏకాంతానికి భూమిక



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

వివిధ రంగాల్లో ప్రతిభామూర్తులైన 100 మందికి వంశీ-తిరుమల బ్యాంక్

## ఉగాది కామధేను పురస్కారాల ప్రదానం

# రాజకీయ వేడి నడుమ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రశాంతత

-శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నటుడు కోట శ్రీనివాసరావు. చిత్రంలో రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, మాడుగుల నాగఫణిశర్మ, మురళీమోహన్, నంగునూరు చంద్రశేఖర్



సాహిత్యరంగ పురస్కారం స్వీకరిస్తున్న డా॥ కొండపల్లి నీహారిణి

“ఓవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు రాజకీయ వేడి.. ఇలాంటి పరిస్థితుల్లో మాలాంటి వారికి సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను, సాంత్వన చేకూరుస్తాయి' అని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్, వంశీ కల్చరల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, రేలంగి ఆర్ట్ అకాడమీ, వేగేశ్న ఫౌండేషన్, ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సోమవారం వివిధ రంగాల్లో ప్రతిభా మూర్తులైన 100 మందికి “వంశీ-తిరుమల బ్యాంక్ ఉగాది కామధేను పురస్కారాల ప్రదానోత్సవం” జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది సందర్భంగా ప్రతిభా వంతులైన 100 మంది ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేయడం పట్ల వంశీ రామరాజును నంగునూరి చంద్రశేఖర్‌ను అభినందించారు. పురస్కార గ్రహితలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిగతా అతిథులతో కలిసి వివిధ రంగాల్లో ప్రతిభా మూర్తులు వందమందిని ఘనంగా సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశారు.

వంశీ ఇంటర్నేషనల్ ఛైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ అనుగ్రహభాషణ చేస్తూ.. మేధాశక్తిని సమాజ వినాశనానికి కాకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలన్నారు. త్వరలో ప్రారంభించబోయే ప్రతిష్టాత్మక వంశీ-తిరుమల బ్యాంక్ అవార్డుల లోగోను విశ్వంజీ మహరాజ్ ఆవిష్కరించారు.

యావత్ ప్రపంచం నేడు భారతదేశాన్ని అత్యున్నతస్థాయిలో చూస్తుందంటే అందుకు ఏకైక కారణం భారతదేశ సనాతన దర్మానికున్న సద్భావనేనని విశ్వయోగివిశ్వంజీ మహరాజ్ అన్నారు. ప్రతీ ఒకొక్కరికి డబ్బు సంపాదన చాలా అవసరమని అది పాపిష్టివాడి చేతుల్లోకి పోతేనే పాపిష్టిదవుతుందని మహరాజ్ స్పష్టం చేశారు. దేనికైనా ఉన్నతస్థితికి చేర్చే సద్భావన (గుడ్‌విల్)ను పోగొట్టుకోనంతకాలం భారతీయుడు ఎక్కడికి వెళ్లినా రాణిస్తాడని స్పష్టం చేశారు.

వివిధ రంగాల్లో ప్రతిభామూర్తులైన బ్రహ్మశ్రీ డా॥ నాగఫణిశర్మ, సినీ నటుడు, నిర్మాత ఎం.మురళీమోహన్, సినీ నటుడు సుమన్, సినీ నటుడు కోటశ్రీనివాసరావు, సినీ నటి శ్రీమతి రోజారమణి, ధవళసత్యం, టీ. రామ సత్యనారాయణ, సాయి కామరాజు, మానేపల్లి రామారావు,ఓలేటి రంగమణి, డా॥ మద్దాళి ఉషాగాయత్రి, డా. రాజేశ్వరి సాయినాథ్, వేదవతి ప్రభాకర్, కె. రామాచారి, ఇంద్రగంటి జానకీబాల, కొండపల్లి నీహారిణి, రాధిక మంగపూడి, డా॥ కె. ధర్మారావు, జి.వల్లీశ్వర్, పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, డా॥ మహ్మద్ రఫీ, డా॥ జుర్రు చెన్నయ్య, గుదిబండి వెంకటరెడ్డి, మౌనశ్రీ మల్లిక్, డా॥బి. వెంకటేశ్వర్లు, ఆచార్య కాత్యాయని విద్మహే, శ్రీమతి వారణాసి నాగలక్ష్మి, డా॥ గంటా జలంధర్‌రెడ్డి, శ్రీమతి ఐనంపూడి శ్రీలక్ష్మి, శ్రీమతి శీలా సుభద్రాదేవి, కంచెర్ల సుబ్బనాయుడు, శ్రీమతి గౌరీ పార్వతీదేవి బొమ్మన, శ్రీమతి స్వాతి జంగా, జె.వి.లక్ష్మణరావు, శ్రీ జయరాం ఎర్రమిల్లి. రేలంగి నరసింహారావు తదితరులు ఉన్నారు.

వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డా॥వంశీ రామరాజు, డా॥ తెన్నేటి సుధాదేవి, శైలజ సుంకరపల్లి, రాధిక మంగిపూడి, తదితరులు సభా సమన్వయం చేశారు.

శివశంకరి గీతాంజలి గానామృతం అందరిని ఆకట్టుకుంది. వ్యాఖ్యాన శిరోమణి శ్రీమతి సుధామయి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



జ్యోతి ప్రకాసనం చేసి పురస్కారాల ప్రదానోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, గుత్తాసుఖేందర్‌రెడ్డి, వంశీరామరాజు, నంగునూరి చంద్రశేఖర్ తదితరులు.



పురస్కారం స్వీకరిస్తున్న గుదిబండి వెంకటరెడ్డి



పత్రికా రంగ పురస్కారాలు స్వీకరిస్తున్న గుండు వల్లీశ్వర్, పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, మహమ్మద్ రఫీ



## మా డే (Maa day)

'మేడే' సందర్భంగా శ్రీశ్రీ స్వయంగా శ్రామికులను ఉద్దేశించి కవితను వినిపించారు. అందులో వారు కార్మిక వీరుల కళ్యాణానికి, శ్రామిక వీరుల సౌభాగ్యానికి కళ్యాణం (శుభం) కలగాలని ఆకాంక్షించారు. కర్షకవీరుల కాయం (శరీరం) నిండా కాలువ గట్టే ఘర్మ (చెమట) జలానికి, ధర్మజలానికి ఖరీదు కట్టే వారులేరన్నారు. ఇది పరమ సత్యం. శ్రీశ్రీ పొలాలనన్నీ హలాలదున్నీ ఇలా తలంలో హేమం (బంగారు పంటలు) పండడానికి విరామం ఎఋుగకుండా పరిశ్రమించే శ్రామికులను కీర్తించారు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైంది లేనేలేదని చాటారు. సహస్ర (అనేకం) వృత్తులను గుర్తు చేశారు.

'ప్రతిజ్ఞ' అనే ఈ మహా ప్రస్థానగేయం చదువుతూ వుంటే నాకు శ్రీశ్రీ May Day (మేడే) సందర్భంగా రాసిన గేయం అనిపించినా, ప్రత్యేకించి శ్రమశక్తికి ప్రతిరూపమైన అమ్మ గుర్తుకు వస్తుంది. అందుకే నేను 'May Day ను 'Maa Day'గా భావిస్తాను.

అమ్మలేకపోతే అవని లేదు. శ్రామికశక్తికి, కార్మికశక్తికి అమ్మ ప్రతిరూపం. అసలు శక్తి స్వరూపిణి అమ్మే. జ్ఞాన క్రియాసంకల్ప శక్తులకు అమ్మ కేంద్ర బిందువు. ఆమె సంకల్పిస్తుంది. బుద్ధితో నిశ్చయిస్తుంది. ఆ తర్వాత క్రియాశీలకమైన కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

ఇంటి పనులే కాక, బయటి పనులైన వ్యవసాయం మొదలైన పనుల్లో అమ్మ భాగస్వామ్యం లేకపోతే ప్రపంచమే నడవదు. పడకమీంచి లేచింది మొదలు నిద్రపోయేదాకా (అసలు అమ్మకు నిద్రవస్తుందా?) అమ్మకు చేతినిండా పనులే. అమ్మకు రాని పనులుండవు.

అమ్మే నిజమైన శ్రామికురాలు, నిజమైన కార్మికురాలు, ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మ కర్మయోగి. జీవితంలో చాలా కాలం నుంచి, నిజానికి యుగ యుగాల నుంచి పురుషుడు స్త్రీని కాదని ఆమెకంటె ఎక్కువగా మార్కులు కొట్టేశాడు. అతడే సంసార వృక్షానికి కాండం అయ్యాడు. కాని నా దృష్టిలో అమ్మేపాదు, అమ్మేవేరు. అమ్మ కమ్మని వంటచేసి కుటుంబసభ్యుల ఆకలి తీర్చే దేవత! పురుషునికి అన్ని వేళల తోడుగా ఉండి అన్ని పనుల్లో సహాయ సహకారాలందించే అన్నపూర్ణ.

లక్ష్మీదేవికి, సరస్వతీదేవికి, పార్వతీదేవికి మూలం అమ్మేనని కవులు ఊరకనే అనలేదు. సమస్త స్త్రీ శక్తికి అమ్మ ప్రతీక, ప్రతినిధి, ప్రతిరూపం. అమ్మ రూపంలో అనసూయాదేవి ముగ్గురు మూర్తులను శిశువులుగా చేసి పాలిచ్చిన కథ వట్టి కథ కాదు. అందులో ఎంతో పరమార్థముంది. శివుని అర్థ శరీరాన్ని పార్వతి ఆక్రమించిన కథ కూడా వట్టి కథ కాదు. భార్య సహాయం లేకపోతే భర్త అనేవాడు ఏమీ చేయలేడని అందలి అంతరార్థం!

ఎవడో పురుషపక్షపాతి (నిఘంటుకారుడు) భార్య, భర్త అనే పదాలకు తప్పు అర్థాలిచ్చాడు. వైదికంగా ఆలోచిస్తే 'భార్య' అనే పదానికి భరించునదని అర్థం. అట్లే 'భర్త' అనే పదానికి భరించేవాడు అని అర్థం. భార్య, భర్త ఇద్దరూ కుటుంబాన్ని భరించేవారని అర్థం. కాని 'భార్య' అంటే భరింపబడునది. 'భర్త' అంటే భరించేవాడు అనే దిక్కుమాలిన అర్థాల్నిచ్చి స్త్రీ శక్తిని, ముఖ్యంగా మాతృశక్తిని అవమానించినాడు.


సంసారమనే బండికి భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాలలాంటివారు. సంసారమనే తరాజులో భార్యాభర్తలిద్దరూ రెండు పళ్ళాలవంటివారు. ఇందుకేనేమో? బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్య మహర్షి చెప్పినట్టు భార్యాభర్తలిద్దరూ ఒక 'గింజ'లోని రెండు పలుకులలాంటివారు. రెండు పలుకులుంటేనే గింజ మొలకెత్తుతుందన్న విషయం మరవరాదు. వంశోత్పత్తికి మూలం. నేను చదివిన తైత్తిరీయోపనిషత్తులో సంతానానికి పూర్వరూపం అమ్మ అని, ఉత్తరరూపం నాన్న అని చెప్పబడింది.

అమ్మ అవనిలో మొదటి గురువు. నాన్న ఆ తర్వాతనే గురుస్థానంలో నిలుస్తాడు.

'అమ్మ' అంటే అమృతం. ఎన్ని జన్మలకైనా మా అమ్మే నాకు మనుష్యజన్మ ఇవ్వాలని కోరుకుంటున్నాను. అమ్మ అమ్మే. ఆమెకు సాటి ఎవరూ రారు. ఐతే అమ్మ శక్తిని చెప్పడానికి సహనశక్తిలో భూదేవితో పోలుస్తారు. కాని నా దృష్టిలో అమ్మతో పోటీపడి నిలిచేవారు లేరు.

'అమ్మ' అని పిలిచి అన్నమడగని నోటిని సుమతీ శతకకారుడు-కుండలు తయారు చేయడానికి కుమ్మరి త్రవ్వే మట్టి గుంతతో పోల్చినాడు.

భాగవతంలో పోతన చెప్పినట్లు కేవలం ఒక్క భక్తునికి కాదు, మనకు కూడా మాతృ దృష్టి ఉండాలి. ఈ విశ్వమంతా మాతృ స్వరూపమే. నా దృష్టిలో 'త్రిమూర్తి జీవన సౌందర్యానికి 'అమ్మ' చక్కని నిదర్శనం. అందుకే నేను ఈ 'May day' ను 'Maa day' గా అభివర్ణిస్తున్నాను.



- మనస చెన్నప్ప
సెల్: 9885654381

పుస్తక సమీక్షలు

# సప్తపదుల సప్తశతి “నవీన”



-రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పదబంధ ప్రహేళికల నిర్మాత, ప్రఖ్యాత సాహితీవేత్త సుధామ సృష్టించిన నూతన లఘు కవితా రూపం "సప్తపది". ఏడు పదాలతో నిర్మాణం జరిగిన ఈ ప్రక్రియకు 'సప్తపది' అని నామకరణం చేశారు సుధామ. మొత్తం మూడు పాదాలు... మొదటి రెండు పాదాల్లో ఒక్కొక్క పదం, మూడవ పాదంలో ఐదు పదాలు వుండాలి. మూడు పాదాల్లోనూ అంత్యప్రాస తప్పని సరి. అక్షర నియతి లేదు. భావ సమన్వయానికి ప్రాధాన్యత. సప్తపదిలో ఒకసారి వాడిన పదం మరోసారి వాడకూడదు. అలాగే ఆంగ్ల పదాల వాడుక నిషిద్ధం. వస్తువు ఏదయినా కావొచ్చు. జీవిత సత్యాలు, సామాజిక ప్రబోధక ఘటనలు.. యిలా అనుభూతి, సామాజిక, తాత్విక అంశాలు ఏవయినా సప్తపదిగా సంతరించవచ్చు. బహుముఖ ప్రజ్ఞాశాలి విహారి 'సప్తపదులు' (నూరు పదార్లు) పేరిట తొలి కవితా సంపుటిని ప్రచురించారు.

సామాజిక అభ్యుదయ అంశాలను ప్రతిబింబిస్తు కవి దాసరాజు యశస్వి 'యశస్వీయ సప్తపదులు' పేరిట ఓ సంపుటిని వెలువరించారు. సప్తపదుల ప్రక్రియలో వెలువడిన ఈ 'ద్విశతక' పొత్తం రెండవది.


ఆయుత తాజాగా వివిధ కవులు రాసిన 700 విభిన్న సప్తపదుల సంకలనం 'నవీన' శీర్షికన ప్రకటించారు. ఈ ఉద్గ్రంథానికి విహారి సంపాదకత్వం వహిస్తే, డా॥బి.ఎస్.ఆర్.ఎస్. ఆంజనేయశర్మ ప్రచురణ సౌజన్యం సమకూర్చారు. 'సప్తపది' లఘు కవితా నిర్మాణంలో వున్న సమగ్ర కారణాలా ఈ సప్తశతి గ్రంథాన్ని 'నవీన' అనడం సముచితంగా తోస్తుంది.

పదాల కొలమానంతో బాటు ప్రాస, శ్లేష కూడా ప్రాధాన్యాన్ని సంతరించుకున్న 'సప్తపది' ప్రక్రియను అంది పుచ్చుకుని మరో నలుగురు కవులు సృజించిన కవితా సంపుటాలు అమ్మలో వుండటం ముదావహం.

గత కొద్ది వారాలుగా 'నేటినిజం' పత్రికలో శాంతమూర్తి నిర్వహణలో పలువురు కవులు రాసిన సప్తపదులు 'సాహితీ కెరటాలు' ఎగిసిపడుతున్నై. సప్తపదుల స్ఫూర్తితో జి.వి. పూర్ణచంద్ 'ముక్కాలు' పేరిట ఓ నూతన లఘు కవితా ప్రక్రియను సృష్టించి యిప్పటికే రెండు సంపుటాలు వెలువరించడం విశేషం.

ఏప్రియల్ 2023 సం॥లో పురుడుపోసుకున్న 'సప్తపది' ప్రక్రియ అతి స్వల్ప కాలంలో యింతగా ప్రాచుర్యానికి నోచుకోవడం విశేషం.

'నవీన' సంపుటిలోని సప్తపదుల్ని చదివిం తర్వాత అనేక సామాజిక అంశాల ప్రస్తావన, జీవన విలువల పోహళింపు, తాత్వికాంశాల గాఢత, కవిత్వ పరిమళాలు పాఠకుల్ని అలరిస్తాయ నడంలో సందేహం లేదు





ప్రతులకు:ఎ.వెంకట రావు(సుధామ)
ఇ-107. రాజపుష్ప ఆట్రియ
గోల్డెన్ మైల్ రోడ్, కోకాపేట
హైదరాబాద్-500 075.
సెల్: 98492 97958

“హంగు/ రంగు/ బట్టలెన్ని ఉన్నా మొదటి తువ్వాలు అమ్మ కొంగు” అనే సప్తపదితో గ్రంథం ప్రారంభమవుతుంది.

“కలహాలు/ విరహాలు/ కాపురంలో అప్పుడ ప్పుడు పెంచుతాయి సరాగాల వరహాలు” అంత్య ప్రాసతో జీవిత సత్యాన్ని ఆవిష్కరించిన లఘు కవిత.

“తరువు/ చెరువు/ కనుమరుగు అయితే తాండవం చేస్తుంది కరువు” నీటి ప్రాధాన్యతను తెలియజేసే 'సప్తపది'.

“సప్తపది/ పదాల పొది/ కూరిస్తే భావాలు కుదురుగా ఉప్పొంగును మది” భావ స్ఫూర్తి ఈ ప్రక్రియకు తప్పనిసరి అంటున్న సప్తపది.

“ఆదుకో/ చేదుకో/ సొంత-ఖజానా నింపేందుకు పన్నులుగా బాదుకో” సంక్షేమం పేరిట గోరంత విదిల్చి పన్నుల రూపంలో కొండంత ఒలుచుకుంటున్న ప్రభుత్వాల తీరుకు దర్పణం.

“సుఖం/ దుఃఖం/ జీవన గమనం అనే నాణానికి చెరో ముఖం” తాత్వికత చిప్పిరిల్లిన లఘు కవిత.

యిలా ఏరుతూపోతే అనర్ఘ రత్నాల్లాంటి నాణ్యమైన సప్తపదులు చాలానే వున్నయి.

అక్కడక్కడా నిబంధనలకు విరుద్ధంగా రాసినవి.. తేలిపోతున్న సప్తపదులూ లేకపోలేదు.

“జననం/ మరణం/ నడుమ జీవితం నువ్వే చేసుకో ఆనందమయం”

అంత్యప్రాస అమరని సప్తపది.

“తరువులు/ చెరువులు/ తరువులు తరిగి చెరువులు ఎండిపోతే కరువులు”


పదాలు పునరావృతం అయిన లఘు కవిత.

“సెలక్షన్/ ఎలక్షన్/ గెలిచాక ప్రజాసేవలో చేస్తారు నాయకులు కలెక్షన్” ఆంగ్ల పదాలు పరిహరించడం సబబు అన్నది నిబంధన.

సంపాదకులు విహారి ప్రకటించినట్టు ఔత్సాహి కుల్ని ప్రోత్సహించడానికీ, కొత్తవారిని నిరుత్సాహ పరచకూడదనీ నిబంధనలకు విరుద్ధంగా రాసిన యిలాంటి మినీ కవితలకు కూడా సంకలనంలో చోటు కల్పించారు.

తెలుగు సాహిత్యంలో అనేక లఘు కవితా ప్రక్రియలు వెలుగు చూసినై. కాల ఒరవడిని తట్టుకొని నిలబడినవి మాత్రం కొన్నే. ప్రక్రియ ఏదైనా కవిత్వాంశ వుంటే నిలుస్తుంది లేదా పోతుంది.

ప్రక్రియ నాలుగు కాలాల పాటు నిలవాలంటే కవుల ఆదరణ, పాఠకుల సంస్పందన ముఖ్యం. సుధామ సృష్టించిన వినూత్న లఘు కవితా ప్రక్రియ 'సప్తపది' కాల పరీక్షలో నెగ్గి కవితా ప్రియులను ఇతోధికంగా అలరిస్తుందని ఆశిద్దాం.. వేచిచూద్దాం.



## సునందామృతం

### తండుల భక్షణ న్యాయము

తండులం అంటే బియ్యం. భక్షణం అంటే తినడం. తండుల భక్షణం అంటే బియ్యం తినడం.

బియ్యాన్ని వండుకొని తినాలి కానీ వండకుండా తినడం అంటే ఒళ్ళు బద్ధకం చేత వండకుండా తినడం అనే అర్థంతో “వండుకో లేక బియ్యం బొక్కినట్లు” అనే సామెత తో పోల్చుతూ చెప్పిన న్యాయమే “తండుల భక్షణ న్యాయము “.

అసలే బద్ధకస్తురాలు. పైగా ఆకలి వేస్తుంది. ఏం చేయాలో తో చక బియ్యం తెచ్చుకుని బుక్కిందట.

దీనికి సామ్యంగా మరో సామెత కూడా పెద్ద వాళ్ళు ఉపయోగిస్తూ ఉంటారు. “ఒళ్ళు ఒంగనోడు దొంగల్లో కలిశాడు అన్నట్లు”

అలా వండుకోకుండా బద్ధకంతో బియ్యమే తింటే ఏమౌతుంది? కడుపు నొప్పి రావడం,ఆ తర్వాత అందరితో చీవాట్లు పడటం ఖాయం.

బద్ధకం మనసుకైనా శరీరానికైనా అనర్థ హేతువే. కాళ్ళూ చేతులూ అన్నీ సక్రమంగా ఉన్న వ్యక్తి చిన్నదో పెద్దదో పని చేసుకుని బతకాలి. అంతే కానీ శ్రమ లేకుండా బాగా సంపాదించాలని దొంగలతో కలిస్తే పట్టుపడకా తప్పదు. దేహశుద్ధితో పాటు పరువూ మర్యాద గంగలో కలవకా మానదు.

ఇలాంటి బద్ధకస్తులను హెచ్చరిస్తూ రాసిన పద్యాలను చూద్దాం.

పెద్దలు విచ్చేసినచో/ బద్ధకమునసైన దుష్ట పద్ధతి నైనన్/ హద్దెరిగి లేవకున్నన్/ మొద్దు వలెం జూతురతని ముద్దు కుమారా!

పెద్దలు మనమున్న చోటుకు వచ్చినప్పుడు వెంటనే గౌరవప్రదంగా లేచి నిలబడాలి. కానీ పొగరుతోనో,చిన్నా పెద్ద తేడా తెలుసుకోలేకనో, ఆఖరికి బద్ధకం వల్లనైనా సరే మన ఎదురుగా వచ్చిన పెద్దలను గ్రహించకుండా, అలానే కూర్చుండి పోయే వారిని బుద్ధి లేని మొద్దుగా,మూర్ఖునిగా జమ కడతారు.

అలాగే కుమారీ శతక పద్యాన్ని కూడా చూద్దాం... “బద్ధకము సంజె నిద్దుర/ వద్దు సుమీ దద్దిరంబు వచ్చును దానన్/ గద్దింతురింటివారలు/ మొద్దందురు తోడివారు ముద్దు కుమారీ!”

బద్ధకముతో సాయంకాలం నిద్ర పోకూడదు. అలా నిద్రిస్తే మొద్దువని తోటి వారు నిందిస్తారు. ఇంటివారు తూలనాడుతారన్న మాట”.

తండుల భక్షణం న్యాయము అంటే ఈ పాటికి అర్థం అయ్యింది కదా! కాబట్టి అలాంటి వి మానాలంటే ఒంట్లోనూ, మనసులోనూ ఉన్న బద్ధకాన్ని వీడాలి.

పిల్లలైనా పెద్దలైనా బద్ధకం వల్ల వచ్చే అనర్థాలను, చెడును తెలుసుకుని చైతన్య స్రవంతులై సాగాలి.



-పురిమళ్ల సునంద
9441815722


## షట్ పదులు

చేతులను రకరకాలుగా
సింగారించేవి గోరింటాకులు!
నోళ్లను తాంబూలాలుగా
ఎర్రెర్ర జేసేవి తమలపాకులు!
ఎన్ని రకాలుగా ఆకర్షించినా
ఎట్టకేలకు రాలేవి ఎండుటాకులు!.

పరలోక సౌఖ్యాలకై
పట్టి చేయించేవి గోదానాలు!
ఇహలోక ప్రచారాలకై
తట్టి ఇప్పించేవి భూదానాలు!
నేతల స్వార్థాలకెర అయ్యేవి
అమాయకుల బలిదానాలు!



- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699





# క్లుప్తత, గుప్తత,గాఢత కలిగినదే కవిత్వం..

-నంది పురస్కార గ్రహీత సాధనాల వేంకటస్వామి నాయుడు

హైదరాబాద్, మే1 (నేటినిజం ప్రతినిధి): నియమాలతో కూడిన లఘు కవితలను కవులు, సాహిత్యాభిమానులు సొంతం చేసుకున్నప్పుడే అవి నిలుస్తాయని, కవిత్వం ఏ రూపంలో ఉన్నా, అది క్లుప్తత,గుప్తత,గాఢతలతో పాటు సామాజిక హితాన్ని కలిగి ఉండాలని ప్రముఖ కవి సినీ గేయ రచయిత నంది పురస్కార గ్రహీత సాధనాల వేంకటస్వామి నాయుడు అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ద్వారా ప్రచురితమైన 94వ పుస్తకం నగనూరి రాజన్న విరచితమైన శ్రీపద మంజీరాలు శ్రీ పదాల సంపుటిని ఏప్రిల్ 28 ఆదివారం రోజున కరీంనగర్ లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కొత్త సాహిత్య ప్రక్రియను ఎవరు సృజించినా అది కవుల సొంతమైనప్పుడే ప్రచారానికి నోచుకుంటుందని ,ఆ సాహిత్య ప్రక్రియలో కవులు రచనలు చేసినప్పుడే ఆ ప్రక్రియ నిలదొక్కుకుంటుందని అన్నారు. శ్రీ పదాలు రూపకర్త అనుశ్రీ గారోజు మాట్లాడుతూ శ్రీపదాలు సాహిత్య ప్రక్రియను రూపొందించినది తానే ఐనా, ఆ ప్రక్రియను సొంతం చేసుకొని శ్రీ పదాలు రాస్తున్న కవులందరూ ఈ ప్రక్రియను ముందుకు తీసుకొస్తున్నారని పేర్కొంటూ ఆ కవులందరికీ ధన్యవాదాలు తెలిపారు. పుస్తకంతో ముఖాముఖి కార్యక్రమంలో శ్రీపద మంజీరాలు సంపుటిపై కరీంనగర్ కు చెందిన 13 మంది కవులు కవయిత్రులు విశ్లేషణాపూర్వకమైన సమీక్షను అందించారు. కార్యక్రమంలో శ్రీపదాలు గ్రూపు అడ్మిన్ జె.వి.రాజు, కవులు గంప ఉమాపతి, స్తంభంకాడి గంగాధర్, బొమ్మకంటి కిషన్ వెల్మల కృష్ణారావు , ఉషఃశ్రీ వెగ్గలం,ఆది విజయలక్ష్మి , నూగూరి నాగవేణి, కొమురోజు మాధవి ,దార స్నేహలత , కొంటికర్ల లలిత , నీలగిరి అనిత ,బుర్ర విజయలక్ష్మి నాగరాజ్, యోగాచార్య సంపత్ కుమార్, జితేందర్ రావు ,శంకర్ లింగం ,జి కుమార్, మఠం సాంబమూర్తి ,రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1145 వ రోజు 'శ్రామికశక్తి' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'శ్రామికశక్తి' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...
-సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

### మాకూ ఒక డే

పోగేసిన చెమట చుక్కలు
ఒక్కటిగా చేరిన రెక్కలు
ఐదు వేళ్ళు ఒక్కటై
ఐకమత్యంతో పోరాడి
కర్మను గుర్తించమని
శ్రమను గౌరవించమని
సలసల మండే రక్తం సాక్షిగా
పటపట పళ్లు కొరికి
పిడికిలి బిగించి
ఎలుగెత్తి చాటిన రోజు
చెయ్యెత్తి చూపిన రోజు!!.
పెరిగిన భవంతుల్లో
పేర్చిన ప్రతి ఇటుకలో
పెరిగిన ధన అహంకారంలో
కారిన ప్రతి స్వేదబిందువులో
మా జాడ వెతుకుతున్నం!!.
మాకు నీడ ఎక్కడుంది?
మా గోడు వినేదెవరు?
మీ కడుపులు నిండే
మా కడుపులు మాడే!!.
శ్రమ సౌందర్యాన్ని గుర్తించి
శ్రమకు సమయం నిర్ణయించి
శ్రమ లేని లోకం శూన్యం
శ్రమ జీవికి ఓ రోజు పండుగ
ధర్మజలానికి కర్మ జనానికి
ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న
కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు!!.
-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

### ధరిత్రి పాటంతా...

నేడు
ఒంపులు తిరిగిన
ఎత్తైన రోడ్లన్నీ
సంబరం చేసుకుంటున్నాయి..
పారిపోలేని
పాతబడ్డ చెట్ల వేర్లు
తమ తీయ్యదనాన్ని
నెమరేసుకుంటుంటే
ఆకాశం లోతు ఎంతుందోనంటూ
పైపైకి ఎగబాగుతున్నాయి
లేలేత చిగురుటాకులు
బహుశా అహంకార నీడలేని చెట్లుగా
నేలనంతా
బలంగా పాతుకుపోవాలని కాబోలు..
ప్రపంచ ముఖాలన్నిటికి
ఏదో ఒక పేరున్నా
శ్రామిక శక్తికి
ఐక్యతనే పెద్దగా ప్రఖ్యాతి
కార్మిక వర్గ చైతన్యం
కొత్త వెలుగులో
ధగధగమంటూ మెరుస్తుంటే
సరిగ్గా ఆ వేళలోనే
ఒంపులు తిరిగిన
ఎత్తైన రోడ్లన్నీ
సంబరం చేసుకుంటున్నాయి...
గడ్డిపోచల్లాంటి
మనుషులే కానీ
ఉద్ధృతమైన గాలిని వీచడంతో
హక్కుల పరంపరలన్నీ
అవలీలగా సొంతమయ్యాయి
ఆ పోరాటంలో
గొంతెత్తి గర్జించిన గళాలు
సరికొత్త ఆయుధాలై
పని గంటల మార్పుకు
నాందిగా నిలిచాయి
అందుకే..
ఈ హంగామా అంతా
ఎత్తైన అలలా
శిఖరాగ్రాన నిలవడంతో
రోజురోజుకు
నక్షత్ర కిరీటాన్ని
సొంతం చేసుకోవాలనే
ఆరాటం ఎక్కువవుతోంది..
ఈ నేల మీదనే..
ఈ సూర్యకాంతిశక్తిలోనే
న్యాయానికి శ్వాసనందించి
ఊపిరి నిలుపుకున్నాయి
ఐకమత్యంగా..
ఏది ఏమైనా..
విత్తనం లేకుండానే ఎదిగిన ధరిత్రికి
ఎప్పటినుంచో
శక్తి ధారపోస్తున్న సూర్యుడికే
తన శ్రామికశక్తి పాటంతా అంకితం.
- శ్రీలతరమేశ్ గోస్కుల

### కష్టమే కమనీయం

కర్మాగారాలలో పనిచేస్తూ
శ్రామికుడై నిలిచినాడు
కష్టమే కమనీయం
దేశంలో వెలుగు నింపుతూ
ఆ కష్టమే కమనీయంగా
కదిలించే యువతేజం
జగతిలో ప్రభంజనం
అది యువత జాతి నిర్మాణం.
కదులుతున్న కాలంలో
జీవనాన్ని సాగించి
శ్రమలోనే చైతన్యమని తెలిపి
నవజీవనానికి బాటలు వేశాడతడు
నిత్య సంతోషంతో నిలిచి
హృదయ శ్వాస నిలుపుతూ
భవిత మార్గాన్ని చూపించి
నూతన సౌరభాలు పెంచుతూ
దేశాన్ని ముందుకు
నడుపువాడు శ్రామికుడే!
-వి. సంధ్యారాణి

### కష్టపడితేగాని కూడు రాదు

కష్టపడి పనిచేసే
శ్రామిక సోదరులకు
ప్రతి దినమూ వారిదే
కష్టఫలి అన్నారు
కష్టపడితే గాని
కూడురాదు
దినం గడవదు
శ్రామికుల చెమటచుక్కలు
నుదుటనుండి
చెక్కిళ్ళ పై జారి
పెదవులపై చేరితే
ఉప్పగా తగిలితే
దాని ఫలితంగా
పొయ్యిలో కట్టెలు మండుతాయి
ఆకలిమంటలు సేద తీరుతాయి
దోపిడిదారుల చేతుల్లో
నలుగుతూ వేసారుతున్నవారికి
వారి కన్నీటివెతలు
వలస కార్మికుల వ్యధలు
పారిశుద్ధ్య కార్మికుల కథలు
వారి దినచర్య గాధలు
నిత్యం గరళాన్నే పుంటూ
ఆకలి బాధలకు తట్టుకొని
సర్దుకు పోవాలి
పెద్దవారి పుట్టినరోజులకు
పండగలకు
గుర్తింపుల గలగలలు కావాలి
కానీ
శ్రామిక జీవుల కష్టాలకు
లేపనాలు వారి కన్నీరు
వారి దినచర్య
వారి ఆకలిబాధలే వారి గుర్తింపు
వారికి సహాయం అందివ్వగలిగే
సంస్కారం కావాలి అందరిలో.
-ఆర్. రమాదేవి

### మనుగడ

క్యాపిటలిజం
కమ్యూనిజం
సోషలిజం
ఇజం ఏదైనా
రెక్కాడితేగాని డొక్కాడదన్నది
కాదనలేని నిజం.
సమాజంలో
మనగలిగే వర్గాల మధ్యలో పడి
నలిగే ప్రత్యేక వర్గమే శ్రామికవర్గం
భూస్వాముల దుర్మార్గాలతో
కర్మాగారాలలో
ఖర్మకు బ్రతుకునిలిపేస్తూ
బూర్జువా వర్గాలకు
బానిసలుగా
విలాస బాటలు నిర్మిస్తూ
పీడక వర్గం
పీడిత మార్గంలో
అనుపులులేస్తూ
ఆదాయం తక్కువైనా
ఆస్తులు కరిగినా
పెట్టుబడిదారులకు
పట్టుదేసంత లాభాలను తెస్తూ
చాలీ చాలని సౌకర్యాలతో
దినమైన బతుకీడుస్తూ
మలాల పూడికలు తీస్తూ
కులాల కంపులను భరిస్తూ
రొమ్ము రోగాలనుభవిస్తూ
భరించలేని కన్నీరును
పంటిబిగువున దాటేస్తూ....
వారంతటా ఉంటారు
కానీ ఎందుకూ కొరగారు.
అన్నంకోసం పదిలి ఎన్నో పాట్లు
అయినా పోగల సెగల తిట్లు
ఏ నిర్మాణం చూసినా ఎంతో గర్వకారణం
వెనుకున్నది శ్రామికుల రాత్రీ పగళ్ల రణం.
పోరాడేది మాత్రం
గుక్కెడు నీళ్ళకు, గుప్పెడు ముద్దకు
బొటాబొటీ భరణం.
ప్రతీరోజూ పిలిస్తే పలికే దూరంలో
ప్రమాదాల రూపంలో మరణం
ఏమిస్తే తీర్చుకోగలం వారి రుణం.
కార్మిక దినం
నినాదాల జెండాలు మోసేదే కాదు
ఆ దొరికేది
శ్రామికులనే ఐక్య జీవులేకదా
సామ్రాజ్య వాదుల పెత్తనపు
శ్రామిక శక్తి దోపిడి
రాజేస్తుంది
సామ్యవాదపు విప్లవజ్వాలల రగడ
త్వరలోనే అంతర్గాలం కావాలి
పెత్తందార్ల మనుగడ.
-నాగరాజు చుందూరి

### ప్రజాబలం

శ్రామిక శక్తి
గుప్పిట బిగించిన పిడికిలి
నినాదం
మొదట
చికాగో లో హే మార్కెట్ లో.
కార్మిక ప్రదర్శన పునాది
పారిశ్రామిక విప్లవం మార్పులలో
బతుకు బాగుకు పోరాటం
ఆర్థిక దోపిడీ విలువ.
మే ఒకటిన గళం విప్పి
పెట్టిన కేకలలో
నినదించిన శబ్దం
మే డే ప్రభంజనం
అలుపెరుగని జీవితంలో
ప్రతిఫలం అందని బతుకుకు
విముక్తి ముఖ్యం
అవినీతికి అలంబనయినా
లోకంలో ఉన్న జాతికి
లేని జాతి లోకివే
ఇది తప్పించుకునేందుకు
లోకంలో
విముక్తి బావుటా
ఎగరవేయక తప్పదు.
బంగారు జీవితాలను
పండించుకోవాలంటే
బడుగు బలహీన వర్గాలు
కర్షక శ్రామిక జనాలు
ఎదగాలంటే
ఈ విముక్తి ప్రజాగళం
గొంతు ఎత్తి
గట్టిగా పాడక తప్పదు
ఆగని పోరాటంలో
అంతులేని జంజాటం.
అదే మే డే
కార్మిక కర్షక
బడుగు బలహీన ప్రజాబలాన్ని
హోరెత్తించి
మహా ప్రభంజనంలా
నిదురపోని
నిదురపోనివ్వదు
ఆ గీతం మారుమోగుతూనే ఉండే
మేలుకొలుపు బలం మే డే!.
-కె.కె.తాయారు

### మానవ శక్తి .. మహితశక్తి

గనుల్లో
కార్ఖానాల్లో
పొలాల్లో
కండరాల సత్తువను ధారవోసి
నెత్తురును మరిగించి
చెమటను చిందించి
పలుగూ..పార చేతబట్టి
హలాలను భుజానికెత్తుకుని
గనుల్లో..
ఖనిజ సంపదలను వెలికితీసి
దేశసంపద ఇనుమడింపజేసింది
శ్రామికశక్తి.
కొండల్ని చీల్చి
బండలను పగులగొట్టి
రహదారులు కట్టినా
భారీ ఆనకట్టలు నిర్మించినా
భారీ భవంతులు, బంగాళాలు
బహుళ అంతస్తుల
భవనాలు రూపుదిద్దుకున్నా..
యంత్రపు చక్రాల కదలికలతో
వస్తూత్పత్తి జరిపినా
వెన్నెముక కార్మికశక్తి.
దుక్కి దున్ని
విత్తు జల్లి
నీరుపెట్టి
నారుపోసి
పంటలు పండించి
మన్ను నుండి మెతుకులు తీసి
బువ్వబెట్టి
కర్షకశక్తి
వాహనాలను
పరుగులెత్తించే చోదకశక్తి
మానవాభ్యుదయాన్ని
కాంక్షించే మేధాశక్తి
కావాలోయ్
దండిగ ఉండాలోయ్.
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం
ఎంతున్నా
మరయంత్రాలు
మరమనుషులు
ఎన్ని పనులు చేస్తున్నా
మానవశక్తిని
మహిత శక్తిని
తలదన్నే ఏ శక్తి లేదోయ్
మరలో మరమనుషులోయ్
వాని చేతుల్లో
మనుషులు కీలుబొమ్మలైనా
ఆ కీలుబొమ్మలను
రూపొందించేది
ఆడించేది
మానవశక్తే
మహితశక్తే
మానవాళి శ్రేయస్సుకు
కావాలోయ్
కార్మిక కర్షక శ్రామిక మేధాశక్తి
కావాలోయ్
మానవశక్తి
మహితశక్తి
వర్ధిల్లాలోయ్
శ్రమజీవనసౌందర్యం.
-మధు జెల్లా

### మేమే!!

మే..దే!
నేడే!
కసాయి గుండెల కాఠిన్యం పై
పగిలిన గుండెల
సుత్తి దెబ్బలు
చిట్టి చిన్న పెద్ద గుండ దీమలు
ఎర్రని నలుపు
రూపు రంగు
ఎంచని శ్రామికులు
బారులు బారులు!
వంగిన నడ్డి
విరిగిన రెక్కలు
ఎండిన బొక్కలు
కాలేకడుపులు
చీకటి బతుకులు
కడుపుచించుకుంటే
కాళ్ళమీద పడే వైనం
పెట్టుబడి దారుల దౌర్జన్యం
మాటల నీటి మూటలు
కపటపు చేతలకు చెల్లిన కాలం!.
పందొమ్మిది వందల
ఇరవైమూడులో
కలకత్తా కార్మికులు
హౌరా స్టేషన్ లో
ఆరంభించిన తిరుగుబాటు బావుటా
ఆపై చికాగో లో
వెలిగించిన అగ్నిపుల్ల
నలుదెసల కార్చిచ్చు
శ్రామికుల విజయం
నేటి పెత్తందారీ
పెట్టుబడిదారీ వ్యవస్థను తూట్లు
కార్మిక సంఘాల ఏర్పాట్లతో
అంతిమ విజయం ఐకమత్యానిదే!.
-ఎ.రాజ్యశ్రీ

### పని విభజన

శ్రామిక జీవనసౌందర్యం
కడు రమణీయం
శ్రమను నమ్ముకున్నవానికి
సదా విజయం
శ్రమజీవుల
పని విభజనలోని పరమార్థమెంతో
శ్రామికుల శ్రమశక్తికి
విలువకట్టే షరాబులెవరో
పారిశ్రామిక విప్లవానికి
బాటలు వేసె శ్రమశక్తి
శ్రమజీవుల పని
విప్లవాలెన్నిటికో ఆద్యం
కార్మిక కర్షక శ్రమజీవుల
శ్రమశక్తిని దోచే ధనస్వాములెందరో
కార్మికుల హక్కుగా
ఎనిమిది గంటల పని నియమం
చికాగో నగరంలో వెలసిన
పని గంటల ఉద్యమం
అదే భవితలో మే డే
కార్మికుల హక్కుల కోసం
కార్మిక దినోత్సవం
యంత్రాలను నడిపిన శ్రమజీవుల
నైపుణ్యాలను మెరుగుపరచుకొని
మెరికల్లా కార్మికులు
గనిలో పనిచేసే కార్మికులకు
సంక్షేమ పథకాలెన్నో
దేశపు ఆర్థికశక్తి
ఉత్పాదకశక్తి
ఊతం శ్రామిక శక్తి.
- లక్ష్మారెడ్డి పసుల

# సమకాలీన సమస్యలు పరిష్కృతికి దోవలు



ప్రతులకు:
డా॥ ఆలూరి విజయలక్ష్మి,
శ్రీ శ్రీ హోలిస్టిక్ మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్స్, నిజాంపేట్ రోడ్, కూకట్‌పల్లి,
హైదరాబాద్-500 072.
సెల్: 98490 22441.

"ఇంత వరకు మనం పరిజ్ఞానం వెంట, పదవుల వెంట, ఆస్తులు, పేరు, ప్రతిష్ఠల వెంట పరుగు పెట్టాము. వీటిపై వ్యామోహాన్ని త్యజించటం అంత సులభం కాదు. మనని, మన కుటుంబాన్ని దాటి మన పరిధిని సమాజానికి విస్తరించాలనే దృఢమైన నిర్ణయాన్ని తీసుకోగలిగితే, వీటన్నిటి నుండి విముక్తమవటానికి బలం వస్తుంది"

"డాక్టర్ కేవలం మేధస్సుతో కాక, హృదయాన్ని కూడా కలిపి తన ప్రొఫెషన్ చేయాలి. రోగిపట్ల నిజాయితీ, ఎంపతీ లేని వ్యక్తి డాక్టర్ వృత్తికి అనర్హుడు". లాంటి నిత్య జీవిత సత్యాలను గైనకాలజిస్ట్, రచయిత్రి, సామాజిక కార్యకర్త డా॥ ఆలూరి విజయలక్ష్మి గారు బలంగా విశ్వసిస్తారు. ఆచరిస్తారు.

నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు పాఠకులను తన రచనలతో అలరిస్తున్నారు. 6 కథా సంపుటులు, 4 నవలలు, 7 అనువాదాలు, 4 హెల్త్ ఎడ్యుకేషన్ పుస్తకాలుతో అలరించిన వీరు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా తరఫున 3 ఆంగ్ల పుస్తకాలు తెలుగులోకి అనువదించారు. సమాజంలోని ఉన్నత వర్గాల జీవన శైలిని ఎంత నిపుణతతో చిత్రించ గలరో అంతే నైపుణ్యంతో అట్టడుగు వర్గాల జీవన యానాన్ని ఆకట్టుకు నేలా చిత్రించగలరు.

ప్రస్తుత సంపుటి "అంతర్ముఖం"లో 13 కథలున్నాయి. ఇవ్వబడిన ప్రతి కథా, సమకాలీన సమాజపు తీరు తెన్నుల్ని సమస్యల్ని ప్రస్తావిస్తూ రచయిత్రిగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ పాఠకులకు మంచి సందేశాలను ఇస్తారు.

నేటి కాలపు యువతకు దూసుకుపోవటానికి, తన ప్రత్యేకతను ప్రదర్శించటానికి ఎన్నో మార్గాలున్నాయి. కాలేజీ జీవితంలో అవి కోకొల్లలు. అయితే వాటన్నింటిల్లోనూ పై మెరుగులే ఎక్కువ. పెడత్రోవన పట్టించి యువత భవితను భ్రష్టు పట్టించి అటు పిల్లలకు తల్లిదండ్రులకు మనోవేదన కలిగించేవీ ఉంటాయి. ఏవీ మంచి వో ఏవి పెడదోవన పట్టించేవో యువత తెలుసుకోగలుగాలి. వారి తలిదండ్రులు ఒక 'రిమోట్'లా వ్యవహరిస్తూ పిల్లలు దారితప్పకుండా నియంత్రించాలి. ఇవే సందేశాలను దిశ, ఊబి కథలు చెబుతాయి. శారద కొడుకు కారుణ్య **"మ్యూజిక్ కాన్సర్ట్"** పేరుతో బయలుదేరి, డ్రగ్స్ మద్యం ప్రభావం తో ఏక్సిడెంటు చేస్తాడు.

తర్వాతి కాలంలో కారుణ్యంలో మార్పు వచ్చి మంచి నడతతో అందరి ప్రశంసలు పొందుతాడు **'దిశ'** కథలో. ఇలాంటిదే మరో కథ **'ఊబి'**. కాలేజీలో చదువుతోన్న స్వచ్ఛ శైలజ అనే విద్యార్థికురాలి కూతురు. ఒకనాటి సాయంత్రం ఇంటికి రాకపోతే శైలజ ఆందోళనకు గురి అవుతుంది. ఊరికి దూరంగా ఉన్న ఓ కాంప్లెక్సు లోని సెల్లార్‌లో డ్రగ్స్, మద్యం మత్తులో, అత్యాచార ప్రయత్నంలో గాయపడిన స్వచ్ఛను కనుగొని అవాక్కవుతుంది. ఇలాంటి వాటి నుండి రక్షించాల్సిన నియంత్రించాల్సిన సంస్థల వైఫల్యం, పెద్దల నిర్లిప్తత వల్ల ఇలా జరుగుతుందని గ్రహించిన శైలజ, వాటిని నిర్మూలించేందుకు సమాయత్తమవుతుంది.

ప్రపంచమంతా ఒక ఉమ్మడి 'యుద్ధం' చేస్తున్నది. రకరకాల యుద్ధాలు బయంతో యుద్ధం అభద్రతతో యుద్ధం ఆకలితో యుద్ధం, ఆత్మతో యుద్ధం (పే 99) అన్నింటినీ మించిన కరోనాతో మరో పెద్ద యుద్ధం.!ఆ యుద్ధంలో మానవత్వం కోల్పోవద్దని చెప్పే కథ "యుద్ధం". స్వార్థపు లోకంలో సాటి మనిషి యెడ సానుభూతి చూపాలన్న సందేశం ఇస్తుంది. కాలేజీ చదువుకై కలలుగంటున్న జానకికి మందువా లోగిలి పాటి పంటలతో లోటులేని శ్రీనివాస్‌తో పెళ్ళి అవు తుంది. తాహతుకు మించి దర్జాగా బ్రతకాల నుకునే శ్రీనివాస్ ఆస్తులు. 'ఎకనమిక్ జోన్' అనే ప్రభుత్వ స్కీమ్ వల్ల అన్యాక్రాంతం అవుతే- లక్షలాది మంది పేదల కడుపుకొట్టే 'అభివృద్ధి' ఏమిటో ఎందుకో, ఎవరి కోసమో జానకికి అర్థం కాదు. అభివృద్ధి పేరిట ప్రభుత్వమే 'ఒక బ్రోకర్'గా మారుతోన్న వైనాన్ని వివరిస్తుంది **'అగ్ని గుండం'** కథ.


పడగ్గదిలో పడుకునుండగానైనా ఎవరో ఫ్రెండ్ వచ్చి "ఆనంద్" అని పిలవగానే ఆనందంగా తలుపు తీసుకని వెళ్ళిపోయే ఆనంద్ భార్య ఇందిర. స్నేహితురాలు మాధవి కలిస్తే చాలు- నక్షత్రాలు కోసుకుని మాల కట్టుకుని జడలో పెట్టుకుంటారు. వెన్నెల చీరలు కట్టుకుంటారు. భావుకత చిరుహాస్యం మేళవించిన కథ **వెన్నెల వాకిట్లో..**

కాలేజీ జీవితం ప్రతి యువతి యువకుల జీవితాల్లో 'మలుపు' వంటిది. ఎన్నో ఆశలు ఆశయాలు. ఏదో కావాలని ఏదో సాధించాలని రంగుల భవిష్యత్తులోకి తొంగి చూడటాలు.

అయితే- ఇవన్నీ ఎంత వరకు సాధ్యపడ్డాయో 40 ఏళ్ళ తర్వాత కాని తెలియదు. ఆశలు vs అఛీవ్‌మెంట్స్‌ను బేరీజు వేసి చూపే కథ **"అంతర్ముఖం"**.

ఒక రచయిత/రచయిత్రి నడుస్తోన్న చరిత్రను మంచీ చెడుల్నీ బేరీజు వేసాక పరిష్కారం సూచించటం కథకు అత్యవసరమా? అన్న ప్రశ్న వేసుకుంటే.. అంత అత్యవసరం కాదను కుంటాను. సమస్యల్లోని మంచి చెడ్డలను వివరించిన తీరును బట్టే రచయిత ఇవ్వదలుచుకున్న సందేశం పాఠకుడికి అర్థం అయితే చాలు. అని విశ్వసించే ఈ రచయిత్రి ప్రతీ కథకు తన సమాధానం/ పరిష్కారం ఇవ్వకపోవటం సముచితంగా ఉంది. ఒక్కో సమస్యకు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలుండవచ్చును. ఇదే ఉద్దేశంతో **'వెన్నెల వాకిట్లో..' 'యుద్ధ భూమి'.** లాంటి కథలని ముగించారనిపించుతుంది.

మంచి, సమకాలీన వస్తువు, అభివ్యక్తి ఒక్కో కథలో మరిచిపోలేని కొటేషన్లు. ముగింపు పేరాలు/వాక్యాలు- ఒక మంచి కథా సంపుటి చదివామన్న సంతృప్తి పాఠకుడికి తప్పక కలుగచేస్తుంది. మనిషికే కాదు, మనసుకూ చికిత్స అవసర మని విశ్వసించి, ప్రయత్నిస్తోన్న డా॥ ఆలూరి విజయలక్ష్మి గారికి అభినందనలు.



- కూర చిదంబరం
సెల్:8639338675

### మణిపూసలు

ధైర్యమే నడిపిస్తుంది
అధైర్య మోడిస్తుంది
మానవత వున్న మనిషిని
విజయమే వరిస్తుంది!.

దివ్వ బుద్ధి ప్రదాత
దివ్వ దృష్టి విధాత
ఆ పరమాత్మ శివుడే
జీవన్ముక్తి నాథ!

బాధ్యతనే గొప్పదా
అధికారము గొప్పదా
నేల విడిచే సాముతో
తల వంచక తప్పదా?!

నటనేమొ నమ్మిస్తుంది
నమ్మికను కాటేస్తుంది
మంచితనపు ముసుగేసి
స్వార్థాన్ని శ్వాసిస్తుంది!


వ్యవసాయపు క్షేత్రం
వేసారిన సూత్రం
కడగండ్ల పాలైన
రైతు బతుకు చిత్రం!

పెరుగుతున్న కబేళాలు
తగ్గిపోతున్న పశువులు
మృగాలను మించుతున్న
క్రూరత్వమున మానవులు!

అడవి ఆశల దీపం
ఉమ్మడి అమ్మ రూపం
ప్రాణవాయువు నివ్వగ
తప్పును మృత్యు శాపం!
ఇల్లంతా గుల్లవును
రాగాలు వెల్లువవును
మద్యం మత్తున బడితే
బతుకంతా చిత్తవును!

చేతులతో చప్పట్లు
మనసు కలిపె ముచ్చట్లు
శత్రువైన కప్పిచూడు
అభినందన దుప్పట్లు!


చక్కని చుక్క నెరజాణ
వలసి వచ్చిన పనసతొన
చూపుల పూలమాల
వేసినది మక్కువతోన!



-యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

పుస్తక సమీక్షలు

# ఉదయ కవన కిరణాలు!



ప్రతులకు:
కె. బ్రహ్మయ్య ఆచారి
కర్నూల్, ఆంధ్రప్రదేశ్
సెల్: 9581357107

కర్నూల్‌కు చెందిన ఉదయ సాహితీ వేదిక ఆధ్వర్యంలో.. మెట్రో ఉదయం జాతీయ దినపత్రిక సౌజన్యంతో.. కె. బ్రహ్మయ్య ఆచారి సారథ్యంలో.. బి. లక్ష్మీనారాయణ యాదవ్ సంపాదకత్వంలో.. కందాళై రాఘవాచార్య, పోలయ్య కవి కూకట్ల పల్లి, సాత్రివం ప్రసాద్‌రావు, కోడిగూటి తిరుపతి, పోతుగంటి వీరాచారి, కొండా రవీందర్‌గార్ల అండదండలతో.. "తొలి కిరణాలు" పేరుతో ఓ జాతీయ కవన సంకల నాన్ని వెలువరించారు. ఇప్పుడిప్పుడే రాస్తున్న కొత్త కవుల భావ స్పందనలే కాక.. కందాళై రాఘవా చార్య, చందనరావుగారి వంటి సీనియర్ కవుల అక్షర ధారతో ముస్తాబై వచ్చిన ఈ సంకలనంలో విభిన్నమైన కవితా వస్తువులు.. భిన్నమైన అభివ్యక్తితో కవితల రూపంలో కొలువుదీరాయి. దీపావళి పండుగ ప్రాశస్త్యం, మాతృభాష తెలుగు పట్ల మమకారం.. ప్రకృతి విధ్వంసం వల్ల కలుగుతున్న అనర్థాలు.. మహిళల వెతలు, కరోనా కష్టాలు. ఉద్యోగాలు లేక యువత పడుతున్న వేదనలు.. ఇలా అనేక అంశాలతో కవితలు ఇందులో కానవస్తాయి. మెట్రో ఉదయం పత్రిక ద్వారా కవులను ప్రోత్సహిస్తూ.. వారి రచనలను ఆదరిస్తూ.. చాలా మంది కవులు తమ కవనాలను అచ్చులో చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేరుస్తూ ఈ సంకలనాన్ని వెలువరించడం అభినందనీయం.. పలువురు ప్రసిద్ధుల ముందుమాటలు సంకలనం యొక్క శోభను పెంచాయి. కొత్త కవులకు చక్కని ప్రోత్సాహాన్ని యిచ్చే విధంగా బి. లక్ష్మీనారాయణ, కొండా రవీందర్‌గార్లు తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయం.. 158 మంది కవుల రచనలతో మన ముందుకు వచ్చిన జాతీయ కవితా సంకలన మిది. వర్ధమానులు.. ప్రవర్ధమానుల మేలు కలయికగా తొలికిరణాలు ప్రసరించడం ప్రశంసనీయం. ఇందలి కవితా కిరణాలు.. హృదయ కిరణాలై అందరినీ అలరించేలా ఉన్నాయి. కొత్తగా కలం పట్టిన వారు.. ఇంతటితో ఆవకుండా.. కవిత్వ సృజనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని తమ కలాలకు పదును పెట్టుకుంటారన్న విశ్వాసం ఉంది. రాశికన్నా వాసి ముఖ్యమన్న సంగతిని మరువకుండా కవిత్వ కనీస ప్రమాణాలతో రచనలు చేస్తారన్న నమ్మకముంది. ప్రచార ఆర్భాటం కోసమో.. కవిత్వ సృజనలో సెంచరీలు దాటాలన్న ఆకాంక్షతో కాకుండా.. సమాజహితంతో సామాజిక చైతన్యానికి.. సమాజహితంతో సామాజిక చైతన్యానికి దోహదపడే విధంగా ఆలోచనాత్మక కవిత్వం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రహిస్తారన్న విశ్వాసముంది.

కవిత్వాన్ని కవిత్వంలా రాయాల్సిన విషయాన్ని ఎప్పుడూ విస్మరించకుండా.. కవిత కాస్త మినీ వ్యాసంలా రూపాంతరం చెందకుండా కొత్త కవులందరూ అప్రమత్తంగా ఉంటూ.. అధ్యయనం ద్వారా తమ కవితా పటిమను పెంచుకుంటూ ముందుకు సాగుతారన్న నమ్మకమూ ఉంది. వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని పాటిస్తూ.. అభివ్యక్తిలో నవ్యతకు చోటుకల్పిస్తై.. శిల్పం విషయంలో చతురతను ప్రదర్శిస్తూ కవిత్వం రాసినప్పుడే మన కవిత్వం నిలబడుతుంది. మనం కవులుగా మన గలుగుతామన్న సంగతిని ఎప్పుడూ కొత్తవారు గుర్తు పెట్టుకోవాల్సి ఉంది. కవితా శీర్షిక, ఎత్తుగత, కొనసాగింపు, పదబంధ ప్రయోగంలో వస్తువుకు అనుగుణంగా ఔచిత్యాన్ని పాటిస్తూ కొత్త కవులు కవన యానం చేయాల్సి ఉంది. అంతేగాక- కవిత ముగింపులో ఓ మెరుపు, చరుపు, విరుపు, చమత్కారం, వ్యంగ్యం తదితర అంశాలు జోడిస్తే మరీ బాగుంటుందన్న సంగతి కొత్తవారు తెలుసుకోవాల్సి ఉంది. పునరుక్తి దోషాలు లేకుండా.. వస్తువు వెలుగులో అభివ్యక్తి యందు స్పష్టత కొరవడకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. అశోక్ గుంటుక ఆకాశం శీర్షికతో రాసిన కవితలు ఆకాశం ఒకోసారి జీవితపు జ్ఞాపకాల అద్దమవుతూ.. మరోసారి జీవనాభ్యుదయపు గమ్యమవుతూ ఎప్పుడూ నవజీవన ఆకాంక్షల చుక్కానవుతూ అంటూ కొనసాగించడం బాగుంది. మీరూ చూసేరా ఆకాశం వైపుకి! అంటూ ముగించడంలో కవి యొక్క ప్రతిభ కానవస్తోంది.

మూఢనమ్మకాల జాడను వదిలించి శాస్త్రీయ, స్వప్నంలో సాహసం చేయాలనీ.. మరో బుద్ధుడిలా అంబేద్కర్ మార్గం మనకు దారి చూపిస్తూనే ఉంది కాలంపై అక్షర జ్వాలై ప్రకాశిస్తూనే ఉందంటూ "ఫిజిక్స్" అరుణ్‌కుమార్ తమ కవితలో పేర్కొన్నారు.

**కలవని దిక్కుల పయనంలో**
**ఎవరు ఎవరి పాట పల్లవిస్తారో**
**ఎవరు ఎటు దిక్కున వాలుతారో**
**కాలమే తేల్చుతుంది మిత్రమా!**

అంటూ కోడినూటి తిరుపతి రాస్తే.. ఈ జీవితం చాలా చిన్నది. నిత్యం చెరగని చిరునవ్వుతో ఆవగింజంత ఆశతో జీవించమన్నది అంటూ పోలయ్య కవి కూకట్లపల్లి తమ కవితను తీర్చిదిద్దారు.

చరిత్ర చీకట్లను చీల్చిన జ్యోతి- జ్యోతిరావుపూలే అని పోతుగంటి వీరాచారి అంటే.. ముత్యం వెంకటేశ్వరరావు మాతృభాషను మరువొద్దని సూచించారు. మట్టిలోనే పురిటినొప్పుల- చెమటగీతం పలికిన నా హృదయం.. చెలిమి చుక్కల కష్ట రాగం.. గెలుపు జీవనమై సాగిందంటూ మానవత్వపు చినుకులను 'కవిత సిటీపల్లి' కురిపించారు. ఉన్నత విలువలు.. వినయ విధేయతలే మనిషికి ఆభరణాలని కల్లేపల్లి సరళ అంటే.. దీప్తుల రవళి-దీపావళి అంటూ దీపావళి పండుగను జె.వి. కుమార్ చేపూరి ఆవిష్కరించారు. లోక కళ్యాణం కోసం మొగులుకు బోనమెత్తే సన్నివేశాలను కందాళై దృశ్యమానం చేస్తే.. రమేష్ గోస్కుల. కైతికాల ద్వారా సంతోషాల వెలుగులను ప్రసరింపజేశారు. కైతికాల్లోనే.. ఆప్తమిత్రులే దీపకాంతులని శ్రీలత రమేశ్ గోస్కుల తమ కవిత ద్వారా వివరించారు. రంగు రంగుల కవితా తోరణాలల్లి అక్షరమాలను రక్షిద్దామంటూ రాజ్యలక్ష్మి. ఎ, పిలుపునిస్తే.. ఎస్. మోహన్‌గౌడ్ రైతన్నను కర్షకేశ్వరుడిగా అభివర్ణించారు. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే విధంగా అతివలు వస్త్రధారణ చేయాలని ఆకాంక్షిస్తూ డా॥ పోల సాయిజ్యోతి రాస్తే బాహ్య సౌందర్యం కన్నా.. ఆత్మ సౌందర్యమే మిన్న అంటూ డా॥ రామక కృష్ణమూర్తి పేర్కొంటే.. కరోనా కష్టాలను మండపాటి వీర వెంకటరెడ్డి, ధర్మకారి శ్రీనివాస్ తదితరులు ఏకరువు పెట్టారు.

పదిమంది మెప్పు కోసం ఆరాటపడే యుక్తిమంతుల వింత ధోరణులు ప్లాస్టిక్ పూల పరిమళాలు అంటూ సయ్యద్ జహీద్ ఆహ్మద్ రాస్తే.. కన్నీటి చుక్కల గురించి డా॥భమిడి మల్లికరులాదేవి తమ కవిత ద్వారా వివరించారు. ప్రజాప్రతి నిధుల తీరుతెన్నులను.. లయాత్మక పదబంధాలతో.. ఎమ్. జానకీరాం ఆవిష్కరిస్తే.. పోగుకొక్క చెమట చుక్క అంటూ నేతన్నల వెతలకు అద్దం పడుతూ యెనుగందుల శంకర్ తమ కవితను రూపుదిద్దారు. దీపావళి పండుగను ప్రతిఫలింపజేస్తూ విష్ణుచక్రం వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ కమల ముక్కు రాస్తే. విజయోత్సవ ప్రతీకగా దీపావళిని పేర్కొంటే బోయ వెంకటేశం తమ కవితను తీర్చిదిద్దారు. నా జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దిన మరో బ్రహ్మ! మా నానమ్మ అంటూ ఆకుమళ్ల కృష్ణదాస్ పేర్కొంటే.. బంధాలు.. అనుబంధాలు ఉల్లిపొరలు లాగా పెనవేసుకోవాలని చంద్రకళ దీకొండ ఆకాంక్షించారు.

కష్టాలను కరిగించి సంతసాన్ని మదికి చేర్చు దీపావళి అంటూ పురంమంగ రాస్తే.. అనాథల ఆక్రందనలు ఆగిననాడే అసలైన దీపావళి అంటూ రుక్మిణీశేఖర్ తమ కవిత ద్వారా వ్యాఖ్యానించారు. వేయి వసంతాల అమృతమయం నా భాష అంటూ తాతోలు దుర్గాచారి పేర్కొంటే. అబలవు కావు నీవు అతివవు నీవు! ఏడుస్తూ చేతులు ముడుచుకోకు.. నిశ్శబ్ద తరంగానివై ఎగిసిపడుమంటూ డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి హితవు పలికారు. సంతానానికి సంస్కారం నేర్పాలని మాంకాలి సుగుణ సూచిస్తే.. మరుపే తెలియని మనసును జ్యోతి మువ్వల తమ కవితలో ఆవిష్కరించారు. కల్వల రాజశేఖరరెడ్డి నిరుద్యోగ జీవితాలను ఏకరువు పెడితే.. పిల్లలే కదా మన పాలిట వరాలు అంటూ వనపర్తి గంగాధర్ తమ కవితను ప్రారంభించారు. మన పల్లెలు.. అందని ఎల్లలు అంటూ పెల్లెల్లోని వివిధ వృత్తులను.. శ్రమైక సౌందర్యాన్ని వి.వి. దుర్గాప్రసాద్ తమ కవితలో వివరించారు. కరోనా కలంలో విద్యార్థులు పడిన కష్టాలను ఎం. శంకరమ్మ వివరిస్తే.. సాటివారికి ప్రేమను పంచాలని డా॥ కొణిదల శోభ హితవు పలికారు. దీపావళి పండుగ రోజున చిన్నప్పుడు పొందిన అనుభవాలను మల్లాది సోమేశ్వర శర్మ గుర్తుకు తెచ్చుకుంటే.. దీపావళి జయభేరి మ్రోగించేద్దాం అంటూ డా॥ రాచపూడి సునితాదేవి పిలుపునిచ్చారు. దాంపత్యం.. అర్ధనారీశ్వరంగా కొనసాగాలంటూ.. చక్కటి పదబంధాలతో.. రమణీయ భావాల తో ముత్యాలవారి సుమ తమ కవితను తీర్చిదిద్దారు-

పదాలు పలుకలేని భావాల తళుకులతో దీపసుందరి వెలుగుతోందంటూ జ్యోతిరాణి రాస్తే.. నీ జీవితాన్నే ఒక దీపావళిగా మార్చుకొమ్మంటూ తాతపూడి సోమశేఖరశర్మ తమ కవితను రూపుదిద్దారు.

మహోన్నతం మన సంస్కృతి అంటూ తమ కవిత ద్వారా తెప్పల కృష్ణమూర్తి చాటి చెబితే.. వికృతైన ప్రకృతికి సాక్షులెవరు? అంటూ సుజాత పి.వి.ఎల్. ప్రశ్నిస్తే.. ప్రకృతి అందాలను పూసాల సత్యనారాయణ తమ కవితలో ఆవిష్కరించారు. మంచి అలవాట్లను పెంచుకుని అభివృద్ధి వైపు అడుగులేద్దామంటూ చెంగల జ్యోత్స్నారాని పిలుపునిస్తే.. రైతన్న వ్యథలకు మిరప మహేష్ అద్దం పట్టారు. అమ్మే నాకు ఆదర్శమని జువేరియా పేర్కొంటే.. ఆటకెక్కిన జీవితాలను కె. రంగనాయకులు తమ కవితలో వివరించారు. పరిపాలనలో సంస్కరణలు రావాలంటూ పరాంకుశం రఘు నారాయణ కోరుకుంటే.. వనిత ఔన్నత్యాన్ని డా॥గాజుల నరసింహ తమ కవిత ద్వారా తెలియజెప్పారు.

దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని ఆవిష్కరిస్తూ సి. రక్షిత, కె. శైలజా శ్రీనివాస్, చేవెంద్ర శ్రీనివాస్‌రావులు రాస్తే.. బందీఖానాలో ఉన్న ప్రజల మనసులను విడుదల చేస్తేనే నిజమైన దీపావళి అని వడ్డేపల్లి మల్లేశం పేర్కొన్నారు. మృగరాజ్యంలో స్త్రీకి స్వేచ్ఛ లేదా? అంటూ రమాదేవి ప్రశ్నిస్తే.. మట్టి ప్రమిదలు వెలిగించి మన సంస్కృతిని కాపాడాలని అనసూయ ఆకాశ్ చౌహాన్ ప్రకృతి ప్రవచనాన్ని అందించారు.

పని ఉన్న రోజుల్లో గోటిలో సూది దిగితే.. నొప్పిగా.. ఇప్పుడు గుండెల్లో దిగే ఆకలి బాకులు అంటూ కనుమరుగవుతున్న కుట్టుమిషన్ల గురించి తమ మనసులోని భావాలను ఎం.వి. ఉమాదేవి పంచుకుంటే.. మనసు పొరల్లో నిక్షిప్తమైన స్మృతుల పరిమళాలను జీవితపు పుటల్లో భద్రంగా దాచుకున్నానంటూ నెల్లూరు వెంకట లక్ష్మి తమ కవితను తీర్చిదిద్దారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఎండగడుతూ వాసంతిశ్రీ రాస్తే.. మానవీయ విలువలే మమతలకు నెలవులు అంటూ జనశ్రీ జనార్ధన్ కుడికాల పేర్కొన్నారు. అక్షరం ఆత్మలాంటిది- అంతం కానిదంటూ బూర దేవదానం అంటే.. నాన్న గురించి ఎంత చెప్పినా తక్కువేనంటూ కన్నోజు లక్ష్మీకాంతం పేర్కొన్నారు.


**'అవ్వచేతి బువ్వ'** కవితలో ఈ మట్టి యొక్క గొప్పదనాన్ని.. తెలంగాణ ఔదార్యాన్ని వి.పి. చందన్‌రావు ఉన్నతంగా చిత్రించారు.

నాకు చేతులు లేవు- అయినా కానీ నాలో కవిత సాగుతూనే ఉందంటూ దివ్యాంగురాలు రాసిన కవిత 'ఆత్మ విశ్వాసం' అందరికీ ప్రేరణనిస్తుంది, అయితే ఇప్పుడు ఆమె మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం! 'నల్ల కలువ' కవితలో మహిళకు- మానవాళికి మార్గదర్శం చేస్తున్న **కమలాహారీస్‌కు అరుణ డేనియల్** అక్షర హారతి పడితే.. బతుకు చీకట్లలో రతనాల వెలుగులు నింపుమంటూ **డా॥ అడిగొప్పుల సదయ్య** దీపానికి వందనం సమర్పించారు. తెలుగు భాష గొప్పదనాన్ని తాళ్లపల్లి భాగ్యలక్ష్మి వివరిస్తే.. శాంతిదూతగా భాసిల్లిన బాపూజీని **బాణాల త్రివేణి** స్మరించుకున్నారు. నిదురపోతున్న మనసు లోగిలిని జాగృతం చేయ నవ్యభావ ఆవిష్కరణలకు మస్తిష్కంలో జీవనదిలా.. అక్షర కెరటాలు తొలకరిలో నెమలి నాట్యంలా పురివిప్పి ఆడుతాయని **రవీందర్ కొండ** పేర్కొన్నారు. **డా॥ ఉదారి నారాయణగారి** "మనిషి నాటకం" కవిత ఆలోచనాత్మకంగా ఉంది. చివరి అంకం మొదలు కాగానే రంగస్థలం కుప్పకూలిందనీ.. నరుని నాటకానికి తెరపడిందని పాత్రలన్నీ చెల్లా చెదురై వెంటిలేటర్లపై గంటలు లెక్కిస్తున్నాయంటూ ప్రారంభించం బాగుంది.

పల్లెకు ప్రకృతే ప్రాణాధారం.. పట్నానికి పల్లెలే జీవనాధారం పల్లెలు, పట్నాలే జగతికి మూలాధారం అంటూ 'మార్పు' కవితకు ఎస్. రత్నలక్ష్మి మంచి ముగింపునిచ్చారు. మట్టిని నమ్ముకుని, మట్టిలోనే జీవించే రైతుల శ్రమైక సౌందర్యాన్ని గంజి ప్రియలత ఆవిష్కరించారు.

పై కవితలే కాక మరికొంత మంది కవి మిత్రుల కవితలు ఇందులో ఉన్నాయి.

కొత్తవారిని కవులుగా తీర్చిదిద్దేందుకు కర్నూలు హైదరాబాద్, ఉదయసాహితీ వేదిక మరియు మెట్రో ఉదయం పత్రిక చేస్తున్న కృషిని అభినందిద్దాం.. ఈ సంకలనంలో చాలా వరకు కవితలు సాదాసీదాగా చోటు చేసుకున్నాయి. రాశి కన్నా వాసి ముఖ్యమన్న సంగతిని కొత్త కవి బంధువులకు తెలియజెబుతూ కనీస కవిత్వ ప్రమాణాలతో కవిత్వం రూపుదిద్దు కునేలా కొత్త కవులకు మార్గదర్శనం చేస్తారని ఆశిస్తున్నారు. అలాగే వాక్యాలను నిలువుగా పేర్చి.. మినీ వ్యాసంలా కూర్చి దీన్నే కవిత్వం అనవద్దన్న సంగతిని కొత్త కవులందరూ గ్రహించాలని కోరుతున్నాను- అధ్యయనం ద్వారా కవిత్వ రచనలో కవులు తమ కలాలకు పదును పెట్టుకుంటారని ఆశిద్దాం.



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## నా కవిత

నేను వ్రాయాలనుకున్న అక్షరాలకు,
నేను చెప్పాలనుకున్న భావాలకు,
నేను పలకలేననుకున్నపదాలకు,
నా మనసులో పొందు
పరుచుకుని ఉన్న ఆలోచనలకు
సాక్షాత్కరించిన
రూపమే నా కవిత.

జరిగిపోయిన కాలపు గురుతులకు,
జరుగుచున్న పరిణామాలకు
జరగబోవు ఊహాకందని సంఘటనలకు,
నిలువెత్తని ప్రతిరూపమే నా కవిత.

నాలోని భావాలకు అక్షర
రూపాన్ని ఇచ్చింది నా కవిత
నాలోని వేదనలను అందరికీ
వినిపించింది నా కవిత..
నాలోని భాధలను నిలువెత్తి
చూపించింది నా కవిత..
నాలోని ఆనందాలను అందరితో
పంచుకునేలా చేసింది నా కవిత.

కవి అన్న బిరుదుతో నాకు
సత్కారం పంచింది నా కవిత
సాహిత్య లోకంలో నాకు
గుర్తింపు ఇచ్చింది నా కవిత.

అన్నీ ఇచ్చిన నా కవితకు
ఏమివ్వగలను..?
అభినందన వందనాలు తప్ప..!
కృతజ్ఞతతో వందనాలు
తెలుపుట తప్ప..!



-ఎన్. రాజేష్
9849335757

## నూకలు చెల్లిన విలువలు

అయిదేళ్లకొసారి..
ప్రలోభాల జాతరలు
ఓటర్లకు ఉచితాల ఎరలు
బలిపించో బెదిరించో..
ఓట్లను గుంజుకునేటోళ్లు !

చేతుల మీద పోటెత్తుతున్న..
ధనస్వామ్య దగాకోరు దందాలు
ముక్కు చెక్కుల సునామీలు
కిరాయి గుండాల వీరంగాలు
హేయమైన వ్యక్తిగత విమర్శలు !

కులమత విద్వేష మంటలు
కుల్లిన సమాజ విలువలు
వర్గాల వారీగా తాయిలాలు
'కట్టలు'తెంచుకుంటున్న..
నల్లధనం గుట్టల పరవళ్లు !

నూకలు చెల్లిన పోర విలువలు
ధన కండ బలాలే కనీస అర్హతలు
ఊపిరిపీస్తున్న దుర్రాజకీయాలు
పరేషాన్లో ప్రజాస్వామ్య ఊపిరులు
ఆక్సీజన్ అందించే నాయకులే కరువు !



-డా॥బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

## సజీవ శిల్పాలు

– మాల్యశ్రీ

1980లో వ్రాసిన కథ

ఆ సారి శ్రీశైల క్షేత్రం వెళ్ళాను. ఉదయమే కృష్ణవేనిలో పాపనాశనం రేవులో స్నానం చేసి మెట్లెక్కి పైకి వస్తున్నాను. స్నానాల కోసం వెళ్తూన్నవాళ్లూ, స్నానాలు ముగించుకొని దైవదర్శనానికి వస్తున్నవాళ్లూ అందరితో ఆ మెట్లదారి కిక్కిరిసి ఉంది. అక్కడక్కడ మెట్లవద్ద–రాళ్లమీద యాత్రికుల పేర్లు చెక్కేవాళ్లు సుత్తులు, శ్రావణులు పట్టుకొని ఆ వచ్చిపోయేవాళ్లని పేర్లు చెక్కించుకోమని మరీ అడుగుతున్నారు. కొందరేమో వద్దని వెళ్లిపోతున్నారు.

నన్నుకూడా ఇంతకుముందు స్నానానికి వెళ్లేపుడు పేరు చెక్కించుకోమని అడిగారు వాళ్లు. నేను అవసరం లేదని వెళ్లిపోయాను. తిరిగివస్తున్నప్పుడు మళ్లీ కొందరు అడిగారు పేరు చెక్కుతామని అలా పేర్లు చెక్కేవాళ్లలో వృద్ధుల నుంచి యువకులదాకా, ఆఖరుకు హైస్కూలు చదువు చదివే వయసు కుర్రాళ్లు కూడా వున్నారు. నేను కాదని ముందుకు పోతోంటే, ఒక యువకుడు వెంటబడి, పేరు చెక్కుతానని పట్టుబట్టాడు. అతను కొంత విద్యావంతునిలాగే ఉన్నాడు. ఎందుకనో అతని వైఖరి చూసి నాకు సానుభూతి కలిగింది.

"ఎలా చెక్కుతావు?" అడిగాను.

రేటు గురించి అయిదు రూపాయలివ్వండి! మీ పేరు, ఊరు, జిలా పేరు చెక్కుతారు– తేదీతో సహా!" అడిగాను.

"అక్షరాలు మంచిగా చెక్కుతావా?" అడిగాను.

"ఎందుకు చెక్కనండీ ఇంగ్లీషులో కావాలో, తెలుగులో కావాలో చెప్పండి, మంచిరాయి మీద చక్కగా చెక్కుతాను. పర్మనెంటుగా ఉంటుంది. మళ్లీ మీరెప్పుడైనా వచ్చినపుడు చూసుకోవచ్చును" అన్నాడతను.

"ఇవిగో! ఇవి చూడండి నేనే చెక్కాను ఈ పేర్లు" అని అక్కడ మెట్లమీద తాను చెక్కిన పేర్లు చూపించాడు.

అక్షరాలు కుదురుగా, అందంగా వున్నాయి. నాకు ఆ చెక్కడం నచ్చింది. నా చిరునామా చెప్పి చెక్కమన్నాను.

"ఈ మెట్లమీదైతే మనుషులు నడవడం వలన తొందరగా అరిగిపోతాయి అక్షరాలు. ఈ దారి పక్కన వేరే రాళ్లమీద– బాగా కనబడే ప్రదేశంలో చెక్కుతాను" అని ఒక రాతిని చూపించి, తనపనిలో నిమగ్నమయ్యాడు ఆ యువకుడు.

ఆ ప్రక్కనే మరొక పద్నాలుగేళ్ల కుర్రాడు మరో యాత్రికుల బృందం తాలూకు పేర్లు చెక్కుతున్నాడు.

ఆ సమీపంలో ఒక వయసుపైబడిన వ్యక్తి కూర్చుని– వచ్చిపోయే యాత్రికుల్ని "అయ్యలారా! అమ్మలారా! మెట్లమీద పేర్లు చెక్కించుకోండి రాత్రిళ్లు ఈ రేవు బాటవెంట దేవతలు తిరుగుతారు. వాళ్లు తొక్కితే మీకు పుణ్యం వస్తుంది!" అంటూ చెప్తున్నాడు.

నేను ఒక రాయి మీద కూర్చుని నా పేరు చెక్కే యువకుణ్ణి అడిగాను.

"ఇలా చెక్కడం వల్ల రోజుకెంత సంపాదిస్తావు?" అని

"ఆ! ఎంతండీ? ఏదో భుక్తి కోసం సమయాన్ని బట్టి, అదృష్టాన్ని బట్టి ఉంటుంది. ఒకరోజు యాభై రావచ్చు. ఒకరోజు కేవలం అయిదు– పది మాత్రమే రావొచ్చు. ఇక్కడ ఇలా పేర్లు చెక్కేవాళ్ళం చాలా మందిమి ఉన్నాం!" అన్నాడతను.

"ఈ ఆదాయం మీ కుటుంబానికి సరిపోతుందా?"

"ఏం సరిపోతుందండీ! ఈ రోజుల్లో అన్ని వస్తువులూ హైరేట్లేనాయే?" అన్నాడు పేర్లు చెక్కించుకోమని ప్రచారం చేస్తున్న వయసు మళ్ళిన వ్యక్తి.

"అలాగా! అయితే ఇక్కడ ఇంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే వృత్తి ఇంకొటి దొరకదా?" నేను అడిగాను.

"చూడండి. మీ పేరు చెక్కే ఆ అబ్బాయి మా పెద్ద కుర్రాడు. వాడు డిగ్రీ పాసయ్యాడు. కాని ఇంతవరకు ఉద్యోగం లేదు."

'అదేం? ఇక్కడింత పెద్ద క్షేత్రం ఉంది గదా! ఇక్కడేం దొరకదా?"

"ఉద్యోగాలు కావాలంటే ఈ రోజుల్లో అంత తేలికగా దొరుకుతాయా బాబూ! డబ్బు కావాలి! వ్యాపారం చేసుకుంటానికైనా డబ్బు కావాలి! అది మా వద్ద లేదు. అందుకే అందుబాటులో ఉన్న ఈ వృత్తిలో చేరారు మా పిల్లలు అదుగో అక్కడ పేర్లు చెక్కుతున్న చిన్న కుర్రవాడు కూడా మావాడే. రెండో అబ్బాయి హైస్కూల్లో చదువుతున్నాడు" అని అతణ్ణి చూపించాడు.

"స్కూలులేని సమయంలో అన్నతో కలిసి ఈ చెక్కడం పని చేస్తుంటాడు. ఇక్కడ నేను లోగడ ఏవేవో వృత్తులు చేసి ఈ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాను. ఇప్పుడు నా శరీరంలో కూడా సత్తువ లేదు. ఈ ఇద్దరు పిల్లల కష్టం మీద నేను, నా భార్యా, ఈ కుటుంబ జీవనం. ఈ మల్లికార్జున స్వామి మీద భారం వేసి ఇలా బ్రతుకుతున్నాం!" అంటూ చేతులెత్తి శ్రీశైల స్వామికి నమస్కారం పెట్టాడు.

ఇంతలో ఆ యువకుడు నా చిరునామా చెక్కడం పూర్తి చేశాడు.

"చూడండి ఎలా వుందో" అడిగాడు.

రాతి మీద లోతుగా, స్పష్టంగా, అందంగా చెక్కబడింది నా పేరు, చిరునామా ఆ దృశ్యం చూస్తుంటే నాకు ముచ్చటనిపించింది.

"ఇలా పేర్లు చెక్కడం మీ కుటుంబ ఆచారమా?" అడిగాను.

"కాదండి జీవనోపాధి కోసం మాకందు బాటులో వున్న ఈ వృత్తి చేపట్టాం. నేను మొదట నేర్చుకున్నాను. తరువాత మా తమ్మునికి కూడా ఇందులో ట్రైనింగిచ్చాను. నాకేదన్నా స్థిరమైన ఉద్యోగం దొరికేదాకా ఈ పని తప్పదు" అన్నాడా యువకుడు ఆశ నిరాశలు కొట్టుమిట్టాడుతున్న కంఠంతో.

మహావైభవంతో తులతూగుతున్న ఆ మహాక్షేత్రంలో కూడా సామాన్యులు నిరుద్యోగులే! నా మనసు కల్లోలమైపోయింది.

"మిష్టర్ నీకు ఉద్యోగం వస్తుందన్న నమ్మక ముందా." అడిగాను.

"ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్నాయి. ఫాక్టరీలు మూతపడుతున్నాయి. చిన్న వృత్తులు, చిన్న వ్యాపారాలు మూల పడుతున్నాయి. దేశం స్వావలంబనం వైపుగాక, పరాధీనత వైపు పయనిస్తున్నది. ఈ గ్లోబలైజేషన్ యుగంలో మనం అన్నిటినీ కోల్పోతున్నాం. అంచేత సమీప భవిష్యత్తులో మాలాంటి నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయన్న నమ్మకం నాకు లేదు. మరో లాభసాటి వృత్తిమార్గం కూడా కన్పించడం లేదు. మేం శిల్పాలు చెక్కుతాం. కాని మా జీవనశిల్పాల్ని చెక్కి తీర్చి దిద్దేవాళ్లు ఎవరూ లేరు. మాకు మేం చెక్కుకున్న సగటు సజీవ శిల్పాలం మేం!" అతని భారమైన వాక్యాలు నా హృదయానికి మరీ బాధనిపించాయి.

పది రూపాయల నోటు ఆ యువకుని చేతిలో పెట్టి, మిగతా డబ్బులు అడగకుండా, అక్కడ నుండి గబగబా బయలుదేరాను. అతను వెంటబడి మిగిలిన అయిదు రూపాయల చిల్లర యిస్తానన్న తిరిగి తీసుకోకుండా..

ఈనాడు ఇలాంటి నిర్భాగ్య నిరుద్యోగులు ఈ సమాజంలో ఎక్కడ బడితే అక్కడ ఉన్నారు. వీళ్లు ఈ వ్యవస్థకి నిజంగా సజీవ శిల్పాలు!

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

## నాటి తరం వారి కథలు నేటి తరానికి
## కథల వంతెన

## శాంతివనం-ప్రశాంతి జీవరం

పంచ భేతాలకు ప్రాణభిక్ష పెట్టే
ఉమ్మడి సృష్టి పచ్చని మొక్క

ప్రకృతి అందాలను ఇలపై ఎదజల్లి
పరిఢవిల్లుతు పరితుష్టుతుని చేస్తుంది మొలక

కొమ్మలలో పుష్పించే పూలు
నింగిని తలపించే తళతళమెరిసే తారలు

వేర్లు, కాండము, కొమ్మలు చెట్టుకు అవయవాలు
పువ్వులు పిందెలు కాయలు చెట్టుకు సంతానము

చెట్టు సమస్తము జీవులకు ప్రాణాధారము
మనిషికి సర్వం సమర్పించు త్యాగశీలి

నల్లని మేఘాలకు గమ్యస్థానం పచ్చని చెట్లు
సూర్యుని వేడికి నైవేద్యమూ ఒదిగియుండును పచ్చనిమొక్క

మలయమారుతము తోడై రాగా
సుమధుర సువాసనల అభయమొసగే కల్పవృక్షము

ఇంటికి తోడై బంధమై నిలిచే స్నేహశీలి వృక్షమే
కొండ కోనల్లో అడవి పందిరై వర్షించే రైతుపక్షపాతి


మొలకలు మొక్కలై– మొక్కలు మానులై
జగతికి ప్రాణాధారము మొక్క జాతి

ప్రపంచమే బ్రతుకుతుంది వృక్షజాలంతో
అందాలు పంచుతూ అవసరాలు తీర్చుతుంది వృక్షజాతి

రాగాలను పలికించే వెదురు మొక్క
రోగాలను తొలగించే ఔషధం

మొక్కలను మనము పెంచి పోషించుదాం
మొక్కలను మనలను పెంచి బ్రతికించుతాయి.


మొక్క మనుష్యులు పరస్పరం తోడుగ ఉంటే
ప్రపంచమే శాంతివనం–మనుషులకు ప్రశాంతి జీవనం



– బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

## రక్షణ గ్రహం

అనుబంధాల దస్త్రాలు చెల్లాచెదరైపోయినా,
స్నేహ బంధాల ద్వార బంధాలు మాత్రం మూసుకుపోవు
స్నేహ సౌధానికి త్యాగమే పునాది, విశ్వాసం, సహాయం
నిస్కాపట్యం, ఆనందాలవృద్ధి, బాధలతో భాగస్వామ్యం
అందలి స్విచ్ఛాఫ్‌లేని విద్యుత్కాంతులు నిండిన గదులు
జాతి, కుల, మత, ధనిక, పేద, స్వదేవ, విదేశభేదాల
లోహకుడ్యాలను కూల్చివేస్తుంది, ప్రేమ ఆయుధంతో!
భూమధ్య రేఖలను విశ్వశాంతి వాకలుగా
మార్చివేస్తుంది, సౌభ్రాత్రరసాయనంతో
అదే "మైత్రి", ఋతువులకతీతమైన నిరంతర శారదరాత్రి!
నీతోపాటు నడుస్తుంది, నీ నీడలా!
నీ రహస్యాలనే శస్త్రాలను రక్షిస్తుంది. శమీవృక్షంలా!
నీ అవసరాలను తీరుస్తుంది,
అడక్కపోయినా వరమిచ్చే దేవతలా!
అదే "సోహం" తప్ప అహంలేని "స్నేహం"!
మిత్రుడే కదా అని దరిజేరితే
ప్రచండతాపంతో తరిమేస్తాడు, "మార్తాండుడు"!
కాని, మానవమిత్రుడు,
స్వాగతసుగంధ శీతలాన్ని వెదజల్లుతాడు,
ఆస్కార్, జ్ఞానపీఠ్ అవార్డుల జ్ఞాపికలు,
సన్మానాల, బిరుదు ప్రదానాల
ఛాయాయిత్రాలు ఎన్నో గోడలపై నుండి
నిన్ను పలకరిస్తున్నా
ఒంటరిగా గదిలో నిట్టూర్పులు విడుస్తున్న నీకు
ఓదార్పు సమీరమై వీచి
అభయస్పర్శలా నీ దేహాన్ని స్పృశిస్తుంది, "సఖ్యం"!
భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూంటే
దాని చుట్టూ పరిభ్రమించే
"రక్షణగ్రహం" "స్నేహం"!
వివిధ మతాలలో
ఎన్ని ధర్మాలున్నా "స్నేహధర్మమే"
ఆచరణీయ "ప్రథమ ధర్మం"!



– వి.ఎస్.వి. ప్రసాద్
సెల్: 8106320576
9618635227

## అగ్రిమెంట్

-అవధానుల సుధాకరరావు

1981లో వ్రాసిన కథ

అతను, ఆమె..

ఇద్దరూ 'టీనేజ్ వయసు వాళ్ళే. వెరసి–వారిద్దరూ ప్రేమికులు

ఒకరి మీదొకరికి యిష్టం బాగా పెరిగిపోయి, 'పెళ్ళి'తో తమ అనుబంధాన్ని శాశ్వతం చేసుకోవాలనుకున్నారు.

కాని, పెద్ద వాళ్ళు అంత తేలిగ్గా ఒప్పుకుంటారా? పైగా– నింగి, నేలా కడుదూరం. మన ఇద్దరి కలయిక విద్దూరం అన్న రీతిగానే, ఆ అబ్బాయి శ్రీమంతుల కుటుంబానికి చెందితే – అమ్మాయి సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది.

ఎన్నో అవాంతరాలు.. ఎన్నటికీ కలవని సమాంతర రేఖల్లాంటి ఆ రెండు కుటుంబాల మధ్య 'వియ్యం' కాదు కదా– కయ్యానికైనా వీల్లేని పరిస్థితి.

అయితే ఆ ప్రేమికులు అంత తేలిగ్గా తమ వైఫల్యాన్ని ఒప్పుకుంటారా?

మొండికెత్తారు. "పెళ్ళి లేకుంటే చావు"... ఈ రెండిట్లో మాకే దారి చూపుతారు? అంటూ తమ పెద్దలకి అల్టిమేటం ఇచ్చారు.

చివరికి పెద్దలు సరేననక తప్పలేదు.

కూతురి బలవంతం మీద, అక్కడ ఏ అవమానం ఎదురవుతుందోనని భయపడుతూనే, మధ్యవర్తిని వెంట బెట్టుకుని బయల్దేరాడు ఆడపిల్ల తండ్రి.

గొప్పింటి కోడలు గురించి కలలు కన్న అబ్బాయి జనకుడు– 'లక్షణమైన మా అబ్బాయిని అల్లుడిగా పొందాలంటే కనీసం లక్ష రూపాయల కట్నమివ్వాలి.." అని మొదటి షరతు విధించేసరికి, ఆడపిల్ల తండ్రి బేజారెత్తి, వాపసొచ్చేశాడు.

ఆ సాయంత్రం పార్కులో, అమ్మాయి చేత కసిరికొట్టబడిన అబ్బాయి దూకుడుగా, ఇంటికొచ్చేసి, తండ్రి మీద చిటపటలాడేడు. ఫలితంగా కన్యాదాత గార్కి మళ్ళీ కబురు వెళ్ళింది.

కట్న, కానుకల విషయంలో ఈ మారు చిన్న అభిప్రాయ భేదం తలెత్తింది.

ఇలా మరో రెండుసార్లు ప్రతిష్టంభన ఏర్పడి– చివరికి ప్రేమికులిద్దరూ చాలా ఘాటుగా తమ తల్లిదండ్రుల్ని బెదిరించే సరికి– వాళ్ళకి 'కళ్యాణ మస్తు' అనక తప్పలేదు.

పెళ్ళి తమ స్వగ్రామమైన 'చిట్యాల' లో జరగాలని ఆడపిల్ల తండ్రి కోరాడు.

వరుడి తండ్రి అందుకొప్పుకుంటూ– స్పెషల్ బస్సు ఏర్పాటు చేసుకొని, ఆ ఖర్చు చెరిసగం భరిద్దా మని ప్రతిపాదించాడు. ఒప్పుకున్నాడు అమ్మాయి తండ్రి.

రాత్రి ఎనిమిది గంటల ఏభై నిముషాలకు నిర్ణయించబడిన దివ్యమైన ముహూర్తంలో– నిర్విఘ్నంగా ఆ శుభకార్యం కాస్తా జరిగిపో యింది.

దంపతుల మీద అక్షింతలు వర్షం కురిసింది. జంట చూడముచ్చటగా ఉందని అందరూ మెచ్చుకున్నారు.

మిగతా కార్యక్రమాలు తాపీగా జరుగుతున్నాయి.

గంట, రెండు గంటలు గడుస్తున్నా– ఇంకా భోజనాల హడావుడే లేదు. లోపల ఆకలి విజృంభిం చేస్తోంది అందరికీ....

అబ్బాయి తండ్రి అసహనంగా– దుర్వాసుడిలా ధుమధుమ లాడుతూ వెళ్ళాడు వియ్యంకుడి' వద్దకు.

"ఏవిటయ్యా ఇది? నీకు మంచి, మర్యాదా తెలీదా? అంటూ రంకెలు లంకించుకున్నాడు.

"ఏం జరిగింది బావగారూ..?" మహా వినయంగా అడిగేడాయనగారు.

"ఏం నంగనాచివయ్యా! ఆ కళ్ల.. ఏవీ వస్తళ్లు..? భోజనాలు పెట్టించమని దేబిరించి అడగాలా?"

"అవసరం లేదు బావగారూ! అయిపో యింది. ఇక్కడే వడ్డిం చేస్తున్నారు?"

"ఏవిటి.. ఇంత చిన్న గదిలోనా?"

"అవును బావగారూ! మొత్తం ఎంత మందిమి– మీరు ముగ్గురు– వేం ముగ్గురం– అరడజను మందికి ఈ గది సరిపోదా..?" అమాయకంగా అన్నాడు.

"నాతో వరాచికాలా?? అవతల పందిట్లో ఉన్న జనం సంగతేమిటి...?" కోపంగా అన్నాడు.

"నాకు సంబంధం లేదు. చూడండి బావగారూ! మీ గొప్పతనం చాటుకోడానికి రెండు బస్సుల్నిండా ఎక్కడెక్కడి జనాన్ని పోగేసుకుతెస్తే– వాళ్ళందరికీ విందులు చెయ్యడానికి నేనేం వశిష్టుడ్ని కాను.." అంటూ జేబులోంచి ఓ కాగితం బయటకు తీసాడు.

"ఏవిటది..?"

"మీ సరదా కొద్దీ రాయించి, మీరు స్వయంగా సంతకం చేసిన అగ్రిమెంట్ పత్రం– ముహూర్తాల రోజు మీరేం అన్నారు. నేను పక్కా బిజినెస్ మనిషిని, ఖచ్చితంగా మాట ప్రకారం జరిగిపోవాలి అంతా, కావాలంటే కాయితం రాసుకో, సంతకం చేస్తా.. అన్నారు. ఒకసారి దీని చదువు కొని, ఆపైన నా మీదకు యుద్ధానికి రండి.." అంటూ కాగితం చేతిలో పెట్టాడు.

'జమీందారు'గా పిలవబడే అబ్బాయి తండ్రి ఒప్పందంలో ఉన్న ప్రకారం అమలు జరిగిన నాలుగు అంశాల్ని చూసి, తెల్లముఖం వేశాడు.

"1. అర లక్ష కట్నం, 2. స్కూటర్, 3. కలర్ టి.వి. 4.పెళ్ళి ఘనంగా– గొప్ప డెకరేషన్‌తో, ఆర్భాటంగా జరిపించడం.."

అందులో భుజనాల ప్రస్తావన ఎక్కడా లేదు మరి.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

## అహంకారం వద్దు అప్యాయతే ముద్దు

మనిషి విజ్ఞానంతో
మశూచిని మట్టుపెట్టాడు
వాక్సినో కరోనాను
కట్టడి చేశాడు (నియంత్రించాడు)
మానవాళిని పీడించే
జటిల సమస్యలను అధిగమించి
విశ్వ విజేతగా నిలిచాడు
మనిషిని వేదించే అహంకార మనే
మహమ్మారిని అడ్డుకోవడంలో
విఫలమయ్యాడు
ఎదుటివారి ఎదుగుదలను
అడ్డుకోవడం
ఇతరుల ప్రయత్నాలను
కించపరచడం హేళన చేయడం
ఇతరుల లోపాలు వెతకడం
తాము నమ్మిందే నిజమనే
భ్రమలో జీవిస్తూ
కూపస్త మండూకంలో
మునిగి తేలుతూ
మోసాలే ధ్యేయంగా
కుట్రలు కుయుక్తులే లక్ష్యంగా
తాము నమ్మిందే నిజమని
భావించే"భ్రమే"కార్యాచరణగా
తాముచేసిందే గొప్పఅని విర్రవీగే
అనాలోచిత లోకంలో విహరిస్తూ
అక్రమ మార్గాలే రాచబాటగ
గొప్ప కులం అనే అహంభావం
గొప్ప వంశంలో పుట్టామనే
అహంభావం
ధనికుల మనే అహం ప్రదర్శిస్తూ
మానవీయతను మంట కలుపుతు
అహంభావంలో "హీరోయిజం"
ఈర్ష్యాద్వేషాలలో "విలనీజం"
రాగ ద్వేషాల్లో " శాడిజం"
అభిమానంలో "క్యాస్టీజం" విడనాడాలి
ఆత్మవిశ్వాసం ఆదరణ
ఆత్మాభిమానం ఆత్మగౌరవం
ఆప్యాయత అనురాగాలు
సహనం సంయమనం
సంఘీభావం సామాజిక సమరసత
సౌభ్రాతృత్వం సౌహార్ధత
సమతా మమత సమన్వయంతో
అహంకారమనే మహమ్మారిని
మట్టుపెట్టాలి
మమత మానవీయతకు పట్టంకట్టాలి
అహంకారం వద్దు
ఆప్యాయతే ముద్దు



-నేదునూరి కనకయ్య
9440245771

## నాన్న నా దిక్సూచి

నాన్ననా బలం
నాన్న ను మించిన ప్రేమ మరొకటి లేదు
నాన్న నా దైవం
నడక నేర్పిన నాన్న!!.
నాన్న అంటే ఆకాశమంత ప్రేమ
నాన్న నాకు కొండంత అండా
ఆత్మగాళ్ళు నాన్న
అనురాగం ఆప్యాయత పంచే నాన్న!!.
కన్నవారికి మెతుకు
కన్న బిడ్డకు బతుకు
నిచ్చుటకై నాన్న పరుగు!!
కనిపించే దైవం అమ్మానాన్న
మన సంతోషమే నాన్న సంతోషం
నాన్న ప్రేమ అజరామరం
నాన్న త్యాగమూర్తి.!!



-దేవులపల్లి రమేశ్,
9963701294

## నన్ను తడిపిన వర్షమా...

నన్ను తడిపిన వర్షమా...
మన్నును తడుపు...
అన్నదాత ఎదురుచూపు
ఆవేదనను తుడుపు...
నన్ను తడిపిన వర్షమా...
ప్రతి గింజను తడుపు...
అప్పుల్లో గింజుకుంటున్న
మట్టిమనసు కష్టం తుడుపు...
నన్ను తడిపిన వర్షమా...
రైతన్నల ఆశలను తడుపు...
కష్టానికి ఫలమై కంటతడిని తుడుపు...
నన్ను తడిపిన వర్షమా...
నువ్వు మేఘపు కడుపులో ఉన్నప్పుడే
వ్యవసాయదారుడు మురిసిపోయాడు
చినుకు బిడ్డ పుడతది
నా చింతలను తీర్చుతదని...
నన్ను తడిపిన వర్షమా...
నువ్వు నేలను ముద్దాడినపుడే
కర్షకుడు హర్షపు హరివిల్లై
నేలతల్లికి సాష్టంగపడి
గింజతో ఒడినింపాడు
ఒడుపుగా పంటను కానుకిమ్మని...
నన్ను తడిపిన వర్షమా...
నువ్వు ప్రతి మనసు
మమతపు చుట్టానివి...
ప్రతి పనికి జీవాధారానివి...
నువ్వు వస్తూ ఉండూ...
సంతోషాల వసంత చినుకులతో
బ్రతుకు పువ్వులను
పచ్చగా పూయిస్తూ ఉండు...
నిన్ను గౌరవించే
నా మనసు కోరుకునేది అదే...
నన్ను తడిపిన వర్షమా...
ప్రతి హృదయాన్ని
సంతోషంతో తడుపు...
చినుకు చెక్కిలితో
వారి వెతలను తుడుపు...
నన్ను తడిపిన వర్షమా...
నా కోరిక నెరవేరుస్తావు కదూ...
ఖచ్చితంగా నెరవేరుస్తావులే
నా మనసు
నేస్తానివి కనుక....



-అభిరామ్
9704153642

## దొరికిన దొంగ

కథ

నరసింహపురంలోని రామయ్య కష్టజీవి. అతడు అడవికి వెళ్లి రోజూ ఎండిన కర్ర పుల్లలను ఏరుకొని వచ్చేవాడు. తర్వాత వాటిని అమ్మి ఆ డబ్బుతో తనకు కావాల్సిన సరుకులు కొనుక్కొని జీవనం సాగించేవాడు .

ఒకనాడు అతడు అడవిలో ఎండిన కర్రపుల్లలను ఏరుకొని మోపుగా కట్టి తీసుకొని వస్తూండగా అతనికి దారిలో శరభయ్య అను వ్యక్తి కనిపించాడు. అతడు రామయ్యను ఆపి తనకు ఆ కర్ర పుల్లలను అమ్మమని చెప్పాడు. రామయ్య వాటికి పది రూపాయలు ధర చెప్పాడు . అప్పుడు ఆ శరభయ్య దానిని ఐదు రూపాయలకే అడిగాడు. అప్పుడు రామయ్య " అయ్యా! నేను దాన్ని మోసిన కూలీ కాదు. మీరు సగం తగ్గించి అడిగితే నేను ఎలా ఇచ్చేది ?"అని రామయ్య తన నడకను తిరిగి కొనసాగించాడు. ఆ శరభయ్య వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత శేషయ్య అను మరొక వ్యక్తి ఎదురై ఆ కర్ర పుల్లలను ఎంతకు ఇస్తావని ప్రశ్నించాడు. రామయ్య శరభయ్యకు చెప్పినట్లే అతనికి పది రూపాయలు చెప్పాడు. శేషయ్య దాన్ని మూడు రూపాయలకే అడిగాడు. అప్పుడు రామయ్య " అయ్యా! నేను దీన్ని ఐదు రూపాయలకు అడిగినా ఇవ్వలేదు. ఇక మూడు రూపాయలకు ఎలా ఇస్తాను?" అని తిరిగి రామయ్య తన నడకను కొనసాగించాడు.

ఆ తర్వాత రామయ్యకు మరొక వ్యక్తి దారిలో కనబడి అడ్డగించి " ఏయ్! ఆ కట్టెలమోపు నాకు ఇస్తావా! ఈ కత్తితో చస్తావా! "అని తన దగ్గరి కత్తిని చూపించాడు. అతడు ఒక దొంగ. రామయ్య ఆ కత్తికి భయపడి ఆ కట్టెల మోపును అతనికి ఇచ్చివేశాడు. ఆ దొంగ దాన్ని తీసుకొని కొద్ది దూరం పోగానే అందులో ఉన్న ఒక తేలు అతనిని కాటు వేసింది. అతడు దాని మంటకు తాళలేక ఆ గ్రామ వైద్యుని వద్దకు పరిగెత్తుకొని వెళ్ళాడు .

ఆ వైద్యుడు కొత్తగా తన వద్దకు ఎవరు వచ్చినా గ్రామపెద్దకు సమాచారం పంపిస్తాడు. ఈ సంగతి ఆ దొంగకు తెలియదు. ఆ వైద్యుడు వెంటనే రహస్యంగా ఆ గ్రామ పెద్దకు ఎవరో నూతన వ్యక్తి వచ్చాడని సమాచారం పంపించాడు. వెంటనే ఆ గ్రామ పెద్ద తన మనుషులతో పాటు వచ్చి ఆ దొంగను పట్టుకున్నాడు. ఆ వైద్యుడు ఆ దొంగకు వైద్యం చేసి ఆ దొంగను ఆ తేలు ఎలా కాటు వేసిందని ప్రశ్నించాడు. ఆ దొంగ తాను రామయ్య కర్ర పుల్లల మోపును బెదిరించి తీసుకొని పోగా అందులో ఉన్న ఒక తేలు తనను కాటు వేసిందని చెప్పాడు.

తర్వాత గ్రామ పెద్ద రామయ్యను బయటకు పిలిచి అతనితో " ఈ గజదొంగను నీవే పట్టించావు. నీవు ఈ కర్ర పుల్లల మోపును ఆ దొంగకు ఇవ్వకుంటే ఆ తేలు అతనిని కుట్టేది కాదు అతడు ఇక్కడికి వచ్చి దొరికేవాడు కాదు" అని అతనికి బహుమానం ఇవ్వబోయాడు . రామయ్య తనకు అది వద్దని వారించి ఆ డబ్బును తమ గ్రామాభివృద్ధికి వినియోగించమని చెప్పాడు . తర్వాత అతడు గ్రామపెద్దతో " అయ్యా! మన్నించాలి. నాకు సోమరితనంతో కూర్చుండి తినడం అలవాటయితే నా ఆరోగ్యం పాడవుతుంది " అని అన్నాడు . అప్పుడు గ్రామ పెద్ద ఊరివారి సలహాతో అతనికి ఇల్లు లేదని తెలిసి ఒక ఇల్లు కట్టించడానికి నిర్ణయించాడు . రామయ్య ఎంతో సంతోషించాడు.

ఆ తర్వాత రామయ్య ఆ వైద్యుని వద్దకు వెళ్లి " ఆ దొంగ మంట తగ్గిందా! అతని ఆరోగ్యం బాగయిందా "అని ప్రశ్నించాడు. ఆ మాటలు అక్కడనే ఉండి విన్న ఆ దొంగ కన్నీళ్ళతో అతని మంచి మనసుకు చేతులు జోడించాడు. రామయ్య మాటలు విన్న ఆ దొంగ ఆ రోజు నుండి తన దొంగతనాన్ని మాని కష్టపడి పని చేసుకుని బ్రతుకుతూ జీవనం సాగించాడు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

పుస్తక సమీక్ష

## నాన్నకు సమగ్ర రూపకల్పన ఈ నాన్న నానీలు

నానీలు అనగానే వాటి సృష్టికర్త మన గోపీసారు గుర్తొస్తారు. ఆయన చూపిన దారిలో ఎందరో కవులు తమ రచనలను వండించుకున్నారు. అలాంటి వారిలో మన వెన్నెల సత్యంగారొకరు. వీరు గతంలో నానీల వెన్నెల, ప్రేమనానీలు, అమ్మ నానీలు రాసారు. ఇప్పుడు నాన్న నానీలు రాసి, లోకాన్ని నడిపిస్తున్న నాన్నలందరికీ అంకితమిచ్చారు. ఆస్తులు పిల్లలకొచ్చి ఆస్తికుల్ని చేశాడు, నాన్న చివరికి నాస్తికుడు అంటూ ప్రారంభించడంలోనే నాన్న అనగానే ఆస్తుల పంపకం అన్న నేటి సమాజం పోకడకు అద్దంపట్టారు. కొండల్ని పిండి చేసి తమ పిల్లల్ని పైకితెచ్చి, నేడేమో ఆశ్రమంలో గడపాల్సి వచ్చిందనే ఒక నిజాన్ని గుండెల్ని పిండేస్తూ వివరించారు. సత్యంగారి నానీలు ఎంతో లోతుగా ఆలోచింపజేసే విధంగా వున్నాయి. **ఆస్తుల్నే కాదు హృదయమూ రాసిచ్చాడు, నాన్న ఇప్పుడు గుండె లేని మనిషి, బంగారు బాల్యం నాన్న ఇచ్చిందే- పీడకలల వృద్ధాప్యం పిల్లలు తెచ్చింది** అంటూ కుటుంబం లో వుండాల్సిన ఆప్యాయతా అనురాగాలనూ చెప్పకనే చెప్పుకొచ్చారు. చాలా మంది పిల్లలు నాన్నకు తిక్క లెక్కలేనంత అనుకుంటారట, కానీ తాను నాన్నయ్యాకే లెక్క తెలుస్తుందట. కొన్ని కొన్ని నానీలు



ప్రతులకు:
వెన్నెల సత్యం,
తిరుమల మెగా టౌన్షిప్,
షాద్‌నగర్– 500 010

చదువుతుంటే ఎవ్వరికైనా తమ బాల్యం గుర్తుకు రాకపోదు. నాన్న భుజాలమీద ఎక్కి తిరగడం, గుర్రమెక్కడం, సైకిలు నేర్పించడం వంటివి ఒక్కసారి గుర్తొచ్చి మనసు పిండివేస్తుంది. త్యాగ మంటే ఏమిటని అడిగితే తాను నాన్న ఫోటోను గర్వంగా చూపించా డట. ఆ సూర్యుడి విధి పన్నెండు గంటలే అయితే, నాన్న డ్యూటీ ఇరవై నాలుగు గంటలు అంటాడు. తిట్లన్నీ దీవెనలని ఇప్పుడర్థ మైందట, కానీ తిట్టడానికి నాన్న లేడుగా అన్న నానీ చదువుతుంటే గుండె తరుక్కుపోతుంది. అంత బ్రహ్మాండంగా నాన్న గురించిన 107 నానీలను అందించిన వెన్నెల సత్యం నిజమైన పుత్రరత్నం అనిపించాడు. సత్యాన్ని కన్న తల్లిదండ్రులు ధన్యులు. **నాన్న అమ్మకు తోడట, కొడుక్కి మీగడట, కూతురుకి వెన్నట. ఇలా అని చివర్లో నాన్న బహు ప్రేమే** అంటాడు. కొన్ని కొన్ని నానీలు గుండెలను పిండేస్తాయి. అంత బాగా నాన్నను అర్థం చేసుకున్నాడు మన సత్యం. **నాన్న మాయలోడట, తన కన్నీళ్ళను ఆనంద భాష్పాలుగా మార్చేస్తాడట మరి.** మానసికంగా వృద్ధాప్యంలో ఎంతటి ఆవేదనకు గురి చేస్తున్నారో కూడా ఈ నానీల్లో అక్కడక్కడా చురకలు కూడా తగిలించారు. బంగారు బాల్యం నాన్న ఇచ్చిందే, పీడకలల వృద్ధాప్యం పిల్లలు తెచ్చింది అంటారు.

సత్యంగారి నానీల రచనా మాధుర్యం ఒక ఎత్తు అయితే, మరో ప్రక్కన ప్రతి పేజీలోనూ లైన్ డ్రాయింగ్స్ ఎంత బాగున్నాయో. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించాయి. అంత బాగున్నాయి సుమా! మన జీవితం కనిపించింది ఈ పుస్తకంలో.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

## విద్యా వికాసం

నేను విద్యను...
భూత వర్తమాన భవిష్యత్తులో
విజ్ఞాన వెలుగు బాటను...
మీతో కలిసి..మీలో నిలిచి
హృదయాన్ని తట్టి..మనసును మీటి..
వికాసంతో విషయాన్ని అందించగలను...
మీతో సాగిపోయే మీజీవితశకటాన్ని!!
అన్ని సమస్యలకు పరిష్కార ప్రవాహాన్ని!!...
ఆద్యంతాలు లేని ఆత్మజ్ఞానాన్ని!!...
నిత్యం అంతరాత్మను వెలిగిస్తుంటాను..
విశ్వానికి విషయసూచికనై ఉంటాను!!
నేను విద్యను...విజ్ఞాన సౌదామినిని...
అంధకారాన్ని తరుముతా!!
వెలుగు రేఖనై ఉంటా!!...
నేను కారణచరితుణ్ణి..కాఠిన్యం లేదు
నాలో ఎన్నెన్నో పార్శ్వాలున్నాయి...
అన్ని కూడా మీ కొరకే...
తెలుసుకొని అర్థం చేసుకుంటే
నాలోని తేజస్సు ఉషోదయమై
విశ్వాసాన్ని నింపుతుంది...
సృష్టిలో విశాల విశ్వాన్ని
సృష్టించే అక్షర విశ్వంబరాన్ని..లక్షల మేధస్సును
నావల్లనే మనిషి లేచి
నిలబడుతు న్నాడు..
ఆకాశాన్ని అవలీలగా అందుకుంటున్నాడు...
ఊహించని ఎత్తులో
ఊహకందని వెలుగులో ఉన్నాడు..
నేను ఆదిని..అనంత శక్తి ప్రదాయినిని..
అందరిలో వికసించిన తేజస్సుతో
నిబిడీకృతమై ఉంటాను..
నాలోని ఒకొక్క పార్శ్వం
ఒకొక్క శక్తి రూపం...
అందరూ నా ఆధీనంలోనే ఉంటారు...
నావెంట పరుగెత్తే వాళ్ళకు విజయమే..
మీలోని యుక్తికి ప్రతిరూపాన్ని...
నన్ను మించిన శక్తి లేదు..సమగ్రతలేదు
నేనో అంతర్యామిని..
ఓ జ్ఞాన ఋషిని...
తలుచుకొని కొలుచుకున్నవారికి ఉండదు లోటు...
విస్తరించిన నా అస్తిత్వాన్ని నిలుపుకొండి...
మీ వ్యక్తిత్వం వృద్ధి చేసుకోండి..
అస్తమించని ఆదిత్య హృదయాన్ని...
నేను మాములు వ్యక్తిని కాను..
ఎవరూ ఊహించని గుప్తధనాన్ని..
నేను విద్యను..వివేకవంతుడను..
సమస్తానికి మహా జీవశక్తి
శీలుడనై ఉంటాను..
కాలం గమనంలో కలిసిపోను..
అన్ని శక్తులను అధికమించి నిలబడగలను...

నిత్య అన్వేషిణిని..మానవ
మనుగడకు ఉచ్ఛ్వాస నిశ్వాసను..
నేను మీ ఆధారభూతాన్ని..
ఆలోచన తంత్రిని...
మనసుకు బుద్ధిని..
లెక్కలు కట్టలేని లోక జ్ఞానాన్ని..
ఓ సంక్లిష్ట జీవన పరిణామాన్ని..
ఓ సృజనాత్మక వికాస రూపాన్ని..
మీ ఔన్నత్యానికి ఆద్యుణ్ణి...
జ్ఞాన దృఢత్వానికి వారధిని..
సంకల్ప బలానికి రథసారధిని..
సృజనశీలుణ్ణి..సువిశాల హృదయాన్ని
సుత్రదారుణ్ణి..పాత్రధారుణ్ణి
కీర్తి కిరీటాణ్ణి..
మీ ఉన్నతికి ఔన్నత్యాన్ని...



-అంబటి నారాయణ
9849326801

## ఓ మనిషీ తడిమి చూడు

ఆకర్షించడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు మరెన్నో జిమ్మిక్కులు...
చరవాణుల్లో ముంచడానికి ఎన్నో గమ్మత్తులు....
ఎన్నెన్నో యాపులతో చరవాణుల ఆకర్షణల మాయ...
అర చేతిలో ఇమిడిపోయి ఆడిస్తోంది మనిషిని మటన్ పాయ..
దైనందిన జీవిత మాధుర్యాన్ని చేదెక్కిస్తూ.....
బ్రతుకు లోని ఆనందాలను చంపేస్తూ....
నిద్రను దూరం చేసి, మూసిన కన్నుల్లో కలలను రానీకుండా..
కాలమంతా చేస్తోంది నెట్టింట్లోనే గడిపేలా...
విజ్ఞాన భాండమైన పుస్తకాన్ని బరువు చేసి, పఠనాన్నే కఠినం చేస్తోంది...
సులువైన ఆలోచనను చంపేస్తూ చేస్తోంది తన మీదే ఆధారపడేలా....
తాతయ్య చెప్పే చందమామ కథలను కాశీకి వెళ్ళకొట్టింది..
అమ్మమ్మ చేసిన రోటి పచ్చడి చేదెక్కించింది....
ఒక్క లైకు కోసం పడిగాపులు రోజంతా
నిమిషం కేటాయించలేని తనం బంధువులకై....
ఆనందాలు, విషాదాలు అరనిమిషం చూసే స్టేటస్ లోకి వెళ్ళాయి..
సానుభూతులు, శుభాకాంక్షలు మారాయి యాంత్రికంగా....
పసివారు సైతం చరవాణిలో బొమ్మలు చూస్తేనే అన్నం తినే పరిస్థితి....
జుగుప్సాకరమైన చిత్రాలు,
అశ్లీలం నిర్వీర్యం చేస్తున్నది యువతను అంతర్జాలం...
మనిషిని ఆడిస్తున్నది వేలితో మాయాజాలం...
వంటలన్నీ అటకలెక్కి జొమాటోలు టొమాటోలా రుచిని పంచుతున్నాయి....
ఓ మనిషీ! దూరం చేసుకో చరవాణులను, హత్తుకో హృదయానికి పుస్తకాన్ని....
తడిమి చూడు ఒక్కసారి లోకాన్ని చూపిస్తుంది...
అక్షరాన్ని తాకి చూడు కళ్ళతో జ్ఞానాన్ని పెంచుతుంది....
పేర్చి చూడు వాక్యాలను వేలితో
నిలుపుతుంది మనిషిలా నిన్ను....

-మధు మురళి,

## విశ్వమంతటికీ తెలుసు

అసమానతల సమాజంలో
పరిష్కారాలు అసంపూర్ణమేనని
స్పష్టం చేస్తూనే ఉన్నా
అణచివేతల నుంచి బయటపడి
పై మెట్టు చేరేందుకు
కార్మికుల సంఘటిత పోరాటానికి
వేదిక మేమేనని
విశ్వమంతటికీ తెలుసు!!.
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం
ప్రైవేటీకరణ వేగవంతం
వినియోగ సంస్కృతి విశ్వరూపంతో
మా జీవన శకటం దారి తప్పినా
సమిధయైనా
ప్రజాస్వామ్య సమాధిపై
ప్రమిదలమని
విశ్వమంతటికీ తెలుసు!!.
ఆకలిపోరాటంలో
సుఖ దుఃఖాల భ్రాంతిలో
అందని ఆశలకు
అలుపెరగని
ఆలోచనలకు మధ్య సాగే
జీవన గమనంలో
ప్రమాదం అంచున శ్రమిస్తున్న
శ్రామిక శక్తిని చాటే
నినాదం మేమేనని
విశ్వమంతటికీ తెలుసు!!.
జీవితాన్ని అందంగా
మలుచుకోవడం
ఎప్పటికైనా
సుసాధ్యమనే భరోసాతో
నలిగిన బాటనే అనుసరించే
చీకటి లోకపు
తూరుపు సూర్యుళ్ళం మేమేనని
విశ్వమంతటికీ తెలుసు!!.
మా జీవితాల్లో ఎదురైన
ఒడి దుడుకులను
ధైర్యంగా ఎదుర్కొని
నలుగురికీ విభిన్నంగా ఆలోచించే
అరుదైన ప్రత్యేకతను అందిపుచ్చుకొని
కార్మికుల వెలుగు దివ్వె సాక్షిగా
అరుణ పతాకం ఎగిరి
అరుణ కిరణం ఉదయించి
ఉద్యమ స్వప్నం
సాకారం చేసుకోవటమే
మా గమనమని
విశ్వమంతటికీ తెలుసు!!

– నలిగల రాధికారత్న





## శ్రమైక జీవనం

శ్రమ
ప్రయత్న ఫలితం!
నాణ్యత అద్భుతం!
విభిన్నవ్యవస్థల సంగమం!
ఉత్పత్తి సృజనాత్మకం!
శ్రామిక శక్తి తిరుగులేనిదని చాటేద్దాం!.
ఒక సంస్థ శ్రమ శక్తి ఎక్కువైతే
కార్మిక శక్తి గుణాత్మకం
శ్రమ ఉత్పాదకతే కారణం
ప్రతి శ్రమ ఉత్పత్తి ఒకే విధంగా!.
శ్రామిక శక్తి ఉత్పాదకత!
ఆర్థిక, సంస్థాగత!
వ్యక్తి, సంబంధిత!
రంగాలకు చేసే సమర్థత!
అత్యాధునిక సాంకేతికత!
అనేక రకాల నిబద్ధత!.
సమయం నిర్వహణ పద్ధతులు!
నైపుణ్యాభివృద్ధి శిక్షణలు!
కమ్యూనికేషన్ సహకారాలు!
పనితీరు కొలమానాలు!
అవే లక్ష్యాలదిశకు పయనాలు!
ఇవే సంస్థలకు
కీలక సవాళ్లు!.

-యలమర్తి మంజుల



## శ్రమజీవన పయనంలో

రైతుకు నిర్వచనం కృషిలో ఋషి!
అన్నదాతగా
నూతన వంగడాలను సృజించే శేముషి!
పంట పొలాల పైరగాలులకు
మాత్రమే అవుతాడు ఖుషీ!.
ఎముకల ను కప్పేచర్మం తో శ్రమ!
ఫలసాయం కోసం పడే భ్రమ!
నిత్యం ఆకాశ గంగ కై ఆశావాదపు ధీమా!.
ఒక కమ్మరి యోగా లో
ఉచ్ఛ్వాస నిశ్వాసాల ప్రణవం!
కొలిమి తిత్తి శబ్దానికి
గుండె తిత్తి లబ్ డబ్ కు
తేడా లేని నిరంతర ప్రయాణం!
లోహాన్నీమనిషినీ వంచే తాత్త్విక హోమం
పుత్తడికీ ఇత్తడికీ
తళుకుల సొగసులద్దే స్వర్ణయుగ పంట!
ఎన్ని పేగుల మెలికలో
ఈ కలిలో మెలి తిరిగిన ఆకలి దారి!
చిలుకలు,నెమళ్ళు విహరించి
వెలిగిన పడుగూ పేకల జలతారు వనంలో
ఎన్నిపోగుల పీలికలో మీదరి!.
శ్రామిక పోరాట చిహ్న మైన ఈ కోక !
మన సంస్కృతీ సౌరభాల పతాక!
మనసుతోకట్టుకు చూడొకసారి ధర చూసుకోక!
అదే శ్రమకు మీరు ఇచ్చే కానుక!.
మట్టిని నమ్మి
మట్టిని తొక్కి
తీర్చిన అందాల కుండలు!
మమకారాల చల్లని గుండెలు!
వివాహానికి అరివేణి అందలు!
గొంతు తడిపిన హిమభాండాలు!
కొని బతికిస్తే కైదండలు!.
కొండలు పిండిని చేయగల
అద్భుత శ్రామిక దండులు !
బండరాతి మనసులను
పైపైకి ఎగురవేసిన మార్తాండులు!.
ఇది శ్రామిక శక్తి ఉజ్వల స్ఫూర్తి!
ఇదే శ్రామికశక్తి జగతికి కీర్తి!
కడుపులు నిండకున్నా కనికరమే ఆర్తి!
శ్రామిక జనుల శ్రమకు
మూల్యంతో చేయలేరు భర్తీ!
ఏ దేశపు పవరైనా శ్రామికులే!
ఏజెండా పొగరైనా శ్రామికులే!
ఏ సిరిసంపదల వెనకైనా శ్రామికులే!
ఏ అద్భుత ఆవిష్కరణల కొలువైనా శ్రామికులే!
శ్రామికులు శ్రమపూలబాంబులు!
జాతి తీర్చ లేదు వారి ఋణాలు!
పొట్టకొట్టి వారిపై చేయొద్దు
అమానుష దారుణాలు!
శ్రామికశక్తి ప్రతి దేశపు బలం!
వారి చేతిలో వుంది ప్రతి వారికి
అన్నంపెట్టే హలం!
విప్లవాలు ఎక్కడైనా
యంత్రాలకు మంత్రాలు నేర్పి
పరిగెత్తించే తంత్రాలు,తంత్రులు వీరే!
దేశ పురోగతి రథానికి సారథులు వీరే!.

– డా॥బి.హెచ్. వి.రమాదేవి





## శ్రమజీవుల జీవితాలు

హాలంపట్టి
పొలం దున్ని
చెమటంతా ధారపోసి
గింజ గింజను పండిస్తే
ప్రాణి కోటికి
తిండి పెడుతూ
పస్తులుంటాం మేమంతా
అన్నదాతలంటారు మమ్మంతా
భూస్వాముల చేతుల్లో
దగాపడతాం మేమంతా.
దేశ రక్షణ ధ్యేయంగా
ప్రాణాలను ధారపోసి
కన్నవారిని, ఉన్నవారిని వదిలిపెట్టి
కునుకు లేక కాపు కాసి
కంటి మీద కునుకులేక
చావునైనా లేక్క చేయక
రొమ్ము విరిసే దమ్ములున్న
శ్రామికులం మేమంతా
కొండలనే పిండి చేసి
నెత్తురంతా ధారపోసి
ప్రాజెక్టులు నిర్మిస్తే
దొరబాబుల చేతుల్లో
మోసపోతాం మేమంతా
ఫ్యాక్టరీ ల ఉత్పత్తుల
శక్తి నంత ధార పోస్తే
లాభాల బాటలల్ల
బడాసాబులు నడుస్తుంద్రు
బానిసల బతుకులే
బతికేము మేమంతా
శ్రమజీవుల జీవితాలు
ఇంతే కదా బతుకంతా!.

-కొమ్ము వరలక్ష్మి



## శ్రామికుడు

పగలనక
రేయనక
శ్రమను నమ్ముకున్న
శ్రామికుడా! నీకు జోహార్లు!
సూర్యోదయానికి
బాటసారులకు
పూలబాటలో
స్వాగతం పలుకుతారు
శ్రామికులే కదా
అవనిని అన్నపూర్ణగా మారుస్తారు!
శ్రామికులకు వందనం అభివందనం
పనిముట్లే వారికి ఆభరణం
నిరంతరం సగటు మనిషి పయనం
పని కోసం ఎదురుచూపులు
వారి జీవితాల్లో
వెలిగే దీపాలు
వారి ధ్యేయం
పరిశ్రమ అంటేనే
శ్రామికుడి దేవాలయం
వెలకట్టలేని ధనం
శ్రామికుడి జీవితం
శ్రామికుడే సార్వభౌముడు
శ్రామికుడే ఘనుడు .

– రజని కులకర్ణి

## శ్రమైక జీవనమేవరం


శ్రమే లేకుంటే
ఆకలి కరకర ఎక్కడిది?
శ్రమే చేయకుంటే
ఆకలికి బువ్వ ఎక్కడిది?
శ్రమే చేయలేకుంటే ఆత్మకు
సంతృప్తి ఎక్కడిది?
శ్రమే లేకుంటే
కార్మిక కర్షక
సంబంధం ఎన్నటిది?
శ్రమ అనుకుంటే
దేవుడి సృష్టి వుండేదా?
శ్రమ అనుకుంటే
మానవ ఆవిష్కరణలుండవుగా!
శ్రమ అనుకుంటే
విజ్ఞాన పరంపరలుంటాయా?
శ్రమ లేకుంటే
గ్రహాలపై విజయాలుంటాయా?
శ్రమే లేకుంటే
ఆకలికి రుచి వుండదుగా!
శ్రమే లేకుంటే అన్నం
శక్తిగా మారదుగా!
శ్రమైక జీవికి తిన్నదే శక్తి
శ్రమే లేని జీవికి తినుటకేది శక్తి
అమ్మ శ్రమే
కుటుంబానికి రక్ష
నాన్న శ్రమే
వంశానికి శ్రీ రామ రక్ష
పుట్టిన శిశువు
ఏడ్చేందుకే చేస్తుంది శ్రమ
గిట్టే వరకు నిరంతర శ్రమ
శ్రమలక్ష్మి మారుస్తుంది
ధనలక్ష్ములుగా
శ్రమతో శారదాంబ చేస్తుంది
విజ్ఞాన ఖనులుగా
శ్రమ శక్తి ఉపయోగిస్తే
శక్తి యుతులు
శ్రమైక వరపుత్రులుగా
అందుకై జీవించు
ప్రతి దినం శ్రమిస్తూ
అప్పుడే నీకు నాకు
ప్రతి దినం శ్రమదినం.

-ప్రశాంతి రేవూరి



# సప్తపది

సృజనకర్త : సుధామ
జీవిత సత్యాల ఆవిష్కరణం-సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం
లఘు కవితా ప్రక్రియ
హితవరి విహారి,శాంతమూర్తి గార్ల నిర్వహణలో
వివిధ కవుల సప్తపదులు




మానవత్వం
ప్రేమతత్వం
ఇదే మనుజుని మహనీయునిగా
చేసే నిత్యసత్యం!
-సి. హెచ్.బృందావన రావు
నెల్లూరు

కవనం
దవనం
మంచి కవిత్వమంటే వీచే పరిమళాల పవనం
-డా.పి.వి.రామ కుమార్
గుంటూరు

వీడు
వాడు
ఓటుని సరైన వ్యక్తికి వెయ్యాలి చూడు .!
-డా జి భవానీ కృష్ణ మూర్తి
హైదరాబాదు

కలలు
అలలు
జమిలిగా జీవితనావకు
లంగరు-మిలమిలల వలలు
-సి.యస్.రాంబాబు
హైదరాబాద్

ఎక్కువ
తక్కువ
అంటూ బేరీజు వేసుకోడమే కొందరికి మక్కువ.
-అల్లంరాజు రాధాకుమార్ (రాధాయి).
హైదరాబాద్.

చిరునవ్వు
ఎలనవ్వు
అందం, ఆరోగ్యం కావాలంటే కలకల నవ్వు
-మాధవి మేళ్ళచెర్వు
గుంటూరు

నష్టాలు
కష్టాలు
వచ్చినప్పుడు ఓర్పుతో మెలిగితేనే
పొందగలము అభీష్టాలు.
-రావూరి నరేశ్, సఖినేటిపల్లి.

అనుకూలత
ప్రతికూలత
అనుకున్న పనులు సరిగా జరగకపోతే వ్యాకులత!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్.

యోగం
భోగం
భక్తిమార్గాన ముక్తిసాధనకు చివరకు సర్వం త్యాగం!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ
హైదరాబాద్.

క్షమ
శ్రమ
నిరంతరం కొనసాగిస్తే తప్పక వరిస్తుంది రమ.
-లలితావర్మ, హైదరాబాద్.

తెరువు
పరువు
శిష్యుని చేయిపట్టి వెలుతురులోకి తీసుకెళ్ళు
గురువు
-విత్తనాల విజయ కుమార్, హైదరాబాదు

జ్ఞానం
విజ్ఞానం
పక్కన తొంగుంటే అధికారం ఎలుతుంది
అజ్ఞానం
-పట్నం శేషాద్రి, హైదరాబాద్

మానవత్వం
మాధవత్వం
వదిలేస్తే నీకు ఇక మిగిలేది సంకుచితత్వం
-యలమర్తి అనూరాధ
హైదరాబాద్

హద్దురా
ముద్దురా
కుల మతాల కుంపటిలో శలభాలు కావద్దురా
-గండె శోభారాణి చందానగర్,హైదరాబాదు

అర్థం
పరమార్థం
అక్షరాల్లో 'సప్తపది' చూపుతోంది జీవన
యథార్థం.
-డోల రాజేశ్వర రావు, పలాస.

రాదు
కాదు
అనబోకు నా దగ్గర ఏమీ లేదు..
-డా.మరుదాడు అహల్యా దేవి
హైదరాబాద్

సమాచారం
నిజాన్ని దాయటం,
అబద్దాన్ని మోయటం అపచారం!
-ఆచంటి శ్రీనివాసరావు
తెనాలి.

ఊసులు
కాసులు
నాయకులకు వినోదం – ప్రసంగాలలో
హామీల రాసులు
-అభిషేక్, హైదరాబాద్

నాయకుడు
ప్రతినాయకుడు
రెండు పాత్రలు పోషించగల
నేటి ప్రజానాయకుడు
YLNV ప్రసాద్ రావు,
-విజయనగరం.

సమస్తం !
తటస్థం !!
ఆలోచించి ఓటు వేయకపోతే తప్పదిక
అస్తవ్యస్తం!!!
-నేమాన సుభాష్ చంద్ర బోస్, విశాఖపట్నం

నలుపు
తెలుపు
వర్ణాలు పట్టుకుని వేలాడితే రాదు గెలుపు..
-పంతుల లలిత-నీలాంజన
విశాఖపట్నం

జడత్వం
చేతనత్వం
సుఖదుఃఖాల మేళవింపులో జీవితాన కూడనిది
విముఖత్వం
-డాక్టర్ వరలక్ష్మి హరవే, బెంగుళూరు

కష్టకాలం
నష్టకాలం
సహనంతో ధైర్యంగా ఎదుర్కుంటే
వుండవు కలకాలం
-శాంతమూర్తి, హైదరాబాద్

జనులు
పనులు
కాలు బయటపెడితే కాలుష్యం, రణగొణ ధ్వనులు
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాదు

ఎదగనిద్దాం
ఒదగనిద్దాం
ఆడపిల్లకు అండగా ఉంటూ స్వేచ్ఛగా
బ్రతకనిద్దాం.
-సాధన.తేరాల, ఖమ్మం.

ఆస్తులు
అంతస్తులు
ఇవేవి శాశ్వతం కాదన్నా నమ్మరు చాదస్తులు
-బోర భారతీదేవి, విశాఖపట్నం

దూరవాణి
చరవాణి
మిత్రుత్వానికి మానవబంధాలకు వాక్కు
సరిచేసుకొవాలనే అమృతవాణి
-అచార్య వై వి సుబ్రహ్మణ్యం
హైదరాబాద్

## జర జాగ్రత్త నరులతో..!

నరం లేని నర నాలుకతో జాగ్రత్త..
నమ్మితే నట్టేట మునిగి పోతవ్ !
జీవన నిచ్చెన ఎక్కేటప్పుడు..
వెనక్కి లాగే నరులున్నారు జాగ్రత్త !
చుట్టు నరగుంటనక్కలున్నాయి..
వెన్నుపోటు పొడవచ్చు బహుపరాక్ !
వీధికుక్కల కరిస్తే బొడ్డు మందుంది..
నర నరక దృష్టికి ఔషధాలే కరువు !
జీవన నౌకలో పయనం జరపదిలం..
ఎవరైనా నావకు చిల్లులు పెట్టొచ్చు !
తేనె పూసిన కరుకైన నరకత్తులు..
ఏ రూపంలో రక్తం రుచి చూస్తాయో !
నరరూపంలో ఘోర అసురసేనలు
నైతికతకు లేదెపుడు తావులు !
నువ్వు నడిచే రహదారి వెంట..
మనుషులున్నారు జర జాగ్రత్త !
చేతులు కలిపితే జర భద్రం..
ఏ హస్తంలో ఏ కాలసర్పముందో !
విశ్వాసానికి ప్రతీకలు శునకాలు
నరకానికి నకలు నరపుంగవులు !
కారడవిలో దారి తప్పినపుడు..
గొర్రెల్ని గుడ్డిగా నమ్మొచ్చు నేస్తం..
జనారణ్యంలో క్రూర మృగాలున్నాయి !
ధనలక్ష్మి నీ తలుపు తట్టినపుడు..
నర గుంటనక్కలతో జర పదిలం !
మనిషిలో ఇసుమంతైనా దొరకదు..
మచ్చలేని మానవీయ విలువలు !

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



## కనులు మాట్లాడుతాయి!

కనులు చూడడమే కాదు మాట్లాడుతాయి
చూసే చూపులు చేసే భాసలు అన్నీ
కను సన్నలలోనే!
ఈ జగతి ఒక దర్శనాలయము
అందులో ఎన్నో ఎన్నెన్నో చూపులు
ఏ కటాక్షానికో చూపుల ఎదురుచూపులు
చూపులకు ఓ భాష ఓ భావం ఉంటుంది
సైగలు, ఓరచూపులు, వంకర చూపులు
దొంగ చూపులు,నేల చూపులు
అవి చూసే కనులకే తెలుస్తుంది
కనులు సుఖదుఃఖాలకు స్పందిస్తాయి
కన్నీళ్లు ఆనంద భాష్పాలు మనిషిని
ఓదార్చుతాయి
కనులు వర్షిస్తే సముద్రాలు సరిపోవు!
కనులు హర్షిస్తే విశ్వమంతా హర్షమే!
కనులు దొంగను దొరను ఇట్టే పట్టేస్తాయి
ఏ దృష్టి పడితే ఏమవుతుందో జాగ్రత్త!
కౌశికుని కొరకొర చూపులు కొంగను
కాల్చలేదా!
శివుని ఉగ్రనేత్రం మన్మధుడిని
భస్మం చేయలేదా!
చూసే కన్నుల తీరు తెన్నులు
ఈ జగతి వికాసానికి వెన్ను దన్నులు
కథలు, కావ్యాలు, కవితలుగా
(కవి) కనులు కలలు కంటాయి
మాట్లాడుతాయి

-పి.బక్కారెడ్డి
9705315250



## అమ్మా నన్నెందుకు కన్నావ్!

అమ్మా నన్ను ఆడ పిల్లగా ఎందుకు పుట్టించావ్?.
నేను నీ కడుపులో పడ్డది మొదలు......
పెరిగి పెద్దయ్యే వరకు అడుగడునా వివక్షే....!
అమ్మా నేను నీ కడుపులో నలుసుగా ఉన్నప్పుడే
నన్ను కరగ దీయాలని అనుకున్నారటగా.....
ఎందుకమ్మా ఆడ పిల్లపై ఇన్ని ఆంక్షలు,
ఇంత వివక్ష
ఏదో ఓలా నీ కడుపులోంచి బయట పడ్డాక
తెలిసిందమ్మా కడుపులోనే కరిగిపోయినా
బావుండునని...
ఏం చెప్పాలమ్మా
పెరిగినకొద్ది పెను తుపానులే
ఎదురవుతున్నాయని....
ఏం చెప్పాలమ్మా
మృగాళ్ల చూపులే
సుర కత్తుల్లా గుచ్చుకుంటున్నాయని...
నలుగురిలో నవ్వితే తప్పు....
మాట్లాడితే తప్పు.... ఎందుకమ్మా ఆడదానికి
తెర ముందు పెద్ద పెద్ద బిరుదులిచ్చి
తెర వెనుక తెగ నరకడాలు..
ఎంత చదివినా
ఎంత పెద్ద హోదాలో ఉన్నా
ఈ పురుష పుంగవుల వెకిలి చూపులు,
వెటకారాలు...
వేదికలపై ఆడది ఆది శక్తి అంటారు,
ఆడదే ఆదారమంటారు..
వేదిక దిగాక ఆడది ఆట బొమ్మ అంటారు..
నడి వీధిలో నగ్నంగా ఊరేగిస్తారు...
ముక్కలు ముక్కలుగా నరికి బావులు,
చెరువుల్లో పడేస్తారు...
ఇందుకా అమ్మ నన్ను కన్నది..
లేదమ్మా..
నేను కనబోయే బిడ్డ నీలా నాలా కాదు..
అదోలా చూసే కళ్ళను చితక పొడిచేదిగా...
నవ్వే నోళ్ళలో ఉమ్మేసేదిగా..
చెరిచే చేతులను తెగ్గోసేదిగా...
నగ్నంగా ఊరేగించిన వాళ్ళను
అడ్డంగా నరికేదిగా అక్క జ్యోతి,
నిర్మల స్నేహ లత,
స్వర్ణక్కలను
తయారు చేస్తానమ్మా....!!

-శ్రీరాం దానబోయిన,

ఎన్నో యేళ్లుగా
పాదానికెంత ఓపికో
దూదిలాంటి దేహాన్ని
సన్నటి ఎముకల గూడుపై పరచుకొని
నిలబడి స్వారీ చేసే
భారమైన శరీరాన్ని బాధ్యతతో మోయడానికి
పాదానికెంత తాపత్రయమో...?
తప్పటడుగులు పడితే
బతుకు తప్పుతుందనుకునే పాదంలో
ఆవిరైపోని ఆందోళనలెన్నో
వెతలు విచ్చుకత్తులవుతున్నా
సౌహార్ద్ర నిండిన మౌనిలా
అలుపెరగక సాగే పాదపు నడక
వెలిగించిన జీవన నదులెన్నో
నిప్పులు కురిసే తిరోగమనాలను పక్కకునెట్టి
నెత్తుటి తడిలేని నెర్రెల గాయాలతో
మోసుకొచ్చిన భారాన్ని ఆప్యాయతగా భరించి
గుప్పెడు ఆర్ద్రతను పన్నీటిలా చిలకరించి

## పాదానికి ప్రణమిల్లి...

ముక్కలైన పరితపనల్ని కలిపికుట్టి
మనిషితనానికి దీపంతగా మారిన
పాదం నిజంగా నిశీథిలో సూర్యుడే
అబద్ధపు అద్దకాలు లేని ఆకాశపు చంద్రుడే
ఆలోచనే కనిపించే నిఖార్సైన నిజమే
కొత్త దృశ్యాలను పొదుగుకున్న మట్టి దీపమే
నిర్మలంగా ప్రవహించే కవిత్వమే
దుఃఖపు జీరల్ని అమృతపు ధారల్లా మార్చి
అనంత నీలిమలో మనిషిని అద్భుత శక్తిగా నిలిపిన
పాదానికి తలొంచితే తప్పేంటి..?
మోసేటి పాదానికే తెలుస్తుంది
దాడికి సిద్ధంగా ఉన్న దెబ్బల అలజడి
నాయకుడంటే నడిపించే వాడు
మనిషెప్పుడూ గొప్పోడు కాదు
నడుస్తూ నడిపించే పాదమే అసలైన నాయకుడు
చితిదాకా కలిసొచ్చి
చెమ్మగిల్లిన కళ్ళతో కలిసి కాలిపోయే
పాదమే గొప్ప త్యాగమయి
నేలపైన తలొంచక నడిచిన
మట్టితడి ఆరని అవిశ్రాంత పాదానికి సాష్టాంగపడతా!
అనంతాన్ని ఆపాదించుకున్న పాదానికి ప్రణమిల్లుతా
ఆ నడకలో పరివ్యాప్తమవుతా
గాయపడ్డ ప్రతిసారీ
నడక సాగిన ముద్రల్లో కొత్త గేయమై పుడతా
పాదం తాత్విక సమ్మిళిత సోపానం.
పాదం సృజన పదనిర్దేశం
పాదం పరమోత్కృష్టం
పాదం ప్రపంచానికి దారిదీపం
పాదం అనుభవాల పరిమళం
పాదం సామాజిక భూమిక
పాదం సమగ్ర జీవన సూచిక

– డా. తిరునగరి శ్రీనివాస్
8466053933



## మర్వకురా!!

అన్నీ మరిచినా పర్వాలేదు మిత్రమా జన్మ నిచ్చిన తల్లిదండ్రులను మర్వకు
నీ జన్మ కొరకు కొండలు ఎక్కి పూజలెన్నో చేశారు మిత్రమా
నీవే రాతివై తల్లిదండ్రుల గుండెలను పిండి చేయకు మిత్రమా.

తాను పస్తులుంటు నిద్రలేని రాత్రులు గడుపుతూ
నిన్ను పెంచి పెద్ద చేశారు మిత్రమా
అమృతము ఇచ్చిన వారిపై విషమును చిమ్మబోకు మిత్రమా.
ఎంత గారాబము చేసిరి నీ కోరికలు తీర్చ దానికి
యెన్ని పాట్లు పడిరి మిత్రమా .

వారి కోరికలు తీర్చుట మాత్రము మరవద్దు మిత్రమా.
లక్షలెన్ని సంపాదించినా గానీ తల్లిదండ్రులకంటే ఎక్కువా?
సేవ చేయకపోతే అంతా వ్యర్థము మిత్రమా.

తాము తడినేల మీద పడుకొని నిన్ను పొడినేల పరుండ బెట్టిన, అమ్మ
అమృత కన్నుల నుండి ఎన్నడు తడిరానికూ మిత్రమా.

నీమార్గములో ప్రతి నిముషము పూలు జల్లిన వారికి, వారి మార్గమున
ఎన్నడూ నీవు ముళ్లను పరువబోకు మిత్రమా.

ధనమెన్నటికైనా దొరుకును తల్లిదండ్రులు దొరకెదరా మిత్రమా
ఆ దేవతమూర్తుల కోరికను ఎన్నడూ నీవు మరవబోకు మిత్రమా
వారి ఉపకారములు ఆనంతము
ఈ విషయము మరవద్దు మిత్రమా

-అనిత దావత్
9394221927



"కవి సాయంత్రం" అధ్యక్షులు ముక్కెర సంపత్‌కుమార్ సోషల్ మీడియా గ్రూపులో నిర్వహిస్తున్న నిర్వహించిన పోటీలో ఎంపికైన ఉత్తమ కవితలు..
– ముక్కెర సంపత్ కుమార్,
సెల్:9959618206



### పిలుపు

ఉద్యమానికి
పిలుపులే
జాగృతగీతాలని
ఆనవాళ్ళున్నాయిగా.

పిలుపే
ఒక తొలి అడుగు
రణానికైనా
తోరణానికైనా.

పిలుపులో
మార్దవమునీటే
పొంగి దిగదా
పొగరుబోతు గిత్తైనా

-పోతుల ఉమాదేవి,
హన్మకొండ



పగిలే రాయి కన్నా
చెక్కే ఉలై పో
మొద్దు బారినేమీ
పదునుకు తయార్..

ఎవరికీ
వినబడ లేదు
గుండె పగిలిన శబ్దం
కంటికేమో జాలి.

విత్తేటప్పుడు భద్రం
మనసులో నన్నా..
మట్టిలో నైనా..
ఫలం మనకే...

– సుజాత నల్లం,
పుదుచ్చేరి



### కారం

చుట్టు శ్రీకారం
మంచితనానికి
యోచించు
పరిష్కారం చెడుకు.

నలిగిపోతోంది
అధికారం
పాదాలకింద
మమకారకీటకం.

భావాల చమత్కారం
సాహితీ
సరస్వతికి
అలంకార ఆభూషం

– డా. కమలాదేవి,
న్యూఢిల్లీ



### నేను

ఒంటరిని కాదు
సూర్యచంద్రులు
పలకరిస్తుంటారు గుడిసెలోంచి.

గిన్నెలు
తెల్లముఖం వేసాయి
చాలా రోజులుగా
పిల్లి పొయ్యిలోంచి లేవక.

ఇంద్రుని దేహం
నా గుడిసె కప్పు
ఎన్నెన్ని
కళ్ళతో చూస్తుందో లోకాన్ని

– మధుమురళి,
భీమారం



### దైవం

చేసే ప్రతి పనిని
దేవుని పూజలాగా చేస్తే,
దేవుడు మీ చెంత
విజయం మీ సొంతం.

శ్వాసతో ఉంటే
ప్రాణం ఉంది అనేది
ఎంత నిజమో,
దైవం ఉంది అనేది అంతే నిజం.

దైవ అనుగ్రహం
తొందరగా పొందాలంటే,
అంతః సౌందర్యం
అవసరం.

– మందడి విజయలక్ష్మి,
హైదరాబాద్



### ఎన్నికలు

కళ్ళు కలల
నిచ్చాయి.
రాజకీయం కుళ్ళు
నిచ్చింది.

ఎన్ని కలలో
కన్నవాళ్లకు
ఎన్నికలలో
నిలుచున్నవాళ్లకు.

ఎన్నికల వేడి
పెరిగింది.
ఓటేస్తే
వాళ్ళే మీ ఏ.సీ. లట.

– చదువు స్వరూప,
హన్మకొండ




నోటు మీది
గాంధీ నవ్వు సాక్షిగా
నేటి ఓటు
నవ్వుల పాలైంది!

ఏలికల వలలో
ఓటరు ఓ చేప
రాజకీయం
నేడు వ్యాపారమేగా!

ఎన్నికలు
ఎన్ని కలలు
పాలకులకు ఫలం
పాలితులకు నిష్ఫలం!

-మణి నిడిగొండ,
భూపాలపల్లి




ఐదేళ్లకోసారి
రాజవుతావు..!
ఓటును అమ్మితే
బానిసవ్వవా మరి..

కంటికి మింటికి
నీరే విలువ...
ఎక్కువైతే
అతివృష్టే..!

సమస్య
లేనిదెవరికి..?
మిలియన్ డాలర్ల
ప్రశ్నిది..!

– రమేశ్ కలగటి,
బొబ్బిలి




రాత్రి నక్షత్రాలు
చిన్నబోయాయి
నీ నవ్వుల
తళుకులను చూసి..

మండే ఎండంటే
భయమెందుకు
అమ్మ చీర కొంగు
తలపై ఉండగా..

పొలంలో అరటిచెట్టు
ఏపుగా పెరిగింది
ఎదిగొచ్చిన
కొడుకులా.

-జె. డి. వరలక్ష్మి,
గోకవరం



### అహం

అహం
అగ్ని లాంటిది!
ఎవరినీ
దరి చేరనీయదు!

### రైలు ప్రయాణం

రైలు
పట్టాలపై నడుస్తుంది!
రోడ్లు
ఇరుకయినవి కదా!!

### మొక్కులు

దేవుడికి
మొక్కని రోజు లేదు
మొక్కులు
తీర్చుకునే రోజు రాలేదు

-జగన్, హైదరాబాద్



వృక్షానికి
"పెద్ద వేరు" పునాది
"గతం "జీవితానికి
"పునాది".

'చర్య'"పరిస్థితికి
అనుగుణంగా
ఉండాలి
"ప్రతి చర్య "స్థితి గతిని మార్చాలి.

బంధం జీవితాలను
ముడి వేసేది
నిర్బంధం స్వేచ్ఛా
బతుకును హరించేది

– యశోద గొట్టిపర్తి, హైదరాబాద్



కాలాన్ని వడ్డిస్తూ
తను మాత్రం
చిరుగుతుంది కేలండర్
అచ్చంగా అమ్మలా

పిల్లతెమ్మెర వీచే
పువ్వులకు
జత కలిసే తేటీగను
స్వాగతిస్తూ.

నల్లబల్ల సిద్ధమైంది
మళ్ళీ పిల్లల
జీవితాలకి
రంగులద్దుతూ

-డా. శ్రావణసంధ్య,
హన్మకొండ



పట్టా పుస్తకాలు
లేని వ్యవసాయం
పస్తులు నేర్పింది
అన్నం సప్పబడ్డది.

ఓటరుకు ఓటు
నేర్పిందో తెలుసా
హామీలు మరిస్తే
గద్దె దింపే శక్తిని.

వసంత ఋతువు
వచ్చింది
శిశిరాన్ని చిదిమి
చిగుర్లేశింది.

-ఫర్జానా, హన్మకొండ



పార్టీలు,పదవులు
మారాయి.
మారంది మాత్రం
మనుషులే...!!


నేసే మగ్గం
మూలకు పడ్డది.
నేతన్న మెడకు
ఉరి పడ్డది..!!.

నాకు నేనే
ప్రశ్నైతే ఏం లాభం?
ప్రశ్నించు గొంతుకే
నేడు అవసరం..!!

– శ్రీధర్ దాసరి, వరంగల్



హైదరాబాద్, మే1 (నేటినిజం ప్రతినిధి): సాహిత్యం సకల కళానిలయం. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం ఈ ఐదింటిని లలిత కళలు అంటారు. ఈ లలిత కళలను గురించి రచనలో చూపించగలిగేది శాశ్వతపరచ



# విశ్వవ్యాప్త చిత్రకారుడు డా॥ కొండపల్లి శేషగిరిరావు-డా॥ఎన్.గోపి

గలిగేది సాహిత్యం. సాహిత్యం హితాన్ని కోరుతుంది. అటువంటి సాహితీ సంపద విరాజిల్లిన సభా కార్యక్రమం అచ్చంగా ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ 2024 ఏప్రిల్ 27 న హైదరాబాద్ కొత్తపేటలో నిస్సెన్ హెచ్ హోటల్లో జరిగింది. మొదటి సెషన్ లో"చిత్రకళ తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు కీ జీవన గాథ"హిందీ అనువాద గ్రంథం, రెండవ సెషన్ లో " అనివార్యం" స్త్రీవాద సాహిత్య విమర్శ వ్యాస సంపుటి,మూడవ సెషన్ లో "కథా మయూఖం", "బాల కథా మయూఖం" కథా సంకలనాల ఆవిష్కరణ,నాలుగవ సెషన్ లో "మిగిలేవి గురుతులే" కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు జరిగాయి.

డాక్టర్ కొండపల్లి నీహారిణి 2009 లో రచించిన " చిత్ర కళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరి రావు జీవిత చరిత్ర" గ్రంథాన్ని" చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావుకీ జీవన్ గాథా" అనే పేరుతో డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్య హిందీలోకి అనువదించారు.పుస్తకాన్ని ముఖ్యఅతిథి డాక్టర్ ఎన్. గోపి ఆవిష్కరిస్తూ "కొండపల్లి శేషగిరిరావు మన దేశం గర్వించదగిన జాతీయ చిత్రకారులు, వీరు 'విశ్వ చిత్రకారులు' అని కొనియాడారు. రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన' శాంతి నికేతన్, విద్యార్థి. జె.ఎన్. టీ. యూలో ఆర్ట్ ప్రొఫెసర్, చక్కని చిత్రకారులు , వేలాది బొమ్మలు చిత్రించిన గొప్ప చిత్రకారుడు కొండపల్లి" అంటూనే "ఎందరో విద్యార్థులను చిత్రకారులు గా తీర్చిదిద్దిన కొండపల్లి శేషగిరిరావు శత జయంతి సందర్భంగా వీరి పేరు మీద నేటి మన చిత్రకారులకు కీర్తి పురస్కారాన్ని ఇవ్వాలి" అని కూడా అన్నారు. సభాధ్యక్షులు ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ, "ప్రకృతి చిత్రాలు, మోడరన్ ఆర్ట్ చిత్రాలు, సంప్రదాయ చిత్రాలు ,పౌరాణిక చిత్రాలు, స్వాతంత్ర్య పోరాటాల చిత్రాలు వంటి గొప్ప గొప్ప వేలాది చిత్రాలను చిత్రించిన కొండపల్లి శేషగిరిరావు చిత్రాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నది''అని, అటువంటి విలువైన చిత్రాలను కాపాడడం అనేది వ్యక్తులతో అయ్యే పని కాదు సంస్థలు చేయాల్సింది, ఇంత గొప్ప కార్యాన్ని వీరి కుమారుడు కొండపల్లి వేణుగోపాల్ రావు తమ భుజస్కంధాలపై వేసుకున్నారు ఇది గొప్ప విషయం" అని అన్నారు. అనువాద రచయిత డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ, నాకు తెలిసినం తవరకు ఇలా మామగారి గురించి పుస్తకం రాసినవాళ్ళల్లో మొట్ట మొదటి రచయిత్రి కొండపల్లి నీహారిణి గారే కావచ్చు, ఇది సాహిత్య చరిత్ర లో నిలిచిపోయే గ్రంథం" అని అన్నారు. మూల రచయిత్రి డాక్టర్కొండపల్లి నీహారిణి మాట్లాడుతూ " అద్భుతమైన చిత్రాలు చిత్రించిన మా మామయ్య గారి చిత్రకళా జీవితం భావితరాలకు స్ఫూర్తి దాయకం, అంత మంచివారు కాబట్టే అంత శ్రమశీలి కాబట్టే నేను వారి గురించి లోకానికి తెలియాలని వారి జీవిత చరిత్ర ను 2008లోనే రాసానని, ఈ గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం వచ్చింది అని, వీరి ఆదర్శ వంతమైన జీవితం మన తెలుగు వారి కే కాకుండా దేశ భాష అయిన హిందీలో వస్తే అందరికీ వెళ్తుందని అనువాదం చేయించామనీ, అందరూ తప్పకుండా చదవాల్సిన పుస్తకం" అని అన్నారు. కొండపల్లి నీహారిణి భర్త కొండపల్లి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ " మా నాన్న గారి జీవిత చరిత్ర, వారు చిత్రించిన అందమైన చిత్రాలతో కలిపి ఇంగ్లీష్లో కాఫీ టేబుల్ బుక్ ప్రింట్ చేయించి మొన్న మా నాన్న గారి జన్మదిన వేడుకల్లో భాగంగా జనవరి 27 న వారు రిటైర్ అయిన కళాశాల జె. ఎన్ టి యు . ఆడిటోరియం లో ఆవిష్కరణ చేసామని , ముందు ముందు ఇంతవరకూ ఎవరూ చూడని వారి చిత్రాలతో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాను అని అన్నారు.

రెండవ సెషన్ లో కొండపల్లి నీహారిణి రచించిన "అనివార్యం"స్త్రీవాద సాహిత్య విమర్శ వ్యాస సంపుటిని మాడిశెట్టి గోపాల్ వ్యాఖ్యాత గా వ్యవహరించారు. డాక్టర్ ముదిగంటి సుజాత రెడ్డి ఆవిష్కరించారు. స్త్రీవాదం ఎందుకు అని వార్యమైంది అనే రీతిలో ఆలోచింపచేసే లా వివిధ సందర్భాలలో రాసిన విశ్లేషణాత్మక విమర్శనాత్మక వ్యాసాల సమాహారమే ఈ "అనివార్యం" అంటూ నిహారిణి చాలా లోతైన వివేచనతో స్త్రీవాదానికి సంబంధించిన కవిత్వం , కథలు, నవలలు వంటి అన్ని ప్రక్రియలను తీసుకుని రాయడం ఈ పుస్తకంలో చూస్తాం.అలాగే, బతుకమ్మ బోనాలు, సమ్మక్క జాతర వంటి సందర్భాల గురించి కూడా విశ్లేషణతో ఉన్న వ్యాసాలు రాసిన నీహారిణి ని అభినంది స్తున్నాను అని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ సూర్య ధనుంజయ్ మాట్లాడు తూ, కొండపల్లి నీహారిణి సౌజన్యమూర్తి అని నిరంతరం సాహిత్యం కొరకు తపన పడే రచయిత్రి"అని ప్రశంసించారు.ముఖ్య అతిధి గా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ కొండపల్లి సాహితీ సేవను కొనియాడుతూ, నీహారిణి తన కవిత్వంలో స్త్రీ సమస్యలను చూపిస్తూనే సున్నితంగా పితృస్వామ్య వ్యవస్థను విమర్శిస్తుంది అంటూ ఉపన్యాసిం చారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆచార్య మసన చెన్నప్ప డాక్టర్ కొండపల్లి నిహారిణి అంటే సాహితీ ప్రపంచంలో మంచి పేరు ఉన్న వ్యక్తి అని,ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "ఒద్దిరాజు సోదరుల జీవితము సాహిత్యము" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్న విదుషీమణి అని కొనియాడారు. ఆత్మీయ అతిథులుగా వచ్చేసిన రచయిత్రి జ్వలిత మాట్లాడు తూ వ్యాసరచన విధానం లో కొండపల్లి నీహారిణిగారిది అందవేసిన చెయ్యి అని అన్నారు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ..కొండపల్లి నీహారిణిగారు ఇక్కడ ఇండియాలో ఉన్నా, అక్కడ అమెరికాలో ఉన్నా ఆన్లైన్లో కనిపిస్తూ ఉంటారు. కవిత్వము, వ్యాసరచన, కథా రచన చేస్తూ, అటు కుటుంబాన్ని చూసుకుంటూ ఇటు పత్రికలు నడుపుతూ స్త్రీ శక్తికి మారుపేరుగా ఉన్నారు అని అన్నారు. ఈ సభా కార్యక్రమంలో కవయిత్రి చెన్నోజ్వల పద్మశ్రీ వందన సమర్పణ చేశారు.

ఈ సభలోని మూడవ సెషన్లో కొండపల్లి నీహారిణి నిర్వహిస్తున్న అంతర్జాల పత్రిక "మయూఖ పత్రిక" లో అచ్చయిన కథలను "కథామయూఖం", "బాల కథా మయూఖం"పేర్లతో రెండు కథా సంకలనాలుగా ముద్రించారు. ఈ పుస్తకాలను డాక్టర్ అమృత లతగారు ఆవిష్కరించారు. పత్రికా నిర్వహణ కత్తి మీద సాములాంటిదని ఈ రోజులలో పెద్దపెద్ద పత్రికలే నిలదొక్కుకోవడానికి కష్టమవుతున్నటువంటి సందర్భంలో ఆన్లైన్ పత్రికలు గానే తెస్తున్నా , నీహారిణి పెద్ద భారాన్ని తలకెత్తుకున్నదని అన్నారు. ఖర్చుతో కూడుకున్న ఈ వ్యవహారంలో జాగ్రత్తగా అడుగు వేయాలని హెచ్చరించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బైసా దేవదాస్ గారు మాట్లాడుతూ..కొండపల్లి నీహారిణి కవయిత్రిగా, రచయిత్రిగా మంచి పేరును తెచ్చుకున్నారు, ఇప్పుడు పత్రికాధిపతిగా పేరు తెచ్చుకున్నారు. వారి కుటుంబిక జీవితంలో ఎలా నిలుదొక్కుకున్నారో అలా సాహిత్యం లోనూ నిలదొక్కుకున్నారు అన్నారు. ఈ ఆధునిక సమాజంలో వార్తా పత్రికల పాత్ర ఎంతో గణనీయమైనదని చెబుతూ, కానీ సాహిత్యం కోసమే పత్రిక నడిపే సంపాదకుల కష్టాలు వేరుగా ఉంటాయి అన్నారు.కొండపల్లి నీహారిణి తమ లక్ష్యాన్ని సాధించాలని అభిలాషిస్తున్నానని అన్నారు.గౌరవ అతిథులుగా విచ్చేసిన డాక్టర్ చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ " మయూఖ పత్రికలో వచ్చిన కథల"కథా మయూఖం" కథలన్నీ సామాజిక జీవన పరిస్థితులకు అద్దం పడుతూ సందేశాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉన్నవి అని చెప్తూ, 53 మంది రచయితలు రాసిన 330 పేజీల ఇంత పెద్ద పుస్తకాన్ని ఏ లాభాపేక్ష లేకుండా ప్రచురించడానికి నీహారిణి పడిన శ్రమను అందరూ అభినందించాల్సిందే అని అన్నారు. గౌరవాతిథిగా విచ్చేసిన వేదాంత సూరి మాట్లాడుతూ " బాల కథా మయూఖం" కొండపల్లి నీహారిణి నిర్వహిస్తున్న మయూఖ పత్రిక బాలసాహిత్యం లో ప్రచురితమైన కథలను ఒక్కచోట ఇందులో చేర్చారన్నారు. బాలసాహిత్యం మన తెలుగు లో మరింత ఎక్కువగా రావాల్సిన అవసరం ఉందని నీహారిణి గారు ఎప్పుడూ తపిస్తుంటారని అమెరికా ఫోన్ లో మాట్లాడుతూ ఉంటే తెలుస్తుందని అన్నారు. డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ కొండపల్లి నీహారిణి నవ్యవంతమైన కవయిత్రి రచయిత్రి అని చెబుతూ,నేను రచించిన గ్రంథంలో నీహారిణి గారి కవిత్వాన్ని విశ్లేషణ చేస్తూ రాసానని అన్నారు. డాక్టర్ కుమార్ డిక్కీర్ మాట్లాడుతూ, చైతన్యవంతమైన ఆలోచనలతో, స్ఫూర్తిదాయకమైన కవిత్వాన్ని రచించే కొండపల్లి గారు అటు వ్యాపారవేత్తగానూ ఇటు పత్రిక సంపాదక బాధ్యతలోనూ తలమునకలవుతున్నారు. సమకాలీన సాహిత్యాన్ని చదువుతూ తనదైన రీతిలో విశ్లేషణ చేసేప్పుడు చాలా శ్రద్ధ తీసుకుంటారు అంటూనే కథా రచనలో వస్తువుపై దృష్టి పెడుతున్నా,శిల్ప ప్రాధాన్యత తగ్గుతున్న నేటి రచనా విధానాన్ని చర్చిస్తూ ఉంటారు అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కవయిత్రి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ తన చిన్ననాటి స్నేహితురాలు అంటూ," నీహారిణి కవయిత్రిగా రచయిత్రిగా ఇంత ఎత్తుకు ఎదిగినా కొంచెం కూడా గర్వం లేకుండా అందరితో బాగా ఉంటుంది. గత మూడేళ్ళుగా మయూఖ పత్రిక , తరుణి పత్రిక అనే పేర్లతో అంతర్జాల పత్రికలను శ్రద్ధగా నడుపుతూ మెరుగునపడిన రచయితలకు, కొత్తగా రాస్తున్న రచయితల కూ వేదికలను సిద్ధం చేసిందన్నారు. కవి నరేష్ చారి వందన సమర్పణ చేశారు.

చివరి సెషన్లో ధూళిపాళ అరుణ రచించిన "మిగిలేవి గురుతులే" కథా సంపుటి ఆవిష్కరణ జరిగింది. సభాధ్యక్షురాలు నెల్లుట్ల రమాదేవి, ధూళిపాళ అరుణను పరిచయం చేస్తూ మయూఖ అంతర్జాల పత్రికలో గొప్ప గొప్ప సాహితీవేత్తలను ఇంటర్వ్యూ చేస్తోందని కొనియాడారు. ముఖ్యఅతిథి పుస్తక ఆవిష్కర్త డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. ధూళిపాళ అరుణ కథలలో స్త్రీల అంతరంగ ఆవిష్కరణ చక్కగా ఉన్నదని అన్నారు. ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నా అనుకూలంగా మార్చుకొని ధైర్యంగా నిలబడే శక్తి సామర్థ్యాలు స్త్రీలకు ఉండాలనే తపనతో రాసిన కథలుగా ఈ కథలను నిర్వచించవచ్చు అన్నారు. ఈ కథాసంపుటి కృతి స్వీకర్త ఒద్దిరాజు మురళీధర్ రావు గారు తమ సందేశాన్ని పంపించారు. మొదటి ప్రతిని వీరి తరపున రంగరాజు పద్మజ గారికి అందజేసారు. గౌరవ అతిథిగా వచ్చేసిన డాక్టర్ నాళేశ్వరం శంకర్ ఈ కథాసంపుటిలోని కథలను సమీక్షిస్తూ ధూళిపాళ అరుణ హృదయావిష్కరణను చేశారు. "మనుషుల మధ్య ఉన్న గోడలకు మనసుంటుంది" అనే తీరును రచించిన కథను విశ్లేషణ చేస్తూ, సమాజం పట్ల లోతైన అవగాహన కల రచయిత్రిగా అభివర్ణించారు. ఆత్మీయ అతిథి కందుకూరి శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి సోమవారమ నిర్వహించే జూమ్ మీటింగ్ కవిసమ్మేళనంలో ధూళిపాళ అరుణ మంచి కవితలు చదువుతారని కొనియాడారు. మరో ఆత్మీయ అతిథి బెల్లంకొండ సంపత్ మాట్లాడుతూ ప్రతిభావంతమైన రచయిత్రి, కవయిత్రి ధూళిపాళ అరుణ గారు తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ నిర్వహించే సభలలో పాల్గొనడం సంతోషదాయకం అన్నారు. "మయూఖ పత్రిక,"కోసం ఇంటర్వ్యూ లు తీసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ధూళిపాళ అరుణను, కొండపల్లి నీహారిణి అభినందించారు. చివరగా నక్క హరికృష్ణ వందన సమర్పణ చేశారు.



హిందీ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ఎన్.గోపి, డా॥కొండపల్లి నీహారిణి, వేణుగోపాలరావు, ఓలేటి పార్వతీశం, డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు, మాడిశెట్టి గోపాల్.



'అనివార్యం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ ముదిగంటి సుజాతారెడ్డి



'బాల కథా మయూరం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ అమృతలత



'కథా మయూఖం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ అమృతలత



'మిగిలేవి గుర్తులే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి.

# పత్రికల గొంతు నొక్కితే ప్రగతి కుంటుబడుతుంది..!

ప్రపంచవ్యాప్తంగా ఐరాస సారథ్యంలో ప్రతి ఏటా 03 మే రోజున 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం' నిర్వహించుట ఆనవాతీగా వస్తున్నది. 1991లో యునెస్కో నిర్వహించిన పత్రికా స్వేచ్ఛ సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం ఐరాస జనరల్ అసెంబ్లీ 1993లో 03 మే రోజున ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం జరుపుకోవాలని నిర్ణయించారు. 30వ దినోత్సవాన్ని సభ్యదేశాల 03 మే 2023న ఘనంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం-2024 నినాదంగా 'పర్యావరణ పరిరక్షణ పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ ప్రాధాన్యం' అనే అంశాన్ని తీసుకున్నారు. పత్రికలు ప్రజా గొంతుకలుగా ఎనలేని సేవలను అందిస్తున్నాయి.

## ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధి:

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా పత్రికలు నిలుస్తున్నాయి. ప్రభుత్వ పథకాల విశ్లేషణలు/విమర్శలు, అనుకూల ప్రతికూలతలు, అవినీతిపరుల/ స్కామ్ బండారాల్ని బయట పెట్టడం, మానవ హక్కుల పరిరక్షణ సేవలు, విజ్ఞాన/వినోద/క్రీడ/రాజకీయ సమాచార వితరణలు, ప్రజా సమస్యలకు గళం కలపడం లాంటి అంశాల్లో పత్రికలు అద్వితీయ సేవలు అనుదినం అందిస్తున్నాయి. కరోనా పలు వేవ్ల విజృంభన అకాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంతో జీవన చక్రం సజావుగా సాగేలా చూడడం, ప్రజలకు నిరంతరం అత్యవసర సేవలను అందించడం లాంటి సేవలను పత్రికలు బాధ్యతగా అందించడం చూసాం.

## విలేకరుల విధి నిర్వహణ ప్రాణాంతకంగా మారుతోందా?!

పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన మౌళిక సూత్రాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ చర్యలు, పత్రికల స్వతంత్రతను కాపాడటం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన జర్నలిస్టులకు నివాళులు అర్పించడం లాంటి చర్యలను ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం వేదికలను వాడుకుంటారు. 'కరోనా-పాండెమిక్' సంక్షోభంలో 'ఇన్ఫో-డెమిక్' తరహాలో పత్రికలు ప్రజలను చైతన్య పరచడం, కరోనా క్రమశిక్షణలను వివరించడం చూసాం. నేటి కొన్ని పత్రికలు తమ తమ స్వంత ఎజెండాలు/అనుబంధాలతో ప్రజలకు నమ్మదగిన సమాచారాన్ని అందించడంలో విఫలం అవుతున్నాయనే విమర్శలను మూట కట్టుకుంటున్నాయి. జర్నలిస్టుల విధి నిర్వహణ పలు సందర్భాల్లో ప్రమాదకరంగా, ప్రాణాంతకంగా కూడా మారిన ఉదాహరణలు ఎన్నో చూశాం. ప్రపంచవ్యాప్తంగా అధిక దేశాల్లో పత్రికా స్వేచ్ఛకు భంగం వాటిల్లుతున్నట్లు తేలింది.

## పత్రికల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యానికే విరుద్ధం:

ప్రస్తుత ప్రభుత్వాలు పత్రికా వ్యతిరేక విధానాలతో కొందరిని జాతి-వ్యతిరేక జర్నలిస్టులుగా ముద్ర వేసి బెదిరింపులు, పత్రికల గొంతులను నొక్కడం, పత్రికారంగంపై ఆదిపత్య ధోరిణి పెరిగాయనే వార్తలు వింటున్నాం. ప్రభుత్వ ధోరిణిని విమర్శించే పత్రికా యాజమాన్యాలు, విలేకరులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టుల విధులకు ఆటంకంగా నిలుస్తూ, ప్రభుత్వంపై విమర్శనాత్మక వ్యాసాలను రచించే వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని పలు నివేదికలు తెలియజేస్తున్నాయి. పత్రికా విలేకరుల కదలికలపై నిఘా పెట్టడం, పోలీసుల బెదిరింపులు, రాజకీయ నాయకులు నిఘా పెట్టడం, హింసా ప్రవృత్తిని కనబర్చడం, నేర గ్రూపుల హింసలు, అవినీతి అధికారులు/రాజకీయ నాయకుల బెదిరింపులు పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నాయని తెలిపింది. హిందుత్వ భావనలతో పత్రికా స్వేచ్ఛకు అడ్డుతగులుతూ, కొందరు విలేకరుల ప్రాణాలు తీసే స్థాయికి హింసా ధోరిణి పెరిగిందని నివేదికలు వివరిస్తున్నాయి. కరోనా నిబంధనల పేరుతో గత సంవత్సర కాలంగా పత్రిక విలేకరులపై దాడులు పెరిగాయని, కాశ్మీర్లో పోలీసులు, మిలిటరీ, పారామిలటరీ దాడులతో పత్రికా స్వేచ్ఛ పతన స్థాయిలోకి పడిపోయిందని వింటున్నాం.

## ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిక:

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిక-2023లో ఉన్న 180 దేశాల్లోని 52 దేశాలు మాత్రమే ప్రత్రికా స్వేచ్ఛను పూర్తిగా అనుభవిస్తున్నాయని నివేదిక తెలియజేసింది. సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం 31 దేశాల్లో పత్రికా గొంతు పూర్తిగా (వెరీ బ్యాడ్) నొక్కడం జరుగుతోందని, భారత్ లాంటి 97 దేశాల్లో పాక్షికంగా (బ్యాడ్) విఘాతం కలుగుతోందని వర్గీకరించింది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో 1వ స్థానంలో నార్వే, 2వ స్థానంలో ఐర్లాండ్, 3వ స్థానంలో డెన్మార్క్, 4వ స్థానంలో స్వీడెన్, 5వ స్థానంలో ఫిన్లాండ్ దేశాలు సగర్వంగా నిలిచాయి. భారతదేశం 161వ స్థానంలో నిలువగా పొరుగు దేశాలు నేపాల్ 76వ స్థానం, పాకిస్థాన్ 150, బంగ్లాదేశ్ 163వ స్థానాల్లో ఉండడం జరిగింది. పత్రికా స్వేచ్ఛ జాబితాలో చివరన నార్త్ కొరియా(180 స్థానం), చైనా(179), వియత్నాం(178), ఇరాన్(177) దేశాలు పత్రికల గొంతును నొక్కడంలో ముందున్నాయి.

## పత్రికా స్వేచ్ఛతో అవినీతి అదుపు:

పత్రికా స్వేచ్ఛకు విలువ ఉన్నపుడే ప్రభుత్వ పథకాల్లోనే కాకుండా ఇతర వ్యవస్థలో జరుగుతున్న లోపాలు బయట పడతాయని గమనించాలి. పత్రికా స్వేచ్ఛకు పట్టం కట్టిన దేశాల్లో అవినీతి అంతం కావడం, సుపరిపాలన సాధ్యపడడం, ప్రజానీకానికి మేలు జరగడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయని గుర్తుంచుకోవాలి. పత్రికల గొంతును నులిమితే అన్యాయానికి పట్టాభిషేకం చేసినట్లే అని గమనించాలి. పత్రికలే ప్రజల గొంతులు, సమాచార మాధ్యమాలే అన్యాయ అంత సంకేతాలని అందరం నమ్ముదాం. పత్రికా స్వేచ్ఛను పెంచి పోషిద్దాం.

(03 మే 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం' సందర్భంగా)

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

**నేటినిజం** సభ్యత్వ రుసుము

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు'
**5** సం॥రాలకు రూ. **700/-**లు.
**10** సం॥రాలకు రూ**1200/-**లు.
పత్రిక కావాలనుకున్నవారు సభ్యత్వ రుసుమును
సెల్: **9705011453** కి
గూగుల్పే/ఫోన్పే ద్వారా పంపవచ్చు.

'నేటినిజం' దినపత్రిక,
ఎస్ఆర్టి-169, జవహర్నగర్, హైదరాబాద్-500 020.

## పెట్టుబడిదారి

ఈ దేశంలో
ఎన్నికల అంగట్లో
చౌకగా దొరికేది
ఓట్ల ఉత్పత్తి..
అధికార తక్కెడలో
పేదల్ని ఆకల్ని
తూకం వేస్తే
ఖరీదైనది
ఓట్ల నిష్పత్తి..
ఈ దేశమిప్పుడు ఓ పెట్టుబడిదారీ-
లక్షలకోట్ల అప్పులకు నువ్వనేనే
జవాబుదారీ..

- ధర్పల్లి సాయికుమార్

## నాన్నా..నా భుజం మీద మీ చేయి...

బెరుకు బెరుకుగా మొదటి రోజు బడికి
పోనని ఏడ్చినపుడు...
కొత్త సైకిల్ మోజులో
ముందు వెనక చూడనపుడు...
పదో తరగతి గది దాటి
కాలేజి వైపు నడిచినపుడు...
డిగ్రీ పట్టా అందుకోడానికి
ఆడిటోరియం మెట్లు ఎక్కినపుడు...
నేను ఎదిగి మీ బరువు దించి
బాధ్యతలను స్వీకరించి
పనులు లెక్క వేసుకుంటు
వడివడిగా సాగుతుంటె
అలిసి బెదిరి కుంగినపుడు
మనసు కలత చెందినపుడు
ఎన్నెన్నోసార్లు చేయూత ఇచ్చిన మీ చేయి
ఈ రోజు నా బైక్ సీటు సింహాసనం పైన
మీరు రాజులా కూర్చొనగా,
నేను రథసారథినై నడుపుతుంటే
మీరు కళ్లు మూసి
మనసులో ముసిముసి నవ్వుతూ
నా భుజం మీద మీ చేయి
ఓ అద్భుతం అమోఘం
ఈ క్షణం
ఎన్నడూ ఎంతకూ తీర్చలేనిది మీ రుణం



-డా॥ మచ్చ మానస, సెల్: 9100637427

సాహిత్యం, సామాజిక సేవ,
విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

### అలుక..

కం. 1
కలికీ,నీకేలయలుక
కులుకే నీకందము, కనుకొలుకుల వగలున్,
వలపులు చిలుకగ రావే
చెలి,కులుకులు!మానుమలుక, చెలువపు మదితో..!
కం. 2
అలుకలు బూనిన,నెచ్చెలి!
చిలుకకుగలముక్కువోలె చెక్కిలిమారున్...
తలపులలోగల మెలికలు
తెలియును నా నరుణిమలను, తృటిలో సఖియా!
కం. 3
మందారపు కుసుమపు కళ
చిందించెదవేల, చెలియ! చిరుయలకలతో...
కందిన నీమోమునుగని
ఇందిందిరమై తిరిగెద, నింపగు నాకున్....!!

-గుమ్మన్నగారి బాలసరస్వతి
సిద్దిపేట

### అనుబంధాల లహరి

వలపుల తోటలో పిలుపుల సరిబాటలో
అలకల కులుకుల చినుకుల తోవ.
జీవిత కలల నావలో అందనీగా సాగ
ఎవరికి మరి ఎవరోగా నిన్నటికి
ఒకరికి ఒకరు ఒకరిలో నొకరు నేటికీ
మమతల పంటలు చిగురించని
మనసులు మరులతో పంచుకొని
అర్ధ నారీశ్వరమే అఖిలాండం అని
మూడుముళ్ళ బంధం ముజ్జగాలకంధం
సుమగంధం
ప్రేమానురాగాలనుబంధం.
అను నిత్యం నవ వసంతవనం
ప్రేమ విరితోటలో పరిమళించు
ప్రభాత కిరణాల పసిడి తాపడంతో
జీవనయానం ప్రేమసమీరపు జల్లుల.
చల్లని చక్కని వెన్నెల జలకాలాట సోనల్లో
వలపుల తలపుల సాగే పయనం
విరి తాపడంతో
సిరిజల్లులు కురియా
ముద్దు మురిపాలతో
తామరయుగా.
మమతల డోలిక సప్త వర్ణమాలిక
సొబగుల దరి ఆనందాల లహరి
దాంపత్య సీమనేలు
ఆలుమగలనుబంధం
సృష్టి ఉన్నంతవరకు
కనులు మెరయగా
సుందరవని ఈ పూవని
చూడచక్కగా.

-విజయకుమారి
9100634635

### అలక

సంసారం అనే పూదోటలో
ఆలుమగలు వలపు సరిగమలు పండించుకునే
అందమైన గువ్వల జంట.
అలక అందం ఆడవాళ్ళకే సుమా!
అలిగినా నవ్వినా అతివలకే సాధ్యం.
మూడుముళ్లతో వివాహ బంధానికి విలువను ఇచ్చి
పతి దేవుని సేవయే తన భాగ్యమని తలుస్తూ
నాథుడే తన సర్వస్వని భావించే స్త్రీ
ఇంట బయట విధులు చెక్కపెట్టుకుంటూ
సదనంలో అన్నిటతానై అందరికీ సపర్యలు చేసి
అలసి సొలసిన ఆమెకు
అలక వస్తే వేడి వేడి
కాఫీ చేతికి అందిస్తే అలక
చిటికెలో మటుమాయం
ఆప్యాయత ,అనురాగాలను పంచుకుంటూ
అప్పుడప్పుడు వచ్చే అలకలు తీరుస్తూ
సదనంలో చిరునవ్వులు పూయుంచుకున్న నాడు
ప్రతి ఇల్లు నందనవనమే సుమా!
సంసారం అనే నావను
లేకుండా తీరానికి చేరుస్తూ
అలకలను అప్పుడప్పుడు పక్కకు పెడుతూ
చిరునవ్వుల సింగారాలు మెరవాలి.

-రాచర్ల సులోచన,
హైదరాబాద్

### నీ పైన మనసాయేరా...

నీ బాహుబంధంలో ఇమిడిపోవాలని
నీ వలపుల వానలో తడిసిపోవాలని.
నీవు నా వెనుకే తిరుగుతుంటే మురిసిపోవాలని
నీ అధర మధురామృతంలో అన్నీ మరచిపోవాలని.
ఆసాంతం ఏకమౌతూ కరిగిపోవాలని
అనంత ప్రణయంలోతేలి అలసిపోవాలని.
అనునిత్యం నీతోనే ఉండిపోవాలని
నినువీడి అరక్షణమైనా నిలువలేనని.
నిను చేర మనసాయెరా నా స్వామి
నీకై సైకత సానువులపై వేచాను సుమీ.
ఝాము దాటిపోతున్నా జాగు చేతువేమి
రాత్రి కరిగిపోతున్నా ఇంకా నీవు రావేమి.
మరులు గొల్పేలా నీకై మల్లెలు తురుముకున్నాను
మధురానుభూతి నందించే అత్తరు అలదుకున్నాను.
కోరి వచ్చానని నీకు అలుసైతినా గోపాలా
ఈ గోపికను ఇకనైనా కరుణింపగా రావేలా
రేయి గడిచిపోతున్నా ఏదీ రమ్య రాసలీల
ఇక నీవుచూడని ఈ అలంకరణలన్ని నాకేలా
'అలకబూని' విసిరి వేస్తున్నా అన్నీ నీ ప్రోల
ఫో... నీ మోమైనా చూడదిక ఈ అందాల ముగ్ధ
నమ్మి మోసపోయానని గ్రహించింది ఈ విప్రలబ్ధ

-ఎస్. రత్నలక్ష్మి
నంద్యాల







Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com